Follow: @ANNTELUGU
30-07-2026
ANN తెలుగు
# మహా పత్రిక
గురువారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 207 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## విద్యార్థులపై దాడికి అమిత్ షాదే బాధ్యత

- లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ.
- క్షమాపణ చెప్పే ప్రసక్తే లేదు..

**ఢిల్లీ, మహా :** కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో నిర్వహించిన 'చలో పార్లమెంట్' ర్యాలీ సందర్భంగా విద్యార్థులపై జరిగిన పోలీసుల దాడి ఘటనకు కేంద్ర హోంమంత్రి అమిత్ షానే బాధ్యత వహించాలని లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ ఘటనపై అమిత్ షా దేశ విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. బుధవారం ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన రాహుల్ గాంధీ, లోక్‌సభలో తాను చేసిన వ్యాఖ్యలను సమర్థించుకుంటూ తన వైఖరిని మరోసారి స్పష్టం చేశారు.దేశ ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై మాట్లాడటం తన హక్కు అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అయితే లోక్‌సభలో తనకు మాట్లాడే

మిగతా 2వ పేజీలో

టాప్ న్యూస్



### మగాడు మగాడిలా మాట్లాడాలి

- ఓ స్త్రీని రాజకీయాల్లోకి లాగడం సమంజసమేనా?
- వైసీపీ నేతలపై నారా భువనేశ్వరి ఫైర్

02



### నిరుద్యోగి.. పనికిరానివాడు

- నేను ఆ వయసులో రెండునేషనల్ అవార్డులు సాధించా
- కాక్రోచ్ పై మరోసారి కంగనా ఫైర్

02



### ప్రభుత్వ పాఠశాలల్లో చికెన్ బిర్యానీ

- విజయ్ సర్కార్ సంచలన ప్రతిపాదన
- దేశంలోనే తొలి రాష్ట్రం

02



### తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులకు సుప్రీంకోర్టు ఊరట

- పర్యావరణ అనుమతులకు లైన్ క్లియర్
- సీతారామా, పాలమూరు, సీతమ్మసాగర్ కు ఓకే

02



### నా పొలిటికల్ డిజైన్ నవంబర్‌లో చెబుతా

- రాహుల్ కు మాటిచ్చా.. మూడున్నరేళ్ళు ఆగా
- సంగారెడ్డిలో జగ్గారెడ్డి కామెంట్స్

02



### కోల్ స్కామ్ కేసులో మన్మోహన్ కు క్లీన్ చిట్

02



# పంద్రాగస్టు తర్వాతే

## వర్కింగ్ ప్రెసిడెంట్లు, పెండింగ్ మంత్రి పదవులు, నామినేటెడ్ అన్నీ అపుడే

- సర్ తర్వాతే సమీక్ష
- సర్ ను నిర్లక్ష్యం చేస్తే ఎంతటివారైనా మూల్యం చెల్లించాల్సిందే
- పీసీసీతో సహా ఏ నామినేటెడ్ పోస్ట్ అయినా ఆ తర్వాతే
- తెలంగాణ కాంగ్రెస్ నేతలకు తేల్చిచెప్పిన కేసీ వేణుగోపాల్
- ఢిల్లీలో తెలంగాణ కాంగ్రెస్ కో ఆర్డినేషన్ కమిటీ సమావేశం
- సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ మహేష్, ఉత్తమ్ సహా కీలక నేతలు హాజరు
- పనిచేయని డీసీసీలకు షాక్

**ఢిల్లీ, మహా :** సర్ ను ప్రతిఒక్కరూ సీరియస్ గా తీసుకోవాలని, సర్ తర్వాతనే ఎలాంటి పదవులపైనయినా చర్చిస్తామని కాంగ్రెస్ హైకమాండ్ తేల్చిచెప్పింది. వర్కింగ్ ప్రెసిడెంట్లు, పెండింగ్ మంత్రిపదవులు, నామినేటెడ్ ఛైర్మన్లు, ఇతరత్రా పదవులు, త్వరలో ఖాళీ కానున్న ఎమ్మెల్సీలు అన్నింటిపైనా పంద్రాగస్టు తర్వాత మాట్లాడుకుందామని, సర్ పూర్తయిన తర్వాత సమీక్ష చేద్దామని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ , పార్టీ ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ సహా నేతలు కాంగ్రెస్ సంస్థాగత వ్యవహారాల ఇంఛార్జ్ కేసీ వేణుగోపాల్ తో సమావేశం అయ్యారు. రాష్ట్రంలో ప్రభుత్వం పార్టీ వ్యవహారాల పై

మిగతా 2వ పేజీలో




తెలంగాణలో

# కొలువుల జాతర

## 7,437 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ

- నాలుగు నోటిఫికేషన్లు విడుదల చేసిన పోలీసు నియామక మండలి
- సివిల్, ఏఆర్, స్పెషల్ పోలీసు, ఫైర్, జైళ్ల శాఖలో ఉద్యోగాల భర్తీ



**హైదరాబాద్, మహా :** రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న లక్షలాది మంది నిరుద్యోగులకు ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. ఈ మేరకు పోలీస్‌శాఖలో సివిల్, ఏఆర్, స్పెషల్ పోలీసు, ఫైర్, జైళ్లశాఖలో పలు ఖాళీల భర్తీకి సంబంధించి 7,437 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. త్వరలో దరఖాస్తు తేదీలను ప్రకటిస్తామని పోలీసు నియామక మండలి తెలిపింది. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని తెలిపింది. వివరాలకు టీజీపీఆర్ బి వెబ్‌సైట్‌ను సంప్రదించాలని నియామక మండలి తెలిపింది. త్వరలో దరఖాస్తుల షెడ్యూల్ ను ప్రకటించనున్నట్లు పేర్కొంది. రేవంత్ రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలి ఏడాదే దాదాపు 70వేల ఉద్యోగాలు భర్తీచేసినట్లు ప్రకటించగా

మిగతా 2వ పేజీలో

### కమిషన్ల కక్కుర్తి వల్లే బ్యారేజీలు కూలాయి

- బీఆర్ఎస్ తీరుపై ఉత్తమ్ తీవ్ర విమర్శలు
- కాళేశ్వరం నీరు వాడకుండానే తెలంగాణలో రికార్డు ధాన్యం ఉత్పత్తి..

02





### ఆగస్టు 17 తర్వాత భోగాపురం నుంచే విమానయానం

- వైజాగ్ ఎయిర్ పోర్ట్ క్లోజ్
- గెజిట్ విడుదల

03






## మగాడు మగాడిలా మాట్లాడాలి

- ఓ స్త్రీని రాజకీయాల్లోకి లాగడం సమంజసమేనా?
- వైసీపీ నేతలపై నారా భువనేశ్వరి ఫైర్

**తిరుపతి, మహా :** నాడు నిండు సభలో కౌరవులు ద్రౌపది చీర లాగారని, ధర్మరాజును అవమానించేందుకు వాళ్లు అలా చేశారంటూ వైసీపీ నేతలపై నారా భువనేశ్వరి సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం కుప్పం లో పర్యటించిన ఆమె ద్రౌపది మాత ఆలయానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అసెంబ్లీలో చంద్రబాబును నేరుగా ఎదుర్కోలేక ఆడబిడ్డనైన నన్ను లాగి, నా శీలాన్ని శంకించారని ఆరోపించారు. ధైర్యం ఉంటే మగాడు మగాడిగా నిలబడి ప్రత్యర్థిని ఎదుర్కోవాలి కానీ.. ఓ స్త్రీని రాజకీయాల్లోకి లాగడం సమంజసమేనా అని ప్రశ్నించారు. ఓ స్త్రీ గురించి మాట్లాడే హక్కు ఏ మగాడికి లేదని, ఏ ఆడదానికైనా తాను ఎట్లాంటిదో తనకు మన:సాక్షికి తెలుసని కామెంట్ చేశారు. నాడు వస్త్రాపహరణంలో ద్రౌపదికి శ్రీకృష్ణుడు దిగివచ్చి సాయం చేస్తే.. నేడు చంద్రబాబుకు ప్రజలే దేవుళ్లుగా అండగా నిలబడ్డారంటూ నారా భువనేశ్వరి తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. అసెంబ్లీ నిండు సభలో తనకు జరిగిన అవమానాన్ని ఎన్నడూ మర్చిపోలేనని, ఇదేమి ఎలక్షన్ క్యాంపెయిన్ కాదన్నారు. సందర్భం వచ్చింది కాబట్టి ప్రజలకు చెప్పాల్సిన అవసరం వచ్చిందని భువనేశ్వరి స్పష్టం చేశారు.



## ప్రభుత్వ పాఠశాలల్లో చికెన్ బిర్యానీ

- విజయ్ సర్కార్ సంచలన ప్రతిపాదన
- దేశంలోనే తొలి రాష్ట్రం

**చెన్నై:** తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ పాఠశాలలలో మిడ్ డే మిల్‌లో భాగంగా విద్యార్థులకు వారానికి ఒకసారి చికెన్ బిర్యానీ పెట్టేందుకు దాదాపు రంగం సిద్ధం చేసింది. ఈమేరకు సంబంధిత శాఖలకు ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం. ఈ పథకం అమలైతే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు చికెన్ బిర్యాణీ పెట్టిన రాష్ట్రంగా తమిళనాడు రికార్డు సృష్టించనుంది. సీఎం విజయ్ ఈ సంచలన ప్రతిపాదన అమలుచేసేందుకు సై అన్నట్లు సమాచారం. మధ్యాహ్న భోజన పథకంలో వారానికి ఒకసారి చికెన్ బిర్యానీని చేర్చాలనే ప్రతిపాదన వెనుక బలమైన కారణాలు ఉన్నట్లు తెలుస్తోంది. విద్యార్థుల్లో హాజరు శాతం పెంచడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల డ్రాపౌట్లను తగ్గించడం తదితర కారణాలున్నట్లు సమాచారం. ఈ మేరకు ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తి మేరకు, విద్యార్థులకు మరింత పౌష్టికాహారాన్ని అందించడంతో పాటు పాఠశాలలపై ఆసక్తిని పెంచేందుకు సీఎం విజయ్ ఈ అంశంలో కీలక నిర్ణయం తీసుకోబోతున్నట్లు సమాచారం.

## కోల్ స్కామ్ కేసులో మన్మోహన్ కు క్లీన్ చిట్

**ఢిల్లీ, మహా :** దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. యూపీఏ ప్రభుత్వ హయాంలో అత్యంత సంచలనం సృష్టించిన బొగ్గు బ్లాకుల కేటాయింపుల (కోల్ స్కామ్) కేసులో ఆయనపై నమోదైన క్రిమినల్ కేసును సుప్రీంకోర్టు బుధవారం ముగించింది. అంతేకాకుండా ఆయనకు విచారణకు హాజరుకావాలంటూ గతంలో ప్రత్యేక కోర్టు జారీ చేసిన సమన్ల ఉత్తర్వులను కూడా రద్దు చేసింది. ఈ కేసులో దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు సీబీఐ ఇప్పటికే క్లీన్ చిట్ ఇస్తూ ముగింపు నివేదిక (క్లోజర్ రిపోర్ట్) దాఖలు చేసిన సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జైమాల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఈ సీబీఐ నివేదికను ఆమోదించింది. 2024 డిసెంబర్‌లో కన్నుమూసిన మన్మోహన్ సింగ్, ఈ తీర్పుతో యూపీఏ కాలం నాటి అతిపెద్ద క్రిమినల్ కేసు నుంచి అధికారికంగా నిర్దోషిగా విముక్తి పొందారు. సీబీఐ దాఖలు చేసిన ముగింపు నివేదికలను తిరస్కరించడానికి గానీ, ఆయనపై నేరాభియోగాలను స్వీకరించడానికి గానీ ఎలాంటి బలమైన కారణాలు లేవని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.

# పంద్రాగస్టు తర్వాతే

( మొదటి పేజీ తరువాయి )

కీలకంగా చర్చించారు. సమన్వయం.. లక్ష్యాల సాధన పైన ఆరా తీసారు. ఇదే సమయంలో రాష్ట్రంలో కొనసాగుతున్న సర్ ఓటర్ల ప్రక్రియ పైన ప్రధాన చర్చ జరిగింది. కొందరు నేతలు సర్ పక్రియను నిర్లక్ష్యం చేస్తున్నారనే ఫిర్యాదులు అందాయని వేణుగోపాల్ ఆగ్రహం వ్యక్తం చేసారు. పార్టీలో భర్తీ చేయాల్సిన పీసీసీ తో సహా ఏ నామినేటెడ్ పదవి అయినా సర్ పక్రియ పూర్తయిన తరువాత మాత్రమే ఆలోచన ఉంటుందని స్పష్టం చేసారు. అందరూ సర్ ప్రక్రియ పూర్తి అయ్యేంత వరకు ఆ కార్యక్రమం పైనే ఫోకస్ చేయాలని తేల్చి చెప్పారు.

**సర్ పై నిర్లక్ష్యం ప్రదర్శిస్తే ప్రత్యామ్నాయ ఆలోచన**

పార్టీ నేతలకు దిశా నిర్దేశం ఎవరైనా సర్ పక్రియ పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహిస్తే ప్రత్యామ్నాయం చూడాలని కేసీ వేణుగోపాల్ నిర్దేశించారు. ఏ ఒక్క ఓటు కూడా నష్టపోకూడదని స్పష్టం చేసారు. తెలంగాణలో బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు చేపట్టిన సంస్థాగత కార్యక్రమాలు, ఎస్ఎస్ఏ (సంఘటన్ సృజన్ అభియాన్) కార్యక్రమాల పురోగతిపై సమగ్రంగా సమీక్షించారు. సమీక్షలో జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ), మండల కాంగ్రెస్ కమిటీల అధ్యక్షుల పనితీరు, పార్టీ విస్తరణ కార్యక్రమాలపై చర్చ జరిగినట్లు వెల్లడించారు. పార్టీలో సమన్వయానికి సంబంధించిన అంశాలపై కూడా విస్తృతంగా చర్చించినట్లు తెలుస్తోంది. పనిచేయని డీసీసీలపై సమీక్ష జరిపి తొలగించాలన్న చర్చ జరిగింది. పార్టీలో నామినేటెడ్ పదవుల భర్తీ అంశం సర్ ప్రక్రియ రాష్ట్రంలో పూర్తయిన తరువాత నిర్ణయం తీసుకుందామని వేణుగోపాల్ స్పష్టం చేశారు. సర్ పూర్తయ్యేవరకు నేతలంతా ఒకే పనిపై ఉండాలని నిర్దేశించారు.



# విద్యార్థులపై వేధింపులు ఆపాలి

*** లేదంటే దేశవ్యాప్త ఉద్యమం: అభిజీత్ దీప్కే**



**ఢిల్లీ, మహా.** నీట్ యూజీ 2026 ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారంపై నిరసన తెలిపిన విద్యార్థులపై ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలను వెంటనే నిలిపివేయాలని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే డిమాండ్ చేశారు. ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోతే త్వరలోనే దేశవ్యాప్తంగా మరోసారి ఉద్యమాన్ని ప్రారంభిస్తామని హెచ్చరించారు. బుధవారం ఢిల్లీ విమానాశ్రయం వద్ద మీడియాతో మాట్లాడిన ఆయన, తమ భవిష్యత్తు, హక్కుల కోసం శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసిన విద్యార్థులపై లాఠీచార్జి, పెలెట్ గన్స్ వంటి చర్యలు తీసుకోవడం తీవ్రంగా ఖండించారు.జులై 20న జరిగిన నిరసనల్లో విద్యార్థులపై అధిక బలప్రయోగం జరిగిందని అభిజీత్ దీప్కే ఆరోపించారు. విద్యార్థులను ఉగ్రవాదుల మాదిరిగా పెలెట్ గన్స్‌తో లక్ష్యంగా చేసుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. తమ హక్కులు, భవిష్యత్తు కోసం పోరాడుతున్న విద్యార్థులపై ఇలాంటి చర్యలు ప్రభుత్వం చేపట్టకూడదని అన్నారు. వేధింపులు ఇదే విధంగా కొనసాగితే మరోసారి ప్రజల్లోకి వెళ్లి దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని చేపడతామని స్పష్టం చేశారు. ప్రభుత్వం తన తీరును మార్చుకోకపోతే కొత్త దశలో ఆందోళనలు ప్రారంభమవుతాయని తెలిపారు.

జెన్‌జెడ్ యువతపై బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ చేసిన వ్యాఖ్యలపై స్పందించిన అభిజీత్ దీప్కే, ఆమె వ్యాఖ్యలను ఎవరూ సీరియస్‌గా తీసుకోరని కొట్టిపారేశారు.

ఇదిలా ఉండగా, ఇటీవల జంతర్‌మంతర్ వద్ద జరిగిన సీజేపీ నిరసనలు, 'ఛలో సంసద్' కార్యక్రమం సందర్భంగా రాళ్లతో నిండిన ట్రక్కు కనిపించిందంటూ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఆరోపణలపై ఢిల్లీ పోలీసులు వివరణ ఇచ్చారు. ఆ ట్రక్కుకు నిరసన కార్యక్రమాలతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని పేర్కొన్నారు.

పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, వివాదాస్పదంగా మారిన ట్రక్కును జులై 16న జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో స్వాధీనం చేసుకున్నారు. ఈఈసీఓ వ్యాన్‌ను ఢీకొట్టిన ఘటనలో ఆరుగురు గాయపడటంతో పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేసి, దర్యాప్తు భాగంగా ట్రక్కును పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. పోలీస్ స్టేషన్‌లో తగిన స్థలం లేకపోవడంతో తాత్కాలికంగా బయట నిలిపినట్లు తెలిపారు.

'ఛలో సంసద్' కార్యక్రమం సందర్భంగా భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నిర్వహణ దృష్ట్యా జులై 20 తెల్లవారుజామున ట్రక్కును అక్కడి నుంచి తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. తరలించే ముందు లారీలో ఉన్న రాళ్లను పూర్తిగా ఖాళీ చేసి, అనంతరం వాహనాన్ని మరో సురక్షిత ప్రాంతానికి తరలించామని వివరించారు. ఇది పూర్తిగా చట్టపరమైన, పరిపాలనా ప్రక్రియలో భాగమేనని, దీనికి నిరసనలు లేదా ఏదైనా కుట్రతో సంబంధం ఉందని ప్రచారం చేయడం నిరాధారమని స్పష్టం చేశారు. ఈ ఘటనకు రాజకీయ రంగు పులమడం సరికాదని పేర్కొన్నారు.

సోషల్ మీడియా వేదికల్లో ధ్రువీకరించని సమాచారాన్ని పంచుకోవద్దని ప్రజలకు ఢిల్లీ పోలీసులు విజ్ఞప్తి చేశారు. అధికారికంగా ధ్రువీకరించిన సమాచారాన్నే నమ్మాలని సూచిస్తూ, తప్పుడు ప్రచారాల ద్వారా ప్రజల్లో అనవసర ఆందోళన సృష్టించే వారిపై నిఘా ఉంచినట్లు తెలిపారు. అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## నిరుద్యోగి.. పనికిరానివాడు

- నేను ఆ వయసులో రెండునేషనల్ అవార్డులు సాధించా
- కాక్రోచ్ పై మరోసారి కంగనా ఫైర్



**ఢిల్లీ, మహా :** ట్ పేపర్ లీక్ వ్యవహారంలో జెన్‌జీ నిరసనకారులపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన నటి, భాజపా ఎంపీ కంగనా రనౌత్ మరోసారి హాట్ కామెంట్స్ చేశారు కాక్రోచ్ జనతా పార్టీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్‌పై ఆమె తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. అతడో పనికిరాని వ్యక్తి అని మండిపడ్డారు. అతడి వయసులో తాను రెండు జాతీయ అవార్డులు సాధించానని తెలిపారు. "ఈ వ్యక్తి (సౌరవ్ దాస్) కోసం నెట్టింట వెతికాను. 28 ఏళ్ల విద్యార్థి అని వచ్చింది. కానీ నాకు నమ్మకం లేదు. అవును.. vనేను గత రెండేళ్లుగానే రాజకీయాల్లో ఉండొచ్చు.. కానీ 20 ఏళ్లుగా ప్రజాజీవితంలో కొనసాగుతున్నా. అతడి వయసులో నేను రెండు జాతీయ అవార్డులు సాధించా. నిజమే పార్లమెంట్ సభ్యురాలిగా నాకు పనిభారం ఎక్కువగా ఉందని అన్నాను. ఎందుకంటే నేను ఎంపీని మాత్రమే కాదు.. దర్శకురాలిగా, నటిగా, నిర్మాతగా, స్క్రీన్ రైటర్‌గా, వ్యాపారవేత్తగా ఎన్నో విధులు నిర్వర్తిస్తున్నా. కానీ, పనికిరాని, నిరుద్యోగి అయిన నీలాంటి వ్యక్తికి... ఏ వయసులోనైనా బిజీగా ఉండటం అనేది ఎప్పటికీ అర్థం కాదు. సౌరవ్.. నీది వ్యక్తిగత సమస్యే. నువ్వు విద్యార్థివి కాదు. ఇకనైనా కొన్ని నైపుణ్యాలు నేర్చుకో" అని కంగనా రనౌత్ మండిపడ్డారు.

## నా పొలిటికల్ డిజైన్ నంబర్ లో చెబుతా

- రాహుల్ కు మాటిచ్చా.. మూడున్నరేళ్ళు ఆగా
- సంగారెడ్డిలో జగ్గారెడ్డి కామెంట్స్



**సంగారెడ్డి, మహా :** ఆనాడు రాహుల్ గాంధీకి మాట ఇచ్చాను కాబట్టే.. ఈ ముదున్నరేళ్ల మా పార్టీ ప్రభుత్వ, రాజకీయ వ్యవహారాల గురించి మాట్లాడలేదని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. "నేనేదైనా మాట్లాడాలనుకుంటే ఢిల్లీ ట్రైన్ ఎక్కి రాహుల్ గాంధీతో మాట్లాడిన తర్వాతే బయటికి వచ్చి మాట్లాడుతా. మనసులో ఒకటి పెట్టుకుని బయట మరొకటి మాట్లాడే వ్యక్తిని కాదు" అంటూ జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. "మూడున్నరేళ్ల క్రితం మా పార్టీలో లోపాలు ఉంటే బయట మాట్లాడాను. కార్యకర్తల వ్యవహారం, పార్టీ అంశాలపై అంతర్గతంగా, బహిరంగంగాను చర్చించాను. ఈ మధ్య పీఏసీ మీటింగ్‌లో అంతర్గతంగా మాట్లాడే విషయాలు కూడా బయటికి వస్తున్నాయని సమావేశానికి పోవడమే మానేశాను. పీఏసీ మీటింగ్‌కి వెళ్లి ఉంటే పార్టీలో జరుగుతున్న వ్యవహారాలను ఏఐసీసీ ఇంచార్జ్, సీఎం దృష్టికి తీసుకెళ్లేవాణ్ని. మళ్ళీ నేను మాట్లాడిన అంశాలు బయటకి వచ్చేవి.. అందుకే పోలేదు. ఈ మూడున్నర ఏళ్లుగా ఇప్పటి వరకు కాంగ్రెస్ పార్టీ రాజకీయ, ప్రభుత్వ వ్యవహారాలను ఎక్కడ బహిరంగంగా, అంతర్గతంగా చర్చించలేదు" అని జగ్గారెడ్డి చెప్పుకొచ్చారు. "ఎన్నికలకు ముందు రాహుల్ గాంధీ 40 మంది కాంగ్రెస్ నేతలను ఢిల్లీకి పిలిచారు. అందులో నాకు ఆహ్వానం అందింది. ఆ సమావేశంలో రాహుల్ గాంధీతో 15 నిమిషాలు మాట్లాడాను. నేను సంగారెడ్డి రాంనగర్‌లోని రాంమందిర్ నుంచి విద్యార్థి నేతగా నా రాజకీయ ప్రయాణం మొదలై.. నేడు ఢిల్లీలో మీ నివాసానికి వచ్చి మీ ముందు కూర్చునే వరకు సాగిందని చెప్పాను. మీ ముందు ఒక రోజు ఇలా కూర్చొని మాట్లాడాలని అనుకున్నా.. ఇప్పుడు మాట్లాడుతున్నా నేను అనుకున్నది సాధించాను అని చెప్పాను. ..ఏ పార్టీ నుంచి ప్రధాన మంత్రి ఉన్నా అధికారంలో ఉన్నన్ని రోజులే గుర్తుపెట్టుకుంటారని చెప్పా. పదవులతో పని లేకుండా గుర్తు పెట్టుకునే వారిలో మీ కుటుంబమే ఉంటుందని చెప్పా. కానీ రాహుల్ గాంధీ కుటుంబాన్ని దేశ ప్రజలు చిరకాలం గుర్తి పెట్టుకుంటారని కూడా చెప్పాను. రాహుల్ గాంధీ నన్ను పక్కకి పిలిచి ఓ మాట చెబుతాను వింటావా అని అడిగారు. మీకు ఎవరిపై అయిన కోపం ఉంటే మీడియా ముందు మాట్లాడకండి. ఢిల్లీకి వచ్చి నాతో మాట్లాడండి అన్నారు. ఆనాడు రాహుల్ గాంధీకి మాట ఇచ్చాను కాబట్టే.. ఈ ముదున్నరేళ్ళ మా పార్టీ ప్రభుత్వ, రాజకీయ వ్యవహారాల గురించి మాట్లాడలేదు. ..రాజకీయంగా నాకు మనసులో ఓ కోరిక ఉంది. నాకు ఓ పొలిటికల్ డిజైన్ ఉంది. అది నవంబర్‌లో చెబుతా. ఈ మూడు నెలల కాలంలో రాజకీయంగా నాకు ఓ క్లారిటీ వస్తుంది. నాకు ఫ్యామిలీ కంటే పబ్లిక్, పాలిటిక్సే ముఖ్యం. నేను 24 గంటల పాటు పబ్లిక్, పాలిటిక్స్ గురించే ఆలోచిస్తా" అని జగ్గారెడ్డి పేర్కొన్నారు.




# తెలంగాణలో కొలువుల జాతర

( మొదటి పేజీ తరువాయి )

, ఎల్బీస్టేడియం వేదికగా వీరికి నియామకపత్రాలు వివిధదశల్లో అందించారు. ఇపుడు మరో భారీ ప్రకటన ద్వారా నిరుద్యోగుల్లో ఉద్యోగాలపై ప్రభుత్వం ఆశలు రేకెత్తించింది.

ఏయే విభాగాల్లో ఎన్ని ఉద్యోగాలు

ఎస్ఐ(సివిల్) 148
ఎస్ఐ(ఏఆర్)14
టీజీఎస్‌పీ ఎస్ఐ 12
ఎస్ఏఆర్‌సీపీఎల్ ఎస్ఐ 3
ఎస్ఐ (ఫింగర్ ప్రింట్ బ్యూరో) 23 పోస్టులు

**కానిస్టేబుల్ :** ఎస్ఐ ఉద్యోగాలతో పాటు కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి కాడా పోలీసు నియమాక మండలి నోటిపికేషన్ జారీ చేసింది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.

కానిస్టేబుల్ (సివిల్) 3,697
కానిస్టేబుల్ ఏఆర్ 1052
పీటీవో కానిస్టేబుల్ 20
కానిస్టేబుల్ మెకానిక్ 7
స్పెషల్ పోలీస్ (ఎస్ఐ) 44
కానిస్టేబుల్ 1,038

**ఫైర్ విభాగంలో :**

స్టేషన్ ఫైర్ ఆఫీసర్ 39,
ఫైర్ ఫైటర్ 751 పోస్టులు
డిప్యూటీ జైలర్ (మెన్) 14
డిప్యూటీ జైలర్ (మహిళ) ఒక పోస్టు
వార్డర్ (మేల్) 196

## ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డికి 14 రోజుల రిమాండ్

**ఉప్పర్‌పల్లి కోర్టు ఆగస్టు 11 వరకు జ్యుడీషియల్ రిమాండ్.**

**హైదరాబాద్, మహా**

మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణిపై లైంగిక వేధింపులు, దాడికి పాల్పడినట్లు నమోదైన కేసులో ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డికి ఉప్పర్‌పల్లి కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. మంగళవారం అరెస్టు చేసిన ఉదయ్ కృష్ణారెడ్డిని పోలీసులు బుధవారం మధ్యాహ్నం ఉప్పర్‌పల్లి కోర్టులో హాజరు పరచగా, ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం ఆగస్టు 11 వరకు రిమాండ్ విధించింది. అనంతరం ఆయనను చంచల్‌గూడ కేంద్ర కారాగారానికి తరలించారు.

విచారణ సందర్భంగా ఉదయ్ కృష్ణారెడ్డి తరపు న్యాయవాది వాదిస్తూ, తమ క్లయింట్‌కు ముందస్తుగా ఎలాంటి నోటీసులు ఇవ్వలేదని, భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 35(3) నిబంధనలను పోలీసులు ఉల్లంఘించారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. సమగ్ర విచారణ జరపకుండానే ఆయనను సస్పెండ్ చేయడం చట్టబద్ధం కాదని, సరైన ఆధారాలు లేకుండానే అరెస్టు చేసి సస్పెండ్ చేశారని వాదించారు. జాతీయ పోలీస్ అకాడమీలో బాధితురాలు చేసిన ఫిర్యాదులో లైంగిక వేధింపుల అంశం లేదని, తప్పుడు ఫిర్యాదు ఆధారంగానే ఎఫ్ఐఆర్ నమోదు చేశారని ఆరోపించారు. బాధితురాలిపై తీవ్ర ఒత్తిడి ఉందని, ఇరువురు ట్రైనీ ఐపీఎస్ అధికారులకు ముందే పరిచయం ఉందని పేర్కొంటూ రిమాండ్‌ను తిరస్కరించాలని కోర్టును కోరారు.

దీనికి ప్రతిగా పోలీసుల తరపు న్యాయవాది వాదిస్తూ, బాధితురాలి ఫిర్యాదు మేరకు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. లైంగిక దాడి జరిగినట్లు బాధితురాలు వాంగ్మూలం ఇచ్చిందని, తనపై శారీరక దాడి కూడా జరిగిందని ఆమె వెల్లడించినట్లు కోర్టుకు వివరించారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం రిమాండ్ విధించింది.

ఇదిలా ఉండగా, కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు ఉదయం సీన్ రీకన్‌స్ట్రక్షన్ నిర్వహించారు. ఇందుకోసం ఉదయ్ కృష్ణారెడ్డిని అత్తాపూర్ పోలీస్ స్టేషన్ నుంచి అశోక్‌నగర్‌లోని స్టీల్ బ్రిడ్జ్ పిల్లర్ నంబర్-25 సమీపంలో గతంలో ఆయన అద్దెకు నివసించిన ఇంటికి తీసుకెళ్లి పరిశీలించారు. అనంతరం వైద్య పరీక్షల నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి, అక్కడి నుంచి కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసులో ఇప్పటికే బాధితురాలి వాంగ్మూలాన్ని పోలీసులు నమోదు చేశారు.

మరోవైపు తనపై అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ ఉదయ్ కృష్ణారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో కూడా విచారణ జరిగింది. బాధితురాలికి నోటీసులు జారీ చేయాల్సి ఉందని ప్రభుత్వ తరపు న్యాయవాది పల్లె నాగేశ్వర్‌రావు కోర్టుకు తెలిపారు. దీంతో బాధితురాలికి నోటీసులు జారీ చేయాలని ఆదేశించిన హైకోర్టు, తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

ఈ నెల 18న మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఉదయ్ కృష్ణారెడ్డిపై లైంగిక వేధింపులు, దాడి తదితర ఆరోపణలపై పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది. ఫిర్యాదు నమోదైన రోజే బాధితురాలికి వైద్య పరీక్షలు నిర్వహించగా, ఆమె మెడపై గొంతు నులిమినట్లు గాయాల ఆనవాళ్లు, చెంపపై కమిలిన గాయాలు, ఎడమ కాలి చర్మంపై గాయాలు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు.

కేసు నమోదు అనంతరం ఉదయ్ కృష్ణారెడ్డి ఆచూకీ లభించకపోవడంతో పోలీసులు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. అనంతరం హైదరాబాద్ శివారులో ఆయనను అదుపులోకి తీసుకుని అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కేసు దర్యాప్తు అధికారిగా చార్మినార్ మహిళా పోలీస్ స్టేషన్ సీఐ జ్యోత్స్నను, పర్యవేక్షణ అధికారిగా మహిళా భద్రత విభాగం డీసీపీ లావణ్యను నియమించి దర్యాప్తును కొనసాగిస్తున్నారు.

## తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులకు సుప్రీంకోర్టు ఊరట

- పర్యావరణ అనుమతులకు లైన్ క్లియర్
- సీతారామా, పాలమూరు, సీతమ్మసాగర్ కు ఓకే



**హైదరాబాద్, మహా :** తెలంగాణలో నిర్మాణంలో ఉన్న పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, సీతమ్మ సాగర్, గౌరవెల్లి రిజర్వాయర్ వంటి కీలక సాగునీటి ప్రాజెక్టులకు సుప్రీంకోర్టు కీలక ఊరట కల్పించింది. కేంద్ర పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ 2021లో జారీ చేసిన ఆఫీస్ మెమోరాండం (ఓఎం)ను సుప్రీంకోర్టు చెల్లదని ప్రకటించినప్పటికీ, ఆ ఉత్తర్వు ఆధారంగా ఇప్పటికే మంజూరైన పర్యావరణ అనుమతులు పూర్తిగా చెల్లుబాటులోనే ఉంటాయని స్పష్టం చేసింది. ఈ తీర్పు భవిష్యత్తుకు మాత్రమే వర్తిస్తుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొనడంతో, తెలంగాణలో కొనసాగుతున్న ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలకు ఎలాంటి చట్టపరమైన ఆటంకం ఉండదనే స్పష్టత లభించింది. కేంద్ర ప్రభుత్వం 2021లో జారీ చేసిన ఆఫీస్ మెమోరాండం ద్వారా కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ముందస్తు పర్యావరణ అనుమతి లేకుండానే ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేసే అవకాశాన్ని కల్పించింది. అయితే ఈ విధానం పర్యావరణ పరిరక్షణ చట్టాలు, నిబంధనలకు విరుద్ధమంటూ దాఖలైన పిటిషన్లపై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు, కార్యనిర్వాహక ఉత్తర్వులతో చట్టాలను భర్తీ చేయడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. చట్టంలో పొందుపరిచిన నిబంధనలను కేవలం ఆఫీస్ మెమోరాండం ద్వారా మార్చడం రాజ్యాంగబద్ధంగా సమంజసం కాదని ధర్మాసనం అభిప్రాయపడింది. అయితే ఇప్పటికే ఆ ఆఫీస్ మెమోరాండం ఆధారంగా మంజూరైన పర్యావరణ అనుమతులను రద్దు చేయబోమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆ అనుమతుల పై ఆధారపడి కొనసాగుతున్న లేదా నిర్మాణ దశలో ఉన్న ప్రాజెక్టులకు ఈ తీర్పు వల్ల ఎలాంటి ప్రభావం ఉండదని పేర్కొంది. దీంతో పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్, గౌరవెల్లి రిజర్వాయర్ వంటి తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక సాగునీటి ప్రాజెక్టుల పనులు యథావిధిగా కొనసాగేందుకు మార్గం సుగమమైంది.భవిష్యత్తులో చేపట్టే అన్ని కొత్త ప్రాజెక్టులకు మాత్రం ముందస్తు పర్యావరణ అనుమతి తప్పనిసరిగా ఉండాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అత్యవసర పరిస్థితుల్లో మినహాయింపులు ఇవ్వాల్సి వస్తే, కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధమైన నోటిఫికేషన్ జారీ చేసి, పర్యావరణ చట్టాల పరిధిలోనే నిర్ణయాలు తీసుకోవాలని సూచించింది. కార్యనిర్వాహక ఉత్తర్వులతో చట్టబద్ధ ప్రక్రియను పక్కనపెట్టడం ఆమోదయోగ్యం కాదని ధర్మాసనం తేల్చిచెప్పింది. తీర్పుతో తెలంగాణలో సాగుతున్న కీలక నీటిపారుదల ప్రాజెక్టులపై నెలకొన్న న్యాయపరమైన అనిశ్చితికి తెరపడినట్లు నిపుణులు భావిస్తున్నారు. ఇప్పటికే వేల కోట్ల రూపాయల వ్యయంతో నిర్మాణంలో ఉన్న ఈ ప్రాజెక్టులు రాష్ట్రంలో సాగునీటి విస్తరణ, తాగునీటి సరఫరా, భూగర్భ జలాల పునరుద్ధరణకు కీలకంగా మారనున్నాయి. సుప్రీంకోర్టు తాజా తీర్పు కారణంగా ఈ ప్రాజెక్టుల అమలులో ఎలాంటి చట్టపరమైన ఆటంకాలు లేకుండా పనులు కొనసాగనున్నాయని ప్రభుత్వ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# జమ్మూకశ్మీర్, లద్ధాఖ్ భారత్‌లో అంతర్భాగాలే

- తప్పుడు ప్రచారాలకు కేంద్రం గట్టి కౌంటర్.
- పీవోకే ఎన్నికలు కంటితుడుపు చర్యలే.
- అక్రమ ఆక్రమణను కప్పిపుచ్చే ప్రయత్నమని విదేశాంగ శాఖ వ్యాఖ్య.




**ఢిల్లీ, మహా.:** జమ్మూకశ్మీర్, లద్ధాఖ్‌కు సంబంధించి సోషల్ మీడియాలో వ్యాప్తి అవుతున్న తప్పుడు ప్రచారాలకు భారత విదేశాంగ మంత్రిత్వశాఖ (ఎంఈఏ) మరోసారి గట్టి కౌంటర్ ఇచ్చింది. జమ్మూకశ్మీర్, లద్ధాఖ్ కేంద్ర పాలిత ప్రాంతాలు, ప్రస్తుతం పాకిస్థాన్ అక్రమ ఆక్రమణలో ఉన్న ప్రాంతాలతో సహా మొత్తం భూభాగం భారతదేశంలో అంతర్భాగమేనని స్పష్టం చేసింది. ఈ మేరకు బుధవారం తన అధికారిక సామాజిక మాధ్యమాల వేదికలపై స్పందించిన ఎంఈఏ, ప్రముఖ అమెరికన్ టీవీ షోలోని ఓ వైరల్ మీమ్‌ను ఉపయోగిస్తూ "నేను మీకు ఇది ఎన్ని సార్లు వివరించాలి?" అనే వ్యాఖ్యతో తప్పుడు ప్రచారాలను ఖండించింది.పదేపదే జమ్మూకశ్మీర్, లద్ధాఖ్‌పై అసత్యాలు ప్రచారం చేస్తున్న వారికి ఇదే తమ సమాధానమని విదేశాంగ శాఖ పేర్కొంది. పాకిస్థాన్ ఆక్రమణలో ఉన్న ప్రాంతాలు కూడా భారతదేశానికి విడదీయరాని భాగాలని స్పష్టం చేస్తూ, పాకిస్థాన్ నిర్వహిస్తున్న ఎన్నికలు ప్రజాస్వామ్య ప్రక్రియ కాదని, అక్రమ ఆక్రమణను సమర్థించుకునేందుకు చేస్తున్న కంటితుడుపు చర్యలేనని విమర్శించింది.పీవోకేలో జరుగుతున్న ఎన్నికల ప్రక్రియ అక్కడి ప్రజల నిజమైన ప్రజాస్వామ్య ఆకాంక్షలను ప్రతిబింబించదని ఎంఈఏ పేర్కొంది. ఆ ప్రాంతంలో జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనలు, ఆర్థిక దోపిడీ, ప్రాథమిక హక్కుల నిరాకరణ, పరిపాలనా అణచివేతను ప్రపంచం నుంచి దాచిపెట్టేందుకు పాకిస్థాన్ ప్రయత్నిస్తోందని ఆరోపించింది. దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ విధానాల ఫలితంగానే పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో భారీ ప్రజా నిరసనలు జరుగుతున్నాయని వెల్లడించింది.ఓ నెటిజన్ జమ్మూకశ్మీర్, లద్ధాఖ్ భారతదేశంలో భాగం కాదని, 2019లో ఆర్టికల్ 370 రద్దుతో భారత్ అక్రమంగా విలీనం చేసుకుందని, ఐక్యరాజ్యసమితి తీర్మానాల ప్రకారం అది వివాదాస్పద భూభాగమని చేసిన వ్యాఖ్యలకు స్పందిస్తూ విదేశాంగ శాఖ ఈ వివరణ ఇచ్చింది. ఆ వాదనలను పూర్తిగా తిరస్కరించిన ఎంఈఏ, జమ్మూకశ్మీర్, లద్ధాఖ్ భారత సార్వభౌమాధికారంలో విడదీయరాని భాగాలని మరోసారి స్పష్టం చేసింది.ఇదిలా ఉండగా, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో (పీవోకే) మానవ హక్కుల పరిరక్షణ, అరెస్టయిన నిరసనకారుల విడుదల, నమోదైన కేసుల ఉపసంహరణ తదితర డిమాండ్లతో ప్రజలు గత 52 రోజులుగా ఆందోళనలు కొనసాగిస్తున్నారు. జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ) ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ నిరసనలు ఇటీవల మరింత ఉధృతమయ్యాయి. అధికారులతో జరిగిన చర్చలు విఫలమైన నేపథ్యంలో వేలాది మంది ముజఫరాబాద్ వైపు మార్చ్‌కు సిద్ధమయ్యారు.

ఈ క్రమంలో రావల్కోట్‌లో నిరసనకారులపై పాకిస్థాన్ భద్రతా బలగాలు జరిపిన కాల్పుల్లో పలువురు మరణించగా, అనేక మంది గాయపడినట్లు సమాచారం. జూన్ 5 నుంచి జులై 28 వరకు జరిగిన ఆందోళనల్లో మరణించిన వారి సంఖ్య 67కు చేరిందని జేఏఏసీ వెల్లడించింది. మృతులను అమరవీరులుగా పేర్కొంటూ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రకటించింది.మరోవైపు, పాకిస్థాన్ నిర్వహిస్తున్న ఎన్నికలు ప్రజల స్వేచ్ఛా సంకల్పాన్ని దెబ్బతీసే విధంగా జరుగుతున్నాయని పీవోకే నాయకులు ఆరోపిస్తున్నారు. అరెస్టులు, బెదిరింపులు, భారీ భద్రతా బలగాల మోహరింపుతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని విమర్శించారు. రావల్కోట్‌లో జరిగిన కాల్పుల ఘటనపై తక్షణమే స్వతంత్ర, పారదర్శక విచారణ జరిపించాలని అమ్నెస్టీ ఇంటర్నేషనల్ కూడా పాకిస్థాన్ అధికారులను కోరింది.

# ఓటరు జాబితా సవరణ పారదర్శకంగా ఆగస్టు 3లోగా డిజిటలైజేషన్ పూర్తి చేయాలి

**సీఈవో సుదర్శన్ రెడ్డి**




హైదరాబాద్, మహా: ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ కేవలం తప్పులు లేని, పారదర్శకమైన ఓటరు జాబితాను రూపొందించడానికేనని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్‌లో జిల్లా కలెక్టర్లతో ఎస్ఐఆర్ పురోగతిపై సమీక్ష నిర్వహించిన ఆయన, రాష్ట్రవ్యాప్తంగా ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ను ఆగస్టు 3వ తేదీలోగా వంద శాతం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 76 శాతం ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తయిందని సుదర్శన్ రెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ ప్రక్రియ 90 శాతం పూర్తయిందని, ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇప్పటికే వంద శాతం డిజిటలైజేషన్ పూర్తయినట్లు వెల్లడించారు. మిగిలిన ప్రాంతాల్లో కూడా నిర్ణీత గడువులోపు ప్రక్రియ పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధితో పాటు రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి వంటి పట్టణ జిల్లాల్లో డిజిటలైజేషన్ పనులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో ప్రక్రియను వేగవంతం చేసి ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.డిజిటలైజేషన్ పనుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించే బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్‌వోలు), సూపర్‌వైజర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఈవో హెచ్చరించారు. ఒకే కుటుంబానికి చెందిన సభ్యుల ఓట్లన్నీ సాధ్యమైనంత వరకు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

రాజకీయ పార్టీలతో నిర్వహించే సమావేశాలను తప్పనిసరిగా వీడియో రికార్డు చేయాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే వీఐపీ, వీవీఐపీ ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను కూడా చేపట్టాలని సూచించారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ఎలాంటి సంబంధం లేదని సుదర్శన్ రెడ్డి మరోసారి స్పష్టం చేస్తూ, ప్రజలు అపోహలకు గురికావద్దని విజ్ఞప్తి చేశారు.




# పురావస్తు శాఖ భూములను డిమార్కేషన్ చేసి రక్షణ చర్యలు చేపట్టాలి

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వరంగల్, మహా;** వరంగల్ జిల్లాలోని పురావస్తు శాఖ (ఏఎస్ఐ) ఆధీనంలోని భూములను డిమార్కేషన్ చేసి, వాటి రక్షణకు అవసరమైన మ్యాపింగ్ ను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో భారత పురావస్తు సర్వే ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పురావస్తు శాఖకు చెందిన భూముల సరిహద్దులను స్పష్టంగా గుర్తించి డిమార్కేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఆయా భూముల పరిరక్షణకు సమగ్ర మ్యాపింగ్ ను రూపొందించి, ఆక్రమణలకు తావులేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పురావస్తు వారసత్వ సంపదను సంరక్షించడం ప్రతి శాఖ బాధ్యత అని పేర్కొన్న జిల్లా కలెక్టర్, సంబంధిత శాఖల మధ్య సమన్వయంతో పెండింగ్ అంశాలను త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి, మున్సిపల్ కమిషనర్ వెంకన్న, డి ఆర్ ఓ విజయ లక్ష్మి, ఎడి సర్వే ల్యాండ్ అధికారి శ్రీనివాసులు, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సుమ ఉమారాణిలు,జిల్లా స్పోర్ట్స్ మరియు టూరిజం ఇంచార్జ్ అధికారి అనిల్ మరియు పురావస్తు శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆగస్టు 17 తర్వాత భోగాపురం నుంచే విమానయానం

**వైజాగ్ ఎయిర్ పోర్ట్ క్లోజ్ గెజిట్ విడుదల**



ఉత్తరాంధ్ర ప్రతినిధి, మహా : విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఆగస్టు 17 అర్ధరాత్రి 00:01 గంటల నుంచి విమాన రాకపోకలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో విశాఖపట్నం విమానాశ్రయం నుంచి షెడ్యూల్ విమానాలను నిలిపేస్తున్నట్లు పౌరవిమానయానశాఖ ప్రకటించింది. 30 ఏళ్లపాటు విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్ (ఐఎన్ఎస్ డేగ) సివిల్ ఎన్‌క్లేవ్ నుంచి షెడ్యూల్డ్ కమర్షియల్ విమానాల రాకపోకలను నిలిపేస్తున్నట్లు తెలిపింది. జాతీయ అత్యవసర పరిస్థితుల్లో ఈ నిబంధనకు మినహాయింపు ఉంటుందని పేర్కొంది. భారతీయ వాయుసేన, సాయుధ దళాలు, పోలీసు విమానాలు, ప్రభుత్వ అతిథులు రాకపోకలు సాగించే విమానాలు, లీజ్, వీఐపీ ఎయిర్‌క్రాఫ్ట్‌లు ఇక్కడి నుంచి నడుస్తాయని.. నాన్‌షెడ్యూల్డ్ వాణిజ్య కార్యకలాపాలూ కొనసాగుతాయని పేర్కొంది. ఇప్పటి వరకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు ఉన్న అంతర్జాతీయ ట్రావెల్‌కోడ్ 'వీటీజెడ్' ఆగస్టు 17 అర్ధరాత్రి 00:01 గంటల నుంచి అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయానికి బదిలీ అవుతుందని కేంద్రం తెలిపింది.

**అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం**

జీఎంఆర్ సంస్థ పీపీపీ విధానంలో నిర్మించిన భోగాపురానికి విమానాశ్రయానికి 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం'గా నామకరణం చేస్తున్నట్లు పౌరవిమానయానశాఖ మంగళవారం గెజిట్ నోటిఫికేషన్ వెలువరించింది. ఈ విమానాశ్రయానికి అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాలని 2024 సెప్టెంబర్ 18న సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారు. ఇప్పుడు కేంద్రం దాన్ని అధికారికంగా గుర్తిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది.

# మానవ-ఏనుగు సంఘర్షణలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

**గుచ్చిమి కుంకీ ఏనుగుల శిబిరాన్ని ప్రజలకు అంకితం చేసిన ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.**



**అమరావతి, మహా.** వన్యప్రాణుల సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోందని, మానవఏనుగు సంఘర్షణలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో గుచ్చిమి కుంకీ ఏనుగుల శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. బుధవారం వర్చువల్ విధానంలో గుచ్చిమి కుంకీ ఏనుగుల శిబిరాన్ని ప్రారంభించిన ఆయన, ఈ సందర్భంగా మాట్లాడుతూ దశాబ్దాలుగా కొనసాగుతున్న మానవఏనుగు ఘర్షణలకు శాస్త్రీయ పరిష్కారంగా ఈ ఎలిఫెంట్ హోల్డింగ్ ఏరియాను అభివృద్ధి చేసినట్లు వెల్లడించారు. అటవీ ప్రాంతాల నుంచి ఏనుగులు గ్రామాల్లోకి ప్రవేశించి పంటలను ధ్వంసం చేయడంతో పాటు ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతున్న పరిస్థితులు చాలాకాలంగా కొనసాగుతున్నాయని పవన్ కల్యాణ్ అన్నారు. ముఖ్యంగా పార్వతీపురం మన్యం జిల్లాలో ఈ సమస్య తీవ్రంగా ఉందని, ఉత్తరాంధ్ర పర్యటన సందర్భంగా స్థానిక రైతులు, ప్రజలు ఈ సమస్యను తన దృష్టికి తీసుకొచ్చారని గుర్తు చేశారు. ప్రజల ప్రాణాలు, రైతుల పంటలను రక్షించడం ప్రభుత్వ బాధ్యతగా భావించి ఆధునిక సాంకేతికతతో గుచ్చిమి ఎలిఫెంట్ హోల్డింగ్ ఏరియాను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఉత్తరాంధ్రలో మానవఏనుగు సంఘర్షణల నివారణలో ఈ కేంద్రం ఒక కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మనుషులు, ఏనుగులు పరస్పర సామరస్యంతో జీవించే పరిస్థితులను కల్పించడంలో గుచ్చిమి కుంకీ ఏనుగుల శిబిరం కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. అందుకే ఈ కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రజలకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా కర్ణాటక ప్రభుత్వం, ఆ రాష్ట్ర ప్రజలు అందించిన సహకారాన్ని పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తిని గౌరవించి నాలుగు కుంకీ ఏనుగులను ఎంతో ఆప్యాయతతో ఆంధ్రప్రదేశ్‌కు పంపించడం వారి స్నేహభావానికి నిదర్శనమని కొనియాడారు. ఏనుగులను అందించడం అంటే తమ సంపదను పంచుకున్నట్టేనని కర్ణాటక ప్రజలు భావిస్తారని పేర్కొన్నారు. అలాంటి విలువైన సహకారాన్ని తెలుగు ప్రజల భద్రత కోసం అందించిన కర్ణాటక ప్రభుత్వం, అక్కడి ప్రజలకు రాష్ట్ర ప్రజల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. వన్యప్రాణుల సంరక్షణతో పాటు ప్రజల భద్రతకు సమాన ప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. శాస్త్రీయ విధానాలు, ఆధునిక సాంకేతికత వినియోగంతో అటవీ ఏనుగుల సమస్యకు సమర్థవంతమైన పరిష్కారాలు అమలు చేస్తామని తెలిపారు. గుచ్చిమి కుంకీ ఏనుగుల శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కె. అచ్చెన్నాయుడు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, అటవీ శాఖ ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌సీబీకి చారిత్రక ఘనత.

- 300 మిలియన్ డాలర్ల బ్రాండ్ విలువ దాటిన తొలి ఐపీఎల్ ఫ్రాంచైజీ.

**ఢిల్లీ, మహా:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) చరిత్రలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. 300 మిలియన్ డాలర్ల బ్రాండ్ విలువను అధిగమించిన తొలి ఐపీఎల్ ఫ్రాంచైజీగా నిలిచి మరో మైలురాయిని అందుకుంది. అమెరికాకు చెందిన ప్రముఖ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ హౌలిహాన్ లోకీ విడుదల చేసిన '2026 ఐపీఎల్ వాల్యుయేషన్ స్టడీ' నివేదిక ప్రకారం, ఆర్‌సీబీ బ్రాండ్ విలువ 16 శాతం పెరిగి 312 మిలియన్ డాలర్లకు చేరుకుంది. ఇదే సమయంలో ఐపీఎల్ మొత్తం బ్రాండ్ విలువ తొలిసారిగా 20.6 బిలియన్ డాలర్లకు చేరి ప్రపంచ క్రీడా లీగ్‌లలో తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంది.2026 సీజన్‌లో ఆర్‌సీబీ పురుషుల జట్టుతో పాటు మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లోనూ టైటిల్ సాధించడం, ప్రపంచవ్యాప్తంగా అభిమానుల ఆదరణ మరింత పెరగడం, స్పాన్సర్‌షిప్‌లు, వాణిజ్య ఒప్పందాల విస్తరణ వంటి అంశాలు బ్రాండ్ విలువ పెరగడానికి ప్రధాన కారణాలని నివేదిక వెల్లడించింది. జట్టు ప్రదర్శనతో పాటు మార్కెటింగ్ వ్యూహాలు, డిజిటల్ వ్యాపార విస్తరణ కూడా ఆర్‌సీబీ విలువను కొత్త స్థాయికి తీసుకెళ్లినట్లు పేర్కొంది. బ్రాండ్ విలువల జాబితాలో 264 మిలియన్ డాలర్లతో ముంబయి ఇండియన్స్ రెండో స్థానంలో నిలవగా, 245 మిలియన్ డాలర్లతో కోల్‌కతా నైట్ రైడర్స్ మూడో స్థానాన్ని దక్కించుకుంది. చెన్నై సూపర్ కింగ్స్ 244 మిలియన్ డాలర్లతో నాలుగో స్థానంలో నిలిచింది. మహేంద్ర సింగ్ ధోని జట్టులో లేకపోవడం, 2026 సీజన్‌లో వరుస పరాజయాలు ఎదుర్కోవడం సీఎస్‌కే బ్రాండ్ విలువపై ప్రభావం చూపినట్లు నివేదిక విశ్లేషించింది. అనంతరం సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్, గుజరాత్ టైటాన్స్, ఢిల్లీ క్యాపిటల్స్, లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ వరుస స్థానాల్లో నిలిచాయి.ఐపీఎల్ బ్రాండ్ విలువ గత కొన్నేళ్లుగా వేగంగా పెరుగుతోందని నివేదిక వెల్లడించింది. 2023లో 15.4 బిలియన్ డాలర్లుగా ఉన్న ఐపీఎల్ విలువ 2024లో 16.4 బిలియన్ డాలర్లకు, 2025లో 18.5 బిలియన్ డాలర్లకు పెరిగి, 2026 నాటికి 20.6 బిలియన్ డాలర్లను చేరుకుంది. మీడియా హక్కులు, స్పాన్సర్‌షిప్ ఒప్పందాలు, టికెట్ విక్రయాలు, డిజిటల్ ప్రసారాల ద్వారా 2026 సీజన్ ఆదాయం 1.8 బిలియన్ డాలర్లను దాటే అవకాశముందని నివేదిక అంచనా వేసింది.

# ఇరాన్‌కు ట్రంప్ వార్నింగ్

**ఢిల్లీ, మహా:** మిడిల్ ఈస్ట్‌లోని అమెరికా సైనిక స్థావరంపై ఇరాన్ క్షిపణి దాడి చేయడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరాన్‌పై శక్తివంతమైన సైనిక చర్య తప్పదని హెచ్చరిస్తూ, టెహ్రాన్ తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. అమెరికాకు చెందిన ఓ ప్రముఖ మీడియాకు ఇచ్చిన ఫోన్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. "మన శత్రువులను అత్యంత ఘోరంగా దెబ్బకొడతాం. వారికి గట్టి గుణపాఠం చెబుతాం" అని వ్యాఖ్యానించారు.ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) జోర్డాన్‌లోని అమెరికా సైనిక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుని అర్ధరాత్రి పలు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. అయితే అమెరికా సెంట్రల్ కమాండ్ అప్రమత్తమై అన్ని క్షిపణులను గాల్లోనే విజయవంతంగా కూల్చివేసినట్లు వెల్లడించింది. ఈ ఘటనలో అమెరికా సైనికులకు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు తెలిపారు. దాడి నేపథ్యంలో మిడిల్ ఈస్ట్‌లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి

# రైతులు–విద్యార్థుల ఉమ్మడి పోరాటానికి సన్నాహాలు

**ఢిల్లీ, మహా :** రైతులు, విద్యార్థులు, యువతను ఒకే వేదికపైకి తీసుకొచ్చి కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై ఉమ్మడి ఉద్యమం చేపట్టేందుకు ప్రయత్నాలు ప్రారంభించినట్లు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రకటించింది. ఈ దిశగా రైతు సంఘాలతో చర్చలు ప్రారంభించిన పార్టీ ప్రతినిధులు, భవిష్యత్ కార్యాచరణపై మంతనాలు సాగిస్తున్నారు.ఈ నేపథ్యంలో సీజేపీ ప్రతినిధి అశుతోష్‌తో పాటు పలువురు విద్యార్థి నేతలు భారతీయ కిసాన్ యూనియన్ (బీకేయూ) జాతీయ నాయకుడు రాకేశ్ టికాయత్‌ను మంగళవారం కలిశారు. ఈ సమావేశంలో రైతులు, విద్యార్థులు, యువతను ఒకే వేదికపైకి తీసుకువచ్చి దేశవ్యాప్తంగా సంయుక్త ఉద్యమానికి రూపకల్పన చేయడం, ఉమ్మడి కార్యాచరణ రూపొందించడం వంటి అంశాలపై చర్చించినట్లు సమాచారం.సమావేశం అనంతరం అశుతోష్ మాట్లాడుతూ.. దేశంలో రైతులు, విద్యార్థులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలపై సంయుక్తంగా పోరాటం నిర్వహించాలని భావిస్తున్నామని తెలిపారు

# కే కే కన్వెన్షన్ ఇదేం విడ్డూరం..

## కల్యాణ మండపమట! పంచాయతీ రికార్డుల్లో మాత్రం 'ఇల్లే'నట!

- లక్షల విలువైన కమర్షియల్ పన్నులకు గండి.. కేవలం రూ. 5 వేల రసీదుతో సరిపెట్టిన వైనం!
- నిబంధనలు లేవు.. అనుమతులు లేవు.. రేకుల షెడ్డులో సాగుతున్న భారీ 'కేకే కన్వెన్షన్' వ్యాపారం!
- కాగితాల్లో ఒకలా.. క్షేత్రస్థాయిలో మరోలా.. అక్రమాలకు అండగా నిలుస్తున్న అధికారులు ఎవరు?










**కాకినాడ మహా ప్రతినిధి :** కాకినాడ జిల్లా శంఖవరం మండలం అన్నవరం మెయిన్ రోడ్డు లో కేకే కన్వెన్షన్ లో ఒక పక్క చూస్తే వందలాది మందితో పెళ్లిళ్లు, శుభకార్యాలు, రాజకీయ పార్టీ సమావేశాలు, బర్త్డే పార్టీలు, వాణి ఫంక్షన్లు జరుగుతుంటాయి.. ఏసీ కళ్యాణ మండపం గదులను అద్దెలకు ఇస్తూ రోజుకు వేలాది రూపాయలు వసూలు చేస్తుంటారు. కానీ, ప్రభుత్వ రికార్డులు తీసి చూస్తే మాత్రం అక్కడ అసలు కల్యాణ మండపమే లేదట! అదొక సాదాసీదా నివాస గృహమట! వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా.. ఎ.అన్నవరం గ్రామపంచాయతీ పరిధిలో నడుస్తున్న "కేకే కన్వెన్షన్ & రూమ్స్" అక్రమ వ్యాపార భాగోతంలో ఇప్పుడు ఇదే నిజమని సాక్ష్యాలతో సహా స్పష్టమవుతోంది. కనీస టౌన్ ప్లానింగ్ అనుమతులు లేని ఒక రేకుల షెడ్డును, అధికారుల అండదండలతో రికార్డుల్లో కేవలం ఒక సాధారణ "ఇల్లు" గా చూపించి ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి కొడుతున్నారు.

**'ఇల్లు' పేరుతో పన్ను దారి మళ్లింపు..**

నిబంధనల ప్రకారం వాణిజ్య పరంగా ఈవెంట్లు జరిపే కమర్షియల్ కల్యాణ మండపాలకు, వాటి విస్తీర్ణం బట్టి వేలల్లో, లక్షల్లో కమర్షియల్ అసెస్మెంట్ పన్ను విధించాలి. కానీ, ఈ కేకే కన్వెన్షన్ యాజమాన్యం అధికారులతో లోపాయికారీ ఒప్పందాలు కుదుర్చుకుని, సదరు భవనాన్ని ఒక నివాస గృహంగా రికార్డుల్లో నమోదు చేయించింది. ఐదు వేలతో సరిపెట్టారు: 2024, 2025 ఆర్థిక సంవత్సరానికి గానూ ఈ భారీ వాణిజ్య సముదాయానికి (డోర్ నంబర్ 6342, అసెస్మెంట్ నంబర్ 2263) గ్రామపంచాయతీ వారు కేవలం రూ. 5,833 పన్ను మాత్రమే వేసి చేతులు దులుపుకున్నారు. ప్రభుత్వ సొమ్ము లూటీ: చట్టప్రకారం కమర్షియల్ బిల్డింగ్‌గా దీనిని పరిగణించి ఉంటే, ప్రభుత్వానికి లైసెన్స్ ఫీజులు, కమర్షియల్ పన్నుల రూపంలో ప్రతి ఏటా లక్షలాది రూపాయల ఆదాయం వచ్చేది. కానీ, ఇక్కడ పన్నును "ఇల్లు" కేటగిరీ కిందకు మార్చి ప్రభుత్వ సొమ్మును అడ్డగోలుగా నొక్కేస్తున్న వైనం స్పష్టమవుతోంది.కాగితాల్లో ఇల్లు.. కరెంటుకు మాత్రం ఫంక్షన్ హాలా?

ఇక్కడే అధికారుల మాయాజాలం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఒకవైపు పంచాయతీ పన్ను రసీదులోనేమో దీనిని "ఇల్లు" అని రాశారు. కానీ, ఇదే పంచాయతీ కార్యదర్శి విద్యుత్ శాఖకు ఇచ్చిన ఎన్ఓసీలో మాత్రం "ఏసీ షీటెడ్ ఫంక్షన్ హాల్" అని రాసి, దానికి కమర్షియల్ హైలోడ్ కరెంటు మరియు ప్రత్యేక ట్రాన్స్ఫార్మర్ ఇవ్వాలని సిఫార్సు చేయడం గమనార్హం.

రికార్డుల్లో ఇల్లుగా ఉన్న భవనానికి విద్యుత్ శాఖ అధికారులు కమర్షియల్ కేటగిరీ కింద భారీ ట్రాన్స్ఫార్మర్ లైసెన్స్ ఏ రూల్ ప్రకారం మంజూరు చేశారు?

పంచాయతీ రికార్డుల్లో పన్ను తక్కువ కట్టడానికి "ఇల్లు" అని, విద్యుత్ లోడ్ ఎక్కువ పొందడానికి "ఫంక్షన్ హాల్" అని రాసినా.. ఉన్నతాధికారులు దీనిని ఎందుకు కళ్ళు మూసుకుని వదిలేశారు?

వాణిజ్య పన్నుల శాఖకు కనపడని భారీ టర్నోవర్..

భవనాన్ని రికార్డుల్లో ఇల్లుగా చూపించడం వల్లే వీరు వాణిజ్య పన్నుల శాఖ నుండి మరియు జీఎస్టీ పరిధి నుండి కూడా చాలా సులభంగా తప్పించుకుంటున్నారు.

**జీఎస్టీ ఉల్లంఘన:** జీఎస్టీ చట్టం ప్రకారం సేవారంగంలో రూ. 20 లక్షల వార్షిక టర్నోవర్ దాటిన ప్రతి సంస్థా ఖచ్చితంగా జీఎస్టీ రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలి. ఈ కన్వెన్షన్ హాల్ ద్వారా వచ్చే ఆదాయం ఆ పరిమితిని ఎప్పుడో దాటినా.. కనీస భవన నిర్మాణ ప్లానే లేని ఈ రేకుల షెడ్డుకు జీఎస్టీ కనెక్షన్ ఉందా లేదా అనేది అనుమానమే. ఇల్లు పేరుతో సాగుతున్న ఈ అక్రమ కన్వెన్షన్ హాల్ టర్నోవర్ మొత్తాన్ని నల్లధనంగా మారుస్తూ, ప్రభుత్వానికి కట్టాల్సిన ఒక్క రూపాయి పన్ను కూడా కట్టకుండా యాజమాన్యం యథేచ్ఛగా దోపిడీ చేస్తోంది.

**ప్రాణాలతో చెలగాటం..**

ఆంధ్రప్రదేశ్ ఫైర్ సర్వీస్ చట్టం ప్రకారం పబ్లిక్ కూడే ఫంక్షన్ హాళ్లకు ఫైర్ సేఫ్టీ NOC తప్పనిసరి. కానీ, ఈ రేకుల షెడ్డుకు ఎలాంటి అత్యవసర ద్వారాలు లేవు. రేకుల షెడ్డుకు ఆనుకుని తగినంత సెట్ బ్యాక్ లేకుండా ట్రాన్స్ఫార్మర్ ఉంచడం వల్ల భవిష్యత్తులో ఏదైనా షార్ట్ సర్క్యూట్ జరిగితే వందలాది మంది ప్రాణాలు ప్రమాదంలో పడే అవకాశం ఉంది. అలాగే సరైన పార్కింగ్ లేకపోవడంతో వాహనాలను రోడ్డుపైనే నిలపడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది.

ఉన్నతాధికారులు స్పందించాలి:

నిబంధనల ప్రకారం అనధికారిక కట్టడాలకు వాణిజ్య కనెక్షన్లు గానీ, అనుమతులు గానీ ఇవ్వకూడదని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. మరి ఏ రికార్డులను చూసి ఈ కమర్షియల్ ట్రాన్స్ఫార్మర్‌కు, ఫంక్షన్ హాల్ నిర్వహణకు స్థానిక యంత్రాంగం మరియు విద్యుత్ శాఖ సహకరించాయో ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ సమాధానం చెప్పాల్సి ఉంది. ఈ విధంగా రికార్డులను తారుమారు చేసి, ప్రభుత్వ ఖజానాకు లక్షల రూపాయల గండి కొట్టిన స్థానిక పంచాయతీ సిబ్బందిపై, విద్యుత్ శాఖ అధికారులపై మరియు కేకే కన్వెన్షన్ యాజమాన్యంపై జిల్లా కలెక్టర్ గారు మరియు విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు తక్షణమే క్రిమినల్ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ANN తెలుగు

# మహా పత్రిక

04

గురువారం, హైదరాబాద్ | 30-07-2026 | సంపాదకీయం | EDITOR IAL | WWW.MAHAADAILY.COM



# ఏమిటి నొన్నామ్యాక్సింగ్?

నేటి వేగవంతమైన జీవితంలో ఉదయం కళ్లు తెరవగానే మొబైల్ ఫోన్ చేతిలోకి తీసుకోవడం, తొందరపాటుగా అల్పాహారం ముగించేయడం, రోజంతా ఉద్యోగం లేదా చదువు ఒత్తిడిలో గడపడం, రాత్రి ఆలస్యంగా నిద్రపోవడం చాలామందికి సాధారణ జీవన శైలిగా మారిపోయింది. డిజిటల్ ప్రపంచం, సోషల్ మీడియా, నిరంతర పోటీతో నిండిన ఈ జీవితం యువతను మానసికంగా అలసటకు గురిచేస్తోంది. దీంతో ఈ ఒత్తిడికి భిన్నంగా ప్రశాంతమైన, సహజమైన జీవన విధానాన్ని అనుసరించాలని కోరుకునే యువత సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా 'నొన్నామ్యాక్సింగ్' అనే కొత్త లైఫ్‌స్టైల్ ట్రెండ్ వేగంగా ప్రాచుర్యం పొందుతోంది. ఇటాలియన్ భాషలో 'నొన్నా' అంటే అమ్మమ్మ. అంటే అమ్మమ్మలు అనుసరించే ప్రశాంతమైన, సహజమైన, క్రమబద్ధమైన జీవనశైలిని ఆధునిక జీవితంలో తిరిగి అలవాటు చేసుకోవడమే 'నొన్నామ్యాక్సింగ్' సారాంశం. ఆధునిక సాంకేతిక సౌకర్యాలపై పూర్తిగా ఆధారపడకుండా, ప్రకృతికి దగ్గరగా, కుటుంబంతో కలిసి, నెమ్మదిగా జీవించడం ఈ ట్రెండ్ ప్రధాన లక్ష్యం. ఈ జీవనశైలిలో భాగంగా ఉదయం లేవగానే ఫోన్ చూడకుండా ఇంటి పనులతో రోజును ప్రారంభించడం, ఆన్‌లైన్‌లో ఆహారం ఆర్డర్ చేయకుండా ఇంట్లోనే తాజా వంటలు చేసుకోవడం, రోజంతా మొబైల్, ల్యాప్‌టాప్, టీవీ వంటి స్క్రీన్‌లకు అతుక్కుపోకుండా కొంత సమయం ప్రకృతిలో గడపడం, సాయంత్రం నడకకు వెళ్లడం, ఇంటి ముందు లేదా బాల్కనీలో మొక్కలను సంరక్షించడం, కుటుంబ సభ్యులతో కలిసి కూర్చుని భోజనం చేయడం వంటి అలవాట్లను ప్రోత్సహిస్తున్నారు. ఇవన్నీ గతంలో మన తాతలు, అమ్మమ్మలు, పెద్దలు పాటించిన సాధారణ జీవన విధానాలే కావడం విశేషం. ఒకప్పుడు పాతకాలపు అలవాట్లుగా భావించిన ఈ జీవన విధానం ఇప్పుడు జెన్‌జీ యువతను విశేషంగా ఆకర్షిస్తోంది. సోషల్ మీడియా వేదికలైన ఇన్‌స్టాగ్రామ్, టిక్‌టాక్, యూట్యూబ్‌లలో 'నొన్నామ్యాక్సింగ్' పేరుతో లక్షలాది పోస్టులు, వీడియోలు వైరల్ అవుతున్నాయి. ఇంట్లో వంట చేయడం, పుస్తకాలు చదవడం, తోటపని చేయడం, చేతిపనులు నేర్చుకోవడం, కుటుంబంతో సమయం గడపడం వంటి విషయాలను యువత గర్వంగా పంచుకుంటోంది. ప్రస్తుతం ఉద్యోగాలు, చదువు, కెరీర్, డెడ్‌లైన్లు, ఆర్థిక ఒత్తిళ్లు, ఎప్పుడూ ఏదో సాధించాలనే పోటీ కారణంగా యువత తీవ్ర మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటోంది. నిరంతరం ఆన్‌లైన్‌లో ఉండటం వల్ల ఏకాగ్రత తగ్గడం, ఆందోళన, నిద్రలేమి, ఒంటరితనం వంటి సమస్యలు కూడా పెరుగుతున్నాయి. ఈ పరిస్థితుల నుంచి బయటపడేందుకు ప్రశాంతమైన జీవనశైలిని ఎంచుకోవాలనే ఆలోచన బలపడుతోంది. ఈ ట్రెండ్‌లో ఖరీదైన జిమ్ సభ్యత్వాలు, ప్రత్యేక డైట్‌లు, సప్లిమెంట్లు లేదా విలాసవంతమైన జీవనశైలి అవసరం ఉండదు. ఇంట్లో తయారుచేసిన పోషకాహారం, ప్రతిరోజూ కొంత శారీరక శ్రమ, సమయానికి నిద్ర, కుటుంబ సభ్యులతో అనుబంధం, ప్రకృతితో సాన్నిహిత్యం వంటి సాధారణ అలవాట్లే ఇందులో ప్రధాన పాత్ర పోషిస్తాయి. ఈ మార్పులు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతను కూడా పెంచుతాయని నిపుణులు చెబుతున్నారు. మానసిక ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, డిజిటల్ పరికరాల వినియోగాన్ని కొంత మేర తగ్గించడం, ప్రతి రోజూ ప్రకృతిలో కొంత సమయం గడపడం, కుటుంబంతో కలిసి భోజనం చేయడం, ఇంటి పనుల్లో పాల్గొనడం వంటి అలవాట్లు ఒత్తిడిని తగ్గించడంలో, భావోద్వేగ సమతుల్యతను పెంపొందించడంలో సహాయపడతాయి. అలాగే జీవితంలో చిన్న చిన్న విషయాలను ఆస్వాదించే అలవాటు పెరగడంతో సంతృప్తి, ఆనందం కూడా పెరుగుతాయని వారు సూచిస్తున్నారు. ఒకప్పుడు పెద్దల జీవనశైలిగా మాత్రమే కనిపించిన ఈ అలవాట్లు ఇప్పుడు ఆధునిక యువతకు కొత్త జీవన తత్వంగా మారుతున్నాయి. సాంకేతికతతో నిండిన ప్రపంచంలోనూ ప్రశాంతత, ఆరోగ్యం, కుటుంబ అనుబంధాలకు ప్రాధాన్యం ఇస్తూ 'నొన్నామ్యాక్సింగ్' ట్రెండ్ ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తుండటం విశేషం. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో కాసేపు నెమ్మదిగా జీవించడం కూడా ఆరోగ్యకరమైన జీవితానికి కీలకమనే సందేశాన్ని ఈ కొత్త ట్రెండ్ ఇస్తోంది.

# "త్వంహి దుర్గా దశ ప్రహరణధారిణీ.. కమలా కమలదళ విహారిణీ"

**డైలాగ్‌లు లేని ఒక మూగ చీకటి.. ఆ చీకటిని చీల్చుకుంటూ వినిపించే ఉక్కు లాంటి బూట్ల చప్పుళ్లు! "ఢిల్లీ రోడ్ల మీద, కలకత్తా వీధుల్లో ఏ ఒక్కడు 'వందేమాతరం' అని నినాదం ఇచ్చినా.. వాడి చర్మాన్ని కొరడా దెబ్బలతో వలవండి!" అనే బ్రిటిష్ కలెక్టర్ గర్జనలు ఆ గాలిలో విషం కక్కుతున్నాయి. కలకత్తాలోని ఒక ఇరుకైన, అండర్‌గ్రౌండ్ గది. అప్పుడు సమయం అర్ధరాత్రి దాటింది. మిణుకు మిణుకు మంటూ మూలన చిన్న నూనె దీపం, వెలుతురులో ఒక యువకుడు విలవిలలాడుతున్నాడు. కానీ అది భయంతో కాదు.. గుండెల్లో ఉప్పొంగుతున్న దేశభక్తి తన్నుకువచ్చి ఊపిరి ఆడని అగ్నిలా మారుతోంది. తన ఎడమ చేతి వేలిని కోసుకుని, ఆ ధారగా కారుతున్న రక్తంతో ఒక తెల్లని కాగితంపై అక్షరాలను అద్దుతున్నాడు. ఆ అక్షరాలే కోట్లాది మంది భారతీయుల గుండెల్లో స్వాతంత్ర్యపు చిచ్చును రగిలించిన మంత్రం.. 'వందేమాతరం'.**




అదొక నినాదం మాత్రమే కాదు, ఎంతోమంది దేశభక్తుల నెత్తురు మరిగించి, ఆంగ్లేయ సామ్రాజ్య గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన అమర గాథ! సూర్యుడు తూర్పున ఉదయించడం ఎంత నిజమో, ఒక దేశం తన ఉనికిని చాటుకోవాలంటే దానికి ఒక ఆత్మ ఉండాలనేది కూడా అంతే నిజం. 1870ల మధ్యకాలంలో మహానుభావుడు "బంకించంద్ర ఛటోపాధ్యాయ" సృష్టించిన ఆ దివ్య పదాలు.. 1882లో ప్రచురితమైన 'ఆనందమఠం' నవల ద్వారా (సన్యాసి తిరుగుబాటు నేపథ్యంలో) అగ్నిలా ప్రవహించాయి. అది మొదటిసారిగా బహిరంగ వేదికపై గొంతెత్తి పలికిన క్షణం ఒక చరిత్ర. 1896లో కలకత్తాలో జరిగిన ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ వార్షిక సమావేశం. సభా ప్రాంగణమంతా నిశ్శబ్దం. విశ్వకవి "రవీంద్రనాథ్ టాగోర్" గారు మైక్ ముందుకు వచ్చి, ఆ మాతృభూమిని కీర్తిస్తూ గొంతు సవరించుకుని తొలిసారిగా ఆ గీతాన్ని ఆలపించారు

ఆ క్షణంలో ఆ సభా ప్రాంగణంలోని ప్రతీ ఒక్కరి వెన్నులో విద్యుత్ ప్రవాహం కదిలింది. ఈ గీతం కేవలం అక్షరాల సముదాయం కాదు..మన మాతృభూమి యొక్క నాగరికత ఆత్మ అంటే సివిలైజేషనల్ ఎథోస్ కు ప్రతిరూపం.ఆ గీతం యొక్క అసలు అంతరార్థం ఏమిటో ఆ గొంతు ప్రసారం చేసింది. భారతమాతకు వందనం! తియ్యని నీటితో, కమ్మని పండ్లతో, చల్లని గాలులతో, పచ్చని పైరుతో విలసిల్లే భారతమాతకు వందనం. రాత్రులు తెల్లని వెన్నెలలతో పులకిస్తూ, విరబూసిన చెట్లతో శోభిల్లుతూ, స్వచ్ఛమైన నవ్వులతో, మధురమైన మాటలతో మాకు సుఖాలు కలిగిస్తూ వరాలిచ్చే భారత మాతకు వందనం అని..!

ఆ గొంతులోంచి ఉద్భవించిన మహా ప్రవాహం. తర్వాత ఒక ఉద్యమ రూపం దాల్చింది.1905లో లార్డ్ కర్జన్ బెంగాల్ విభజన కుట్ర పన్నినప్పుడు, దేశం మొత్తం ఒక్కసారిగా లేచి నిలబడి 'వందేమాతరం' అంటూ స్వదేశీ ఉద్యమాన్ని ఉప్పెనలా తలపించింది .1907లో జర్మనీలోని స్టట్‌గార్ట్ నగరంలో జరిగిన అంతర్జాతీయ సోషలిస్ట్ కాంగ్రెస్ వేదికపై విప్లవ వనిత 'మేడమ్ భికాజీ కామా' ఎగరవేసిన భారత తొలి త్రివర్ణ పతాకం మధ్యలో ఇదే 'వందేమాతరం' అక్షరాలు దేదీప్యమానంగా వెలిగాయి. బ్రిటిష్ పాలకుల ఉరికొయ్యలను నవ్వుతూ ముద్దాడిన ఖుదీరామ్ బోస్, మదన్ లాల్ ధింగ్రా వంటి విప్లవ వీరులు తమ ప్రాణాలను వదిలేటప్పుడు చివరిగా పలికిన తుది నినాదం కూడా ఇదే! ఇన్ని పోరాటాల ఫలితంగానే జనవరి 24, 1950న రాజ్యాంగ పరిషత్ దీనికి జాతీయ గీతంగా సమానమైన సముచిత గౌరవాన్ని కట్టబెట్టింది. ఈ దేశం కేవలం భౌగోళిక సరిహద్దుల కలయిక కాదు. ఇది ఒక శాశ్వతమైన జీవన విధానం.

ఈ దేశాన్ని నిలబెట్టడంలో, ప్రతీ పౌరుడి నరనరాల్లో దేశభక్తిని రగిలించడం లో, దేశ సమగ్రతను కాపాడుకోవడం, సాంస్కృతిక విలువలను పెంపొందించడం వంటి పౌర బాధ్యతలు విషయంలో నిరంతర స్ఫూర్తితో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ వంటి జాతీయ వాద సంస్థలు నేటికీ ఆ భావన ను సజీవంగా ఉంచారు. జన గణ మన' మన రాజ్యాంగబద్ధమైన జాతీయ గీతం, దానికి ఎల్లప్పుడూ తగిన గౌరవం ఇవ్వాలని స్పష్టం చేస్తూనే, అదే సమయంలో, భారతదేశం యొక్క అసలైన నాగరికత, సాంస్కృతిక జీవన విధానం, మాతృభూమిపట్ల అంతులేని భక్తిభావం వంటి అత్యున్నత అంశాలకు 'వందేమాతరం' నిలువెత్తు రూపమని స్వయం సేవక్ లు భయ్యాజీ జోషి, సునీల్ అంబేకర్ జీ తదితరులు ఎంతో గట్టిగా పునరుద్ఘాటించారు.ఈ విషయాన్ని సంఘ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా కూడా ఈ చారిత్రక సత్యాన్ని ప్రముఖంగా పునరుద్ఘాటించారు. వ్యవస్థాపకులు డాక్టర్ జీ నుంచి నేటి తరం వరకు ప్రతి ఒక్కరి ఆలోచన ఒక్కటే—"దేశం మొదట, వ్యక్తి తరువాత!" అనేదే...'

"వందేమాతరం
సుజలాం సుఫలాం మలయజ శీతలామ్
సస్యశ్యామలాం మాతరం వందేమాతరం
శుభ్రజ్యోత్స్న పులకిత యామినీమ్
పుల్ల కుసుమిత ద్రుమదళ శోభినీమ్
సుహాసినీం సుమధుర భాషిణీమ్
సుఖదాం వరదాం మాతరం వందేమాతరం
కోటి కోటి కంఠ కలకల నివాద కరాలే
కోటి కోటి భుజై ధృత ఖర కరవాలే
అబలాకేనో మాం ఎతో బలే
బహుబల ధారిణీం నమామి తారిణీం
రిపుదల వారిణీం మాతరం వందేమాతరం
తుమి విద్యా తుమి ధర్మ
తుమి హృది తుమి మర్మ
త్వంహి ప్రాణః శరీరే
బహుతే తుమి మా శక్తి
హృదయే తుమి మా భక్తి
తో మారయి ప్రతిమాగడి మందిరే మందిరే వందేమాతరం
త్వంహి దుర్గా దశ ప్రహరణధారిణీ
కమలా కమలదళ విహారిణీ
వాణి విద్యాదాయినీ, నమామిత్వాం, నమామి కమలాం
అమలాం, అతులాం, సుజలాం, సుఫలాం, మాతరం వందేమాతరం
శ్యామలాం, సరలాం, సుస్మితాం, భూషితాం
ధరణీం, భరణీం, మాతరం వందేమాతరం
వందేమాతరం"

ఇంతటి పవిత్రమైన జాతీయ గీతానికి, అమరుల త్యాగాలకు నేడు పార్లమెంట్ సాక్షిగా అత్యున్నత రక్షణ కవచం లభించింది. భారతదేశ సాంస్కృతిక వైభవాన్ని పునరుద్ధరించాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జీ ప్రభుత్వ దృఢ సంకల్పానికి ప్రతీకగా.. రాజ్యసభలో ఆమోదం పొందిన "జాతీయ గౌరవ అవమాన నిరోధక (సవరణ) బిల్లు 2026" అద్భుతమైన చట్ట రూపం దాల్చింది. మన జాతీయ చిహ్నాలను, గీతాలను అగౌరపరిచే ఎవరినైనా ఉపేక్షించని ఈ సరికొత్త చట్టం.. దేశ భవిష్యత్తును నిర్మించే 'నేషన్ బిల్డింగ్' ప్రక్రియలో మరో మహా అడుగు. ఈ విషయాన్ని దేశం పట్ల ప్రేమ ఉన్న వ్యక్తులంతా మనసారా స్వాగతిస్తూ, గర్వంగా అభినందిస్తున్నారు. ఇప్పుడు నేటి రియాల్టీలోకి వద్దాం. కాలేజీ కారిడార్లు, స్మార్ట్‌ఫోన్ స్క్రీన్లు, ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, మరియు ఏఐ టెక్నాలజీతో దూసుకుపోతున్న జెన్ జీ, ఇంకా రేపటి భవిష్యత్తును అంచనా వేస్తున్న జెన్ ఆల్ఫా.. జెన్ బీటా... యువత అంతా.. ఒక్క క్షణం మీ ఫోన్లను పక్కన పెట్టి ఈ వాస్తవాన్ని ఆలోచించండి. ఈరోజు మీరు ఓపెన్‌గా, ఫ్రీగా, గర్వంగా కాలేజీ గేట్లు దాటుతున్నారన్నా, సోషల్ మీడియాలో మీ గొంతును స్వేచ్ఛగా వినిపిస్తున్నారన్నా.. దానికి కారణం నిశ్శబ్దంగా సేవ చేస్తూ దేశనిర్మాణంలో ఉన్న ఎవరో తెలియని, గుర్తింపు కోరుకోని త్యాగధనులు, అప్పట్లో చిందించిన రక్తమే! వారు గురుదక్షిణగా చెల్లించిన వారి జీవితకాలమే! కాలేజీలో లేదా ఎక్కడైనా 'వందేమాతరం' లేదా జాతీయ గీతం వినిపిస్తే, మీ చేతిలో ఉన్న ఫోన్‌ను పక్కన పెట్టి ఆ క్షణాన్ని గౌరవించండి. మీ మాతృభూమి గొప్పతనాన్ని, మన సాంస్కృతిక మూలాలను మీ సోషల్ మీడియా హ్యాండిల్స్‌లో సెలెబ్రేట్ చేసుకోండి. ఈ దేశం మనది. దీని సాంస్కృతిక వైభవాన్ని భవిష్యత్తు తరాలకు అందించాల్సిన మహా బాధ్యత మనందరి భుజాల మీదే ఉంది. నేడు పార్లమెంటులో చట్టం వచ్చింది, కానీ ఆ చట్టానికి నిలువెత్తు ప్రాణం పోసేది మీ గుండెల్లోని దేశభక్తే! రండి, ఆ గర్వాన్ని గుండెల్లో నింపుకుంటూ, ఆ ఉత్సాహాన్ని నరనరాల్లో ప్రవహింపజేస్తూ గట్టిగా గొంతు కలుపుదాం..! వందేమాతరం! జై హింద్! భారత్ మాతా కీ జై!



**(శివకుమార్ గనివాడ, సీనియర్ సామాజిక విశ్లేషకులు)**

9951715215

# పప్పులు తింటే గ్యాస్ ఎందుకు వస్తుంది?



మన రోజువారీ ఆహారంలో పప్పులు ఎంతో ముఖ్యమైనవి. ప్రోటీన్లు, పీచుపదార్థం, విటమిన్లు, ఖనిజలవణాలు సమృద్ధిగా ఉండే పప్పులను వైద్యులు కూడా ఆరోగ్యకరమైన ఆహారంగా సూచిస్తుంటారు. అయితే చాలామంది పప్పు తిన్న వెంటనే కడుపు ఉబ్బరం, గ్యాస్, అసౌకర్యం వంటి సమస్యలను ఎదుర్కొంటుంటారు. కొందరికి అయితే పప్పు తిన్న తర్వాత గంటల తరబడి కడుపు బిగుసుకుపోవడం, అపానవాయువు ఎక్కువగా రావడం, కడుపులో గిలగిలలు వినిపించడం వంటి ఇబ్బందులు కూడా కలుగుతాయి. దీంతో చాలా మంది పప్పులను పూర్తిగా మానేయాలని భావిస్తుంటారు.

అయితే పప్పులు సమస్యకు కారణం కావని, వాటిలో ఉండే కొన్ని ప్రత్యేక కార్బోహైడ్రేట్లు మరియు మన జీర్ణవ్యవస్థ పనితీరే ఇందుకు ప్రధాన కారణమని తాజా అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఇటీవల ఫుడ్ రివ్యూ ఇంటర్నేషనల్ జర్నల్‌లో ప్రచురితమైన పరిశోధన ప్రకారం, పప్పులు తిన్న తర్వాత గ్యాస్ ఏర్పడటం సహజమైన శారీరక ప్రక్రియ అని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

**పప్పుల్లోని ప్రత్యేక కార్బోహైడ్రేట్లే అసలు కారణం**

పప్పుల్లో రాఫినోస్ ఫ్యామిలీ ఆలిగోసాకరైడ్లు (RFOs) అనే సంక్లిష్ట కార్బోహైడ్రేట్లు అధికంగా ఉంటాయి. వీటిని పూర్తిగా జీర్ణం చేయడానికి అవసరమైన ఆల్ఫాగెలాక్టోసిడేస్ అనే ఎంజైమ్ మన శరీరంలో తగినంత పరిమాణంలో ఉండదు. దీంతో ఈ కార్బోహైడ్రేట్లు చిన్నపేగులో పూర్తిగా జీర్ణం కాకుండా పెద్దపేగుకు చేరుకుంటాయి.

అక్కడ ఉండే కోట్లాది మంచి బ్యాక్టీరియా వాటిని విచ్ఛిన్నం చేసే ప్రక్రియను ప్రారంభిస్తుంది. ఈ ప్రక్రియను ఫెర్మెంటేషన్ అంటారు. ఈ సమయంలో హైడ్రోజన్, కార్బన్ డయాక్సైడ్, మీథేన్ వంటి వాయువులు ఉత్పత్తి అవుతాయి. ఇవే కడుపులో గ్యాస్ పేరుకుపోవడం, ఉబ్బరం, అపానవాయువు వంటి సమస్యలకు కారణమవుతాయి.

**అందరికీ ఒకేలా ఎందుకు ఉండదు?**

పప్పులు తిన్న తర్వాత కొందరికి ఎలాంటి ఇబ్బంది ఉండదు. మరికొందరికి మాత్రం చిన్న పరిమాణంలో తిన్నా గ్యాస్ సమస్య తీవ్రంగా ఉంటుంది. దీనికి ప్రధాన కారణం ప్రతి వ్యక్తి జీర్ణవ్యవస్థ భిన్నంగా ఉండటమే. వయస్సు, ఆహారపు అలవాట్లు, పేగుల్లోని బ్యాక్టీరియా రకం, శారీరక చురుకుదనం, తాగే నీటి పరిమాణం వంటి అంశాలు కూడా ప్రభావం చూపుతాయి.

**గట్ మైక్రోబయోమ్ పాత్ర చాలా కీలకం**

మన పేగుల్లో నివసించే మంచి సూక్ష్మజీవుల సమూహాన్నే గట్ మైక్రోబయోమ్ అంటారు. ఇవి ఆహారాన్ని జీర్ణం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయి. గట్ మైక్రోబయోమ్ ఆరోగ్యంగా ఉంటే పప్పుల్లోని పీచుపదార్థం, సంక్లిష్ట కార్బోహైడ్రేట్లను మరింత సమర్థంగా జీర్ణం చేయగలుగుతుంది.

కానీ యాంటీబయాటిక్స్ అధిక వినియోగం, జంక్ ఫుడ్ ఎక్కువగా తినడం, వ్యాయామం లేకపోవడం, ఒత్తిడి వంటి కారణాలతో గట్ మైక్రోబయోమ్ సమతుల్యత దెబ్బతింటే గ్యాస్, మలబద్ధకం, అజీర్ణం వంటి సమస్యలు ఎక్కువయ్యే అవకాశం ఉంటుంది.

**కాలానుగుణంగా కూడా సమస్య పెరుగుతుందా?**

వైద్య నిపుణుల అభిప్రాయం ప్రకారం వాతావరణ మార్పులు, ఉష్ణోగ్రతల హెచ్చుతగ్గులు, తక్కువ శారీరక శ్రమ, నీరు తక్కువగా తాగడం వంటి కారణాల వల్ల కొన్ని కాలాల్లో జీర్ణవ్యవస్థ పనితీరు మందగిస్తుంది. అందువల్ల కొన్ని సీజన్లలో పప్పులు తిన్న తర్వాత గ్యాస్ సమస్య మరింత ఎక్కువగా అనిపించవచ్చు.

**పప్పులు తినడం మానేయాలా?**

గ్యాస్ వస్తోందని పప్పులను పూర్తిగా మానేయడం సరైన నిర్ణయం కాదని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. ఎందుకంటే పప్పుల్లో అధిక నాణ్యత గల ప్రోటీన్లు, పీచు పదార్థం, ఐరన్, ఫోలేట్, పొటాషియం, మెగ్నీషియం వంటి ఎన్నో పోషకాలు ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యం, మధుమేహ నియంత్రణ, బరువు నియంత్రణ, జీర్ణవ్యవస్థ ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడతాయి.

**గ్యాస్ తగ్గాలంటే ఈ చిట్కాలు పాటించండి**

- **పప్పులను ముందుగా నానబెట్టండి:** పప్పులను కనీసం 6 నుంచి 8 గంటలు నానబెట్టి, ఆ నీటిని పారబోసి వండితే గ్యాస్‌కు కారణమయ్యే ఆలిగోసాకరైడ్ల పరిమాణం తగ్గుతుంది.
- **మొలకలు చేసి తినండి:** మొలకెత్తించిన పప్పుల్లో కార్బోహైడ్రేట్ల నిర్మాణం మారడంతో అవి సులభంగా జీర్ణమవుతాయి. పోషక విలువలు కూడా పెరుగుతాయి.
- **ఒక్కసారిగా ఎక్కువగా తినొద్దు:** పప్పులు తినే అలవాటు లేని వారు ఒకేసారి ఎక్కువగా తీసుకోకుండా, కొద్దికొద్దిగా పరిమాణాన్ని పెంచుకుంటూ వెళ్లాలి. దీంతో పేగుల్లోని బ్యాక్టీరియా కూడా వాటికి అలవాటు పడుతుంది.
- **జీర్ణక్రియకు సహాయపడే దినుసులు కలపండి:** అల్లం, జీలకర్ర, ఇంగువ, సోంపు, మిరియాలు వంటి మసాలా దినుసులతో పప్పులు వండితే జీర్ణక్రియ మెరుగుపడే అవకాశం ఉంటుంది.
- **తగినంత నీరు తాగండి:** పప్పుల్లో పీచుపదార్థం అధికంగా ఉంటుంది. కాబట్టి రోజంతా తగినంత నీరు తాగడం వల్ల జీర్ణవ్యవస్థ సక్రమంగా పనిచేస్తుంది.
- **నెమ్మదిగా నమిలి తినండి:** ఆహారాన్ని బాగా నమిలి తినడం వల్ల జీర్ణక్రియ సులభమవుతుంది. వేగంగా తినడం వల్ల గాలి కూడా ఎక్కువగా లోపలికి వెళ్లి గ్యాస్ సమస్యను పెంచుతుంది.
- **రోజూ వ్యాయామం చేయండి:** రోజుకు కనీసం 30 నిమిషాలు నడక లేదా తేలికపాటి వ్యాయామం చేస్తే పేగుల కదలికలు మెరుగుపడి గ్యాస్ సమస్య తగ్గే అవకాశం ఉంటుంది.
- **వైద్యులను ఎప్పుడు సంప్రదించాలి?** పప్పులు తిన్న ప్రతిసారీ తీవ్రమైన కడుపు నొప్పి, విరేచనాలు, వాంతులు, బరువు తగ్గడం, మలంలో రక్తం కనిపించడం లేదా గ్యాస్ సమస్య దీర్ఘకాలంగా కొనసాగితే స్వయంగా మందులు వాడకుండా గ్యాస్ట్రోఎంటరాలజిస్టును సంప్రదించడం మంచిది. కొన్నిసార్లు లాక్టోస్ అసహనం, ఐబీఎస్ లేదా ఇతర జీర్ణవ్యవస్థ సమస్యలు కూడా దీనికి కారణం కావచ్చు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- భారీ వర్షా లు కురిసే అవకాశం
- అన్ని శాఖల అధికారులు కార్యస్థానాల్లో అందుబాటులో ఉండాలి
- భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: రానున్న 36 గంటల్లో వాతావరణ శాఖ భారీ వర్షాల హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో జిల్లా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. భారీ వర్షాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ మేరకు బుధవారం జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించి భారీ వర్షాల నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. భారీ వర్షాల హెచ్చరికల దృష్ట్యా అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉంటూ తమ కార్యస్థానాల్లో తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. వరద ముంపునకు



గురయ్యే ప్రాంతాలను ముందుగానే గుర్తించి అక్కడ నివసిస్తున్న ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భారీ వరద ప్రవాహం సమయంలో నదులు వాగులు కాలువలు చెరువులు వంటి జలవనరుల వద్దకు వెళ్లకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని నీటి ప్రవాహాన్ని దాటేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించవద్దని సూచించారు. అలాగే రహదారులు కల్వర్టులపై నీరు ప్రవహిస్తున్న ప్రాంతాల్లో ప్రజలు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. భారీ వర్షాల కారణంగా తాగునీరు కలుషితమయ్యే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని సురక్షిత తాగునీటి సరఫరాకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎప్పటికప్పుడు సలహాలు సూచనలు అందించాలని కలెక్టర్ అన్నారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు తాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిన సందర్భాల్లో ఆసుపత్రుల్లో వైద్య సేవలకు ఆటంకం కలగకుండా అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ప్రసవ సమయం సమీపించిన గర్భిణీలను ముందుగానే సమీప ఆసుపత్రులు లేదా గర్భిణీ వసతి కేంద్రాలకు తరలించి అవసరమైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు.



## బసంత్‌నగర్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఎంపీడీఓకు సన్మానం

**పెద్దపల్లి, జూలై 29 (మహా):** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గంలోని పాలకుర్తి మండలానికి నూతనంగా నియమితులైన ఎంపీడీఓ గ్రామ పంచాయతీని తొలిసారిగా సందర్శించిన సందర్భంగా బసంత్‌నగర్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు.సర్పంచ్ పర్శవేణి శ్రీనివాస్ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ పాలకవర్గం, సిబ్బంది కలిసి ఎంపీడీఓను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి, పారదర్శక పరిపాలన, మౌలిక సదుపాయాల కల్పనలో మండల పరిషత్ కార్యాలయం నుంచి పూర్తి సహకారం అందించాలని నూతన ఎంపీడీఓను కోరారు.ఈ కార్యక్రమంలో ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శి, ఉప సర్పంచ్ అట్ల మౌనిక శ్రీనివాస్, కారోబార్, వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## ఒడియా క్యాంప్‌లో నూతన అంగన్‌వాడీ భవనం

- భవనాన్ని ప్రారంభించిన ఐటీసీ మిషన్ సునెహ్రా కల్

**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: చిన్నారుల సంరక్షణ, ప్రాథమిక బాల్యాభివృద్ధి, గ్రామీణ మౌలిక వసతుల బలోపేతానికి అంగన్వాడి కేంద్రాలను నెలకొల్పగా తాజాగా ఐటీసీ మిషన్ సునెహ్రా కల్ (ఎమ్మెస్ కే) ఆధ్వర్యంలో సారపాక గ్రామ పంచాయతీ పరిధిలోని ఒడియా క్యాంప్‌లో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని బుధవారం ఐటీసీ మిషన్ సునెహ్రా కల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సిడిపిఓ స్వర్ణలత లెనినా మాట్లాడుతూ నాణ్యమైన అంగన్‌వాడీ మౌలిక వసతులు చిన్నారుల విద్య పోషకాహార మెరుగుదల తల్లిశిశు ఆరోగ్య సంరక్షణకు ఎంతో కీలకమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, పిల్లల సంక్షేమాన్ని పెంపొందించేందుకు శాశ్వత కమ్యూనిటీ ఆస్తులను సృష్టిస్తున్న ఐటీసీ మిషన్ సునెహ్రా కల్, వాష్ ఇన్‌స్టిట్యూట్ కృషిని ఆమె అభినందించారు. అదే విధంగా సారపాక గ్రామ సర్పంచ్ శివరాం కిషోర్ నాయక్ మాట్లాడుతూ గ్రామపంచాయతీలో మౌలిక వసతుల అభివృద్ధి మహిళా సాధికారత విద్య పారిశుద్ధ్యం తాగునీటి అభివృద్ధి వంటి అనేక కార్యక్రమాలకు ఐటీసీ అందిస్తున్న విశేష సహకారాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో చెంగల్ రావు డీజీఎం-హెచ్ఆర్, ఐటీసీ పీఎస్‌పీడీ భద్రాచలం యూనిట్ జయప్రకాశ్ రామసామి, సీనియర్ ప్రోగ్రామ్ మేనేజర్ ఐటీసీ మిషన్ సునెహ్రా కల్, గీత ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్, ఐటీసీ, తారాప్రసాద్, జి.ఆర్.బాలకృష్ణ ప్రోగ్రామ్ ఆఫీసర్, వాష్ ఇన్‌స్టిట్యూట్‌తో పాటు ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, గ్రామ పెద్దలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, వాష్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

## రేపే లాస్ట్ ఛాన్స్

**జులై 31 దాటితే రేషన్ కార్డు రద్దు**

**వలిగొండ జులై 28 మహా న్యూస్ :** తెలంగాణలో రేషన్ కార్డుల ఈకేవైసీ పూర్తి చేయడానికి జులై 31 వరకు పౌర సరఫరాల శాఖ గడువు విధించింది. రేషన్ కార్డులు ఉండి వేరే ప్రాంతాలకు వలస వెళ్లిన వారు, మరణించిన వారి పేర్లను తొలగించకపోవడం వల్ల రేషన్ ధాన్యం పక్కదారి పడుతోంది. ఈకేవైసీ ద్వారా ప్రతి సభ్యుడి వివరాలను ప్రామాణీకరించడం వల్ల అసలైన లబ్ధిదారులను గుర్తించడం సాధ్యమవుతుంది. రేషన్ పంపిణీ వ్యవస్థలో పారదర్శకతను పెంచడం, నకిలీ, చెల్లుబాటు కాని కార్డులను పూర్తిగా ఏరివేయడమే పౌరసరఫరాల శాఖ ప్రధాన ఉద్దేశం. అయితే ఈ గడువు రేపటితో ముగియనుంది. గ్రామాలలోని లబ్ధిదారులు రేషన్ కార్డుతో పాటు, అందులో నమోదైన సభ్యులందరి ఒరిజినల్ ఆధార్ కార్డులను వెంట తీసుకుని, తమ సమీపంలో ఉన్న రేషన్ దుకాణానికి లేదా మీసేవ కేంద్రానికి వెళ్లి బయోమెట్రిక్ లేదా ఐరిస్ (కంటిపాప) వెరిఫికేషన్ ద్వారా ఈ ప్రక్రియను ఉచితంగా పూర్తి చేసుకోవచ్చు. ఇందు కోసం రేషన్ డీలర్లకు లేదా ఇతరులకు ఎలాంటి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని పౌర సరఫరాల శాఖ స్పష్టం చేసింది. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా ఈకేవైసీ పూర్తి చేయని సభ్యుల పేర్లను రేషన్ కార్డుల నుంచి అధికారులు తొలగించే అవకాశాలు ఉన్నాయి. తద్వారా ఉచిత బియ్యం కోటా నిలిచిపోవడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకపోవచ్చు.



## కొత్తగూడెం మార్కెట్‌లో అధిక వసూళ్లపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి

- బీజేపీ టౌన్ అధ్యక్షులు శీలం విద్యాసాగర్

**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: కొత్తగూడెం పట్టణంలోని రోజువారీ మార్కెట్, రైతు బజార్ ప్రతి ఆదివారం నిర్వహించే సంతలో కాంట్రాక్టర్లు మున్సిపల్ కార్పొరేషన్ నిర్ణయించిన రుసుములకు విరుద్ధంగా అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారని బీజేపీ కొత్తగూడెం టౌన్ అధ్యక్షులు శీలం విద్యాసాగర్ ఆరోపించారు. ఈ మేరకు బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కి, మేయర్ కి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మార్కెట్ నిర్వహణను కాంట్రాక్టర్లకు అప్పగించామని చెప్పి మున్సిపల్ అధికారులు తమ బాధ్యత నుండి తప్పించుకోవడం సరైన విధానం కాదన్నారు. టెండర్ ద్వారా కార్పొరేషన్‌కు ఆదాయం వస్తున్నందున కాంట్రాక్టర్ల వసూళ్లపై నిరంతర పర్యవేక్షణ నిర్వహించి ప్రజలకు న్యాయం చేయాల్సిన బాధ్యత మున్సిపల్ యంత్రాంగంపై ఉందని పేర్కొన్నారు.పండ్ల వ్యాపారుల నుండి 20 రూపాయలు, ఇతర చిన్న వ్యాపారుల నుండి 30 మాత్రమే వసూలు చేయాల్సి ఉండగా 50 నుండి 60 వరకు వసూలు చేస్తున్నట్లు పలువురు వ్యాపారులు ఫిర్యాదు చేస్తున్నారని తెలిపారు. అలాగే ప్రతి ఆదివారం నిర్వహించే సంతలో ఒక్కో దుకాణం నుండి 100 వరకు బలవంతంగా వసూలు చేస్తున్నారని దీంతో రైతులు చిన్న వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఇప్పటికే దుకాణాల అద్దెలు, రవాణా ఖర్చులు, ఇతర నిర్వహణ వ్యయాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న చిన్న వ్యాపారులు రైతులపై ఈ అక్రమ వసూళ్లు మరింత ఆర్థిక భారాన్ని మోపుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.అందువల్ల ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి అధిక రుసుములు వసూలు చేస్తున్న కాంట్రాక్టర్లపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే మున్సిపల్ కార్పొరేషన్ నిర్ణయించిన అధికారిక రుసుముల పట్టికను రోజువారీ మార్కెట్, రైతు బజార్, ఆదివారం సంతతో పాటు అన్ని మార్కెట్ ప్రాంగణాల్లో ప్రజలకు స్పష్టంగా కనిపించే విధంగా బహిరంగంగా ప్రదర్శించాలని కోరారు. చిన్న వ్యాపారులు రైతుల హక్కులను కాపాడేందుకు అవసరమైతే బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని కూడా చేపడతామని శీలం విద్యాసాగర్ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రమేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి చంద్రగిరి రమేష్, కలంకార్ రాజశేఖర్, పట్టణ మహిళా అధ్యక్షురాలు బంధువుల యామిని పూర్ణా, చంటి రాజ, భాస్కర్ గౌడ్, శ్రీకాంత్ యాదవ్ పట్టణ నాయకులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల గుర్తింపునకు ప్రత్యేక వెబ్‌సైట్ ప్రారంభించాలి

**వలిగొండ, జూలై 29 మహా న్యూస్:** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడి త్యాగాలు చేసిన ఉద్యమకారులను గుర్తించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు సంగిశెట్టి క్రిస్టఫర్ డిమాండ్ చేశారు.ఉద్యమకారుల గుర్తింపు కోసం ప్రభుత్వం నియమించిన కమిటీతో పాటు ఒక ఐఏఎస్ అధికారిని ప్రత్యేకంగా నియమించాలని ఆయన కోరారు. అలాగే ఉద్యమకారులు తమ వివరాలను నమోదు చేసుకునే విధంగా ప్రత్యేక ఆన్‌లైన్ వెబ్‌సైట్‌ను వెంటనే ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు.రాష్ట్ర సాధన కోసం సేవలందించిన ఉద్యమకారులకు తగిన గుర్తింపు కల్పించడం ద్వారా ప్రభుత్వం మరో చరిత్ర సృష్టించినట్లవుతుందని పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో జాప్యం చేయకుండా త్వరితగతిన వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు.



## కేంద్ర ప్రభుత్వం విద్యార్థులపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి..

- ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం..

భువనగిరి జూలై 29 మహా ఢిల్లీ విద్యార్థులపై లాఠీ చార్జ్ ప్రజాస్వామ్యంపై దాడి అని ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులపై కక్ష సాధింపు చర్యలను మానుకోవాలని ఇలాంటి కక్ష సాధింపు చర్యలతో పరిపాలన చేయలేరని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. బుధవారం రాఘవేంద్ర కన్వెన్షన్ హాల్లో సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండీ ఇమ్రాన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ దేశ విద్యా వ్యవస్థలో పారదర్శకతను కాపాడాల్సిన కేంద్ర ప్రభుత్వం అందులో విఫలమైందని ఆరోపించారు. నీట్ పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్న అవకతవకలు, ప్రశ్నపత్రాల లీకేజీలు లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళనకు కారణమయ్యాయని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పరీక్షల నిర్వహణలో పూర్తి పారదర్శకత, జవాబుదారీతనం ఉండే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇటీవల ఢిల్లీలో తమ సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా ఆందోళన చేపట్టిన విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని సిగ్గుచేటు అన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును అణచివేయడం సరైన పద్ధతి కాదని, విద్యార్థుల సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. అయోధ్య రామ మందిరంలో భక్తులు సమర్పించిన విరాళాల నిర్వహణలో చోటు చేసుకున్న చోరీ ఆరోపణలపై బిజెపి నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి సంబంధించిన ఈ అంశంపై పూర్తి పారదర్శకతతో విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేవాలయాల పేరుతో రాజకీయాలు చేసే వారు ఇలాంటి ఘటనలపై ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, ధరల పెరుగుదల, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, కార్మికులు, రైతులు, విద్యార్థుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 8, 9, 10 తేదీలలో యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో జరగనున్న అఖిల భారత యువజన సమాఖ్య తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శులు బోలగాని సత్యనారాయణ, చేడే చంద్రయ్య, రాష్ట్ర సమితి సభ్యులు గోద శ్రీరాములు, కురిమిద్ద శ్రీనివాస్ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, బచ్చనగోని గాలయ్య, చెక్క వెంకటేష్, పల్లె శేఖర్ రెడ్డి, చిగుళ్ల లింగం, కుసుమని హరిచంద్ర, యేశాల అశోక్, పెరబోయిన మహేందర్, జిల్లా సమితి సభ్యులు గాదెగాని మాణిక్యం, కళ్లేపల్లి మహేందర్, అన్నెపు వెంకట్, అన్నేమైన వెంకటేష్, దుబ్బాక భాస్కర్, మరుపాక వెంకటేష్, చౌడబోయిన కనకయ్య, దాసరి లక్ష్మయ్య, ఎల్లంకి మహేష్, బబ్బురి శ్రీధర్, కలకొండ సంజీవ, చిలివేరు అంజయ్య, ఆలేటి బాలరాజు, జెల్ది రాములు, ఇంజ హేమలత, వడ్లకొండ భారతమ్మ, అరే పుష్ప తదితరులు పాల్గొన్నారు.



## జలసిరి కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములు చేయాలి

**యాదాద్రి భువనగిరి జూలై 29 మహా** : జలసిరి కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు తెలిపారు.

బుధవారం గుండాల మండల ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మాట్లడుతూ ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా చేపడుతున్న జలసిరి కార్యక్రమంపై అధికారులు, ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఎల్ నినో ప్రభావం కారణంగా రాబోయే రోజుల్లో నీటి కొరత ఏర్పడే అవకాశాలు ఉన్నందున ముందస్తు చర్యలుచేపట్టడం అత్యంత అవసరమన్నారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి రైతుకు పంట కుంట,ప్రతి ఊరికి ఊటకుంట, అనే లక్ష్యంతో అధికారులు,ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలనిసూచించారు.మండలంలోని ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి వ్యవసాయ పొలంలో పంట కుంటల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే భూగర్భ జలాల మట్టాన్ని పెంచేందుకు బోర్‌వెల్ రీచార్జ్ పిట్స్, గ్రామాల్లో సోక్ పిట్స్ నిర్మాణాన్ని ప్రత్యేక కార్యక్రమంగా చేపట్టాలని అధికారులకు సూచించారు.మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు జలసిరి కార్యక్రమంలో చురుకుగా భాగస్వాములు కావాలని, గ్రామాల్లో ప్రజలకు నీటి సంరక్షణపై విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు. నీటి వనరుల పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, ప్రజల భాగస్వామ్యంతోనే శాశ్వత ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు.అదనంగా గ్రామాల్లో ఘన వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని, పర్యావరణ పరిరక్షణలో భాగంగా సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించేలా అధికారులు, సర్పంచులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.ఈ సమావేశంలో మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.




## మాట తప్పిన అధికారులు

**సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు అనురాధ**

**భువనగిరి జులై 29 మహా యాదాద్రి:** భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలో సర్వే నెంబర్ 700 లులో పట్టాలిచ్చి ఏళ్లు గడుస్తున్నా ప్లాట్లు చూపించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనురాధ అన్నారు బుధవారం సి పి యం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య భవనం లో భూ పోరాట కమిటీ సమావేశం జరిగింది గంధ మల్ల మాతయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బట్టుపల్లి అనురాధ మాట్లాడుతూ గత సంవత్సరము 700 సర్వే నెంబర్ లో పట్టాలు ఇచ్చిన వారందరూ ఆ స్థలంలో గుడిసెలు వేసుకున్నారు. అధికారులు నెల రోజులలో స్థలాలు చూపిస్తామని హామీ ఇవ్వడంతో అక్కడ గుడిసెలు వేసుకున్న వారంతా తీసివేయడం జరిగింది సంవత్సరం అయినా ఎలాంటి భూమిని చదును చేయకపోవడం అధికారులు మాట తప్పారని అన్నారు. వారం రోజులలో భూమిని చదును చేసి ప్లాట్లు చూపించడంలో నిర్లక్ష్యం వహిస్తే గుడిసెవాసుల పోరాట కమిటీ ఆధ్వర్యంలో మరల గుడిసెలు వేస్తామని అన్నారు. భువనగిరి పట్టణంలోని అనేకమంది నిరుపేదలు ఇల్లు లేక కిరాయి ఇండ్లలో ఉండి కుటుంబంలో ఎవరైనా మరణించినచో ఇంటిముందు శవాన్ని వెయ్యకుండా స్మశాన వాటికి నేరుగా తీసుకపోవడం జరుగుతుంది చాలా బాధ కలిగిస్తుంది. ఈ పోరాటాన్ని ప్లాట్లు ఇచ్చేంతవరకు దశలవారీగా ఉద్యమిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐఎం పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ, పట్టణ కార్యదర్శి కార్యవర్గ సభ్యులు బందెల ఎల్లయ్య, వనం రాజు కమిటీ సభ్యుడు, వలదాస్ అంజయ్య, చింతల శివ, కొత్త లక్ష్మయ్య, లలిత, భూ పోరాట కన్వీనర్ దొడ్డి శంకర్ కో కన్వీనర్ నార కలమ్మ, పిట్టల చంద్రశేఖర్, కన్యబోయిన అరుణ, స్రవంతి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలకు బ్లూటూత్ సౌండ్ బాక్స్ అందజేత

వలిగొండ, జూలై 29 (మహా న్యూస్): గురుపౌర్ణమి సందర్భంగా వలిగొండ ప్రభుత్వ పాఠశాలకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏలే చంద్రశేఖర్ బ్లూటూత్ సౌండ్ బాక్స్‌ను బుధవారం అందజేశారు.ఈ సందర్భంగా విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక సాంకేతిక సౌకర్యాలు కూడా అందుబాటులో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. పాఠశాల అవసరాలకు ఉపయోగపడేలా ఈ సౌండ్ బాక్స్‌ను అందజేస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్, సీనియర్ నాయకులు బంధారపు లింగస్వామి, రాచకొండ కృష్ణ, రామనర్సు, బచ్చ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## గ్రామపంచాయతీ నూతన కార్యాలయ ప్రారంభోత్సవం

- పాల్గొన్న భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**భువనగిరి జూలై 29 మహా :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో వలిగొండ మండలం వెంకటాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయ భవనాన్ని బుధవారం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల సమగ్ర అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయాలు గ్రామ పాలనకు కేంద్ర బిందువులుగా పనిచేస్తాయని, ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలను మరింత సులభంగా, వేగంగా, పారదర్శకంగా అందించడంలో నూతన కార్యాలయ భవనం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను ప్రభుత్వం చేపడుతోందని పేర్కొన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయం ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువవుతాయని, గ్రామాభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాల అమలు కూడా మరింత సమర్థవంతంగా జరుగుతుందని ఎమ్మెల్యే అన్నారు .ఈ కార్యక్రమంలో వెంకటాపూర్ గ్రామ సర్పంచ్ కర్నెకంటి కమలమ్మయాదయ్య, మండల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ సీనియర్ పార్టీ నాయకులు,వార్డు సభ్యులు,అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వలిగొండ పిఏసిఎస్ నూతన చైర్మన్ గా గరిసే రవి

వలిగొండ జులై 29 మహా న్యూస్ వలిగొండ పిఏసిఎస్ నూతన చైర్మన్గా గరిసె రవిని నియమించి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా సహకార సంఘం అభివృద్ధి ధ్యేయంగా పనిచేయాలని తెలిపారు ఈ సందర్భంగా నూతన పిఏసిఎస్ చైర్మన్ గరిసె రవి మాట్లాడుతూ నాపై నమ్మకంతో స్థానిక ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డి పిఏసిఎస్ చైర్మన్గా ఎంపిక చేయడంతో వారికి కృతజ్ఞత తెలుపుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా రైతు సంక్షేమ ధ్యేయంగా పనిచేస్తానని అన్నారు





# విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం

**ఆదిలాబాద్ మహా** : విద్యార్థులు విద్య, క్రీడలు, ఇతర రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచాలంటే వారి ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు.బుధవారం పట్టణంలోని భుక్తాపూర్ పీఎం శ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో నిర్వహించిన కంటి వైద్య శిబిరం, ఆరోగ్య పాఠశాల, వన మహోత్సవ కార్యక్రమాలకు మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూషతో కలిసి హాజరయ్యారు.ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన వేస్ట్ టు వండర్ గార్డెన్‌ను పరిశీలించిన కలెక్టర్, వ్యర్థ వస్తువులతో వినూత్నంగా తీర్చిదిద్దిన సిబ్బందిని అభినందించారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటి నీరు పోశారు.ఎల్.వి. ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు, హెల్త్ స్క్రీనింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. కంటి సమస్యలు ఉన్న విద్యార్థులకు అవసరమైన కళ్లద్దాలు, వైద్య చికిత్సలు, అవసరమైతే శస్త్రచికిత్సలు కూడా ఉచితంగా అందజేస్తామని చెప్పారు.విద్యార్థుల విద్యాభివృద్ధికి నిరంతర హాజరు ఎంతో అవసరమని పేర్కొన్న కలెక్టర్, ఈ విద్యా సంవత్సరంలో ప్రతి విద్యార్థి కనీసం 200 రోజుల పాటు పాఠశాలకు హాజరయ్యేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పాఠశాల దేవాలయంతో సమానమని, గురువులను గౌరవించడం ప్రతి విద్యార్థి బాధ్యత అని మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం ఆధునిక సౌకర్యాలు కల్పిస్తోందని, విద్యార్థులు, తల్లిదండ్రులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వర్షాకాలంలో పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. సాధన, వార్డు కౌన్సిలర్ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయురాలు నీలదేవి, ఎల్.వి. ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ కోఆర్డినేటర్లు వెంకటరమణ, రంజిత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# గ్రామ సభలో మౌనం వహించిన సర్పంచ్..

**అన్నీ తానై నడిపించిన పంచాయతీ కార్యదర్శి..**

**రాజేంద్రనగర్ మహా;** వర్షాన్ని (జలసిరిని )ఒడిసి పట్టి, భూగర్భ జలాలను పెంపొందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం జలసిరీ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. క్యాచ్ ది రెయిన్ లో భాగంగా శంషాద్ మండలం మదనపల్లి కొత్త తండాలో గ్రామసభను బుధవారం నిర్వహించారు. జలసిరీ క్యాచ్ ది రెయిన్ కార్యక్రమాన్ని పంచాయతీ తీర్మానానికి పరిమితంచేశారు. గ్రామసభలో గ్రామ సమస్యలపై గల మెత్తిన గ్రామస్తులు సమస్యలపై సమాధానం చెప్పకుండా సర్పంచ్ బుజ్జి నాయక్ మౌనం వహించారు. ఇంకుడు గుంతలు విషయాన్ని వదిలేసి ఆరోపణలు, ప్రత్యారోపణలకు పరిమితమయ్యారు. సర్పంచ్ గ్రామ అభివృద్ధికి ఏఏ కార్యక్రమాలు చేశారో చెప్పాలని గ్రామస్తులు సర్పంచ్ ను ప్రశ్నించారు. సర్పంచ్ సమాధానం చెప్పలేక తల కిందకు వేసుకొని కూర్చోవడంతో, పంచాయితీ కార్యదర్శి హనుమంతు నాయక్ అన్నీ తానై గ్రామ సభను నడిపించారు. దాతలు వాటర్ ఫిల్టర్ ఏర్పాటుకు నిధులు అందజేసిన వాటర్ ఫిల్టర్‌ను గ్రామ ప్రజలకు సౌకర్యార్థం పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేయకుండా, తన ఇంటి వద్ద ఏర్పాటు చేసుకున్నారని గ్రామస్తులు మండిపడ్డారు. గృహ నిర్మాణ అనుమతికి లక్ష నుంచి 1,50,000 వరకు సర్పంచ్ భర్త గోపాల్ నాయక్ డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. ప్రతిపక్ష పార్టీ నాయకులు గ్రామస్తులను తప్పుదోవ పట్టించి లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు. ఈ ఆరోపణలు నిరాధారమైన వన్నారు. గ్రామ సభలో వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# దశల వారీగా గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా

- **బాకారం సర్పంచ్ ఎల్లని వెంకటేష్ గౌడ్**

**మొయినాబాద్ మహా**: గ్రామాన్ని దశలవారీగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తామని గ్రామం మరింత అభివృద్ధి చేస్తామని బాకారం జాగీర్ గ్రామ సర్పంచ్ ఎల్లని వెంకటేష్ గౌడ్ అన్నారు. మొయినాబాద్ మండలంలోని బాకారం జాగీర్ గ్రామ పంచాయతీ పరిధిలోని 4,5 వార్డులలో ఉపసర్పంచ్ సుభాష్ చంద్రబోస్ రెడ్డి, మరియు వార్డు సభ్యుల తో కలిసి సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ గ్రామ ప్రజల సమస్యలను ఒక్కొక్కటిగా తీర్చుకుంటూ గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. గ్రామ అభివృద్దే లక్ష్యంగా గ్రామ పంచాయతీ పాలకవర్గంతో మరియు గ్రామ ప్రజల సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తాం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుభాష్ చంద్రబోస్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి పుష్పలత, వార్డు సభ్యులు కొంతం నాగేశ్వర్ రెడ్డి, రాయనోళ్ల ఉపేందర్ యాదవ్,బంధి అనిల్, మరియు కొండకల్ల శ్రీకాంత్, కొండకల్ల మహేందర్, జగన్నాథ్, చాకలి శేఖర్,చాకలి రాజు, రమేష్,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# గగన్ పహాడ్ అప్ప చెరువును చెర బట్టింది ఎవరు ?

- **40 ఎకరాలో ఉన్న చెరువును నాలుగు ఎకరాలకు కుదించింది ఎవరు...**
- **చెరువులను రక్షించే హైడ్రా ఎక్కడ..**



రాజేంద్రనగర్ మహా; మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని గగన్ పహాడ్ అప్పచెరువు హెచ్ఎండిఏ లేక్స్ డేటాబేస్ లో లేక్ ఐడి 2900 ఎన్002 గా నమోదయింది. అప్పచెరువు విస్తరణ 40,13 ఎకరాల్లో విస్తరించింది. ప్రస్తుతం అప్ప చెరువు 4 ఎకరాల మేరకు మాత్రమే నీటి విస్తరణ కనిపిస్తుందని స్థానికులు వాపోయారు. చెరువులోకి నీరు వచ్చే, వెళ్లే మార్గాలను డిస్మెంటల్ మట్టి చెత్తతో మూస్తూ పోతున్నారు. చెరువు మరోవైపు గోడ నిర్మాణం జరుగుతుంది. ఇరిగేషన్, హైడ్రా, రెవెన్యూ అధికారులు అప్ప చెరువులోని ఎఫ్టిఎల్, బఫర్ జోన్లు సర్వేను నిర్వహించి హద్దు బందులు ఏర్పాటు చేయాలి. అప్పచెరువును రక్షించి చేరాపడుతున్న వ్యక్తులపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.





# రాష్ట్రంలో తొలి మోడల్ జిల్లాగా యాదాద్రి భువనగిరి

**యాదాద్రి భువనగిరి, మహా :** తెలంగాణలో కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక చేపట్టిన ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ కింద తెలంగాణ రాష్ట్రంలో తొలి మోడల్ జిల్లాగా యాదాద్రి భువనగిరి జిల్లా ఎంపికైన సందర్భంగా బుధవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వైద్య & ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏ బి డి ఎం మోడల్ జిల్లా ప్రారంభోత్సవ వర్క్‌షాప్ ఘనంగానిర్వహించారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఆరోగ్య & కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, మిషన్ డైరెక్టర్ మరియు రాష్ట్ర ఏబీడిఎం మిషన్ డైరెక్టర్ డా. సంగీత సత్యనారాయణ ఐఏఎస్ జిల్లా కలెక్టర్ & జిల్లా మేజిస్ట్రేట్ అనురాగ్ జయంతి, అడిషనల్ కలెక్టర్ భాస్కర్ రావు , యాదాద్రి భువనగిరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేజ్ చిష్తీ, భువనగిరి పట్టణ మున్సిపల్ చైర్‌పర్సన్ తంగెళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పోతంశెట్టి మంజుల వెంకటేశం, నేషనల్ హెల్త్ అథారిటీ ప్రతినిధులు, రాష్ట్ర బృంద సభ్యులు, వివిధ శాఖల అధికారులు, ప్రభుత్వ మరియు ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు, మెడికల్ సూపరింటెండెంట్లు, మేనేజింగ్ డైరెక్టర్లు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు, ఫార్మసీల ప్రతినిధులు, వైద్యాధికారులు మరియు ఆరోగ్య సేవల నిపుణులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు. కార్యక్రమ ప్రారంభంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర గేయం "జయ జయహే తెలంగాణ" ఆలాపనతో కార్యక్రమం అధికారికంగా ప్రారంభమైంది. అనంతరం రాష్ట్ర ఆరోగ్య & కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, మిషన్ డైరెక్టర్ ఎన్ హెచ్ ఎం మరియు రాష్ట్ర ఏ బి డి ఎం మిషన్ డైరెక్టర్ డా. సంగీత సత్యనారాయణ ఐఏఎస్ వర్క్‌షాప్‌ను ప్రారంభించగా, నేషనల్ హెల్త్ అథారిటీ డైరెక్టర్ డా. పంకజ్ కుమార్ అరోరా వర్చువల్ ద్వారా పాల్గొని ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ ప్రాముఖ్యతపై కీలక ప్రసంగం చేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఆరోగ్య & కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, మిషన్ డైరెక్టర్ మరియు రాష్ట్ర మిషన్ డైరెక్టర్ డా. సంగీత సత్యనారాయణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో యాదాద్రి భువనగిరి జిల్లాను తొలి మోడల్ జిల్లాగా ఎంపిక చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేటు ఆరోగ్య సంస్థలు 100 శాతం ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ అమలుకు కట్టుబడి పనిచేయాలని సూచించారు. ప్రతి రోగికి సంబంధించిన ఆరోగ్య సమాచారాన్ని డిజిటల్ రూపంలో నమోదు చేయడం ద్వారా దేశంలో ఎక్కడి నుంచైనా వారి వైద్య చరిత్రను సులభంగా తెలుసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. ప్రతి పౌరునికి ఆధార్ కార్డు ఎంత ముఖ్యమో, అదే విధంగా ఏబి హెచ్ ఎ ఐడి కూడా అంతే ముఖ్యమని తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆరోగ్య సంస్థలు సమిష్టిగా కృషి చేసి ఏ బి డి ఎం ను విజయవంతంగా అమలు చేసి తెలంగాణ రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు.జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లా ( హెచ్ ఎఫ్ ఆర్ ) మరియు ( హెచ్ పి ఆర్ ) నమోదులను విజయవంతంగా పూర్తి చేసి రాష్ట్రంలో ఆదర్శంగా నిలిచిందని తెలిపారు.

# కిడ్నాప్‌పైన చిన్నారి క్షేమం

- **తల్లిదండ్రులకు అప్పగించిన ఎస్పీ**
- **ఆరు గంటల్లోనే ఛేదించిన జిల్లా పోలీసులు**
- **పోలీసులకు ధన్యవాదాలు తెలిపిన పేరెంట్స్**
- **సిబ్బందిని అభినందించిన ఎస్పీ**



**ఆదిలాబాద్ మహా :** కిడ్నాపైన ఓ చిన్నారిని కేవలం ఆరు గంటల్లోనే గుర్తించి సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు ఆదిలాబాద్ జిల్లా పోలీసులు. జిల్లాలోని తలమడుగు మండలం రుయ్యాడి గ్రామానికి చెందిన నాలుగు సంవత్సరాల చిన్నారి ఆత్రం గంగామణి ని అదే గ్రామానికి చెందిన నిందితురాలు నైతం నాగుబాయి కుటుంబ సభ్యులకు తెలియకుండా తీసుకువచ్చి ఆదిలాబాద్ బస్టాండ్ లో తనకు తెలిసిన భారతి అనే మరో నిందితురాలికి అప్పగించింది. బాధితురాలి తల్లి ఆత్రం కప్లిబాయి తలమడుగు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో నిందితురాలిపై కిడ్నాప్ కేసు నమోదు చేసి వెంటనే దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఆదిలాబాద్, తాంసి తదితర ప్రాంతాల్లో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. బస్టాండ్లు, ప్రధాన కూడళ్లు, రహదారుల సీసీటీవీ ఫుటేజీలను సేకరించి సాంకేతిక ఆధారాలతో అన్వేషణ కొనసాగించారు. దీంతో పట్టణంలోని మహాలక్ష్మి వాడలో చిన్నారి ఉన్నట్లు గుర్తించి రక్షించారు. బుధవారం స్థానిక పోలీస్ ముఖ్య కార్యాలయంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ చిన్నారిని ఆమె తల్లిదండ్రులకు అప్పగించారు. కిడ్నాప్ అయిన తమ కూతురు తిరిగి క్షేమంగా తమ వద్దకు చేరడంతో తల్లిదండ్రులు భావోద్వేగానికి గురయ్యారు. జిల్లా ఎస్పీతో పాటు గాలింపు చర్యల్లో పాల్గొన్న పోలీసు అధికారులకు, సిబ్బందికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. చిన్నారుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని ఎస్పీ తెలిపారు. పిల్లలు కనిపించకపోయినా లేదా అనుమానాస్పద పరిస్థితులు గమనించినా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ హండ్రెడ్ కు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. కిడ్నాప్ చేసిన నిందితురాలితో పాటు చట్ట వ్యతిరేకంగా తన వద్ద బాలికను ఉంచుకున్న మహిళను అరెస్టు చేసినట్లు తెలిపారు. బాలికను రక్షించడంలో కీలక పాత్ర పోషించిన రూరల్ సీఐ రహీం పాషా ఎస్ఐలు రాధిక, విష్ణువర్ధన్, సిబ్బంది లాలు, మనోజ్, శ్రీనివాస్, సాగర్, సంతోష్, మౌనిక, గంగారం, నరేష్, శివకృష్ణ, ప్రతాప్, లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, తలమడుగు ఎస్ఐ రాధిక, బాలిక తల్లిదండ్రులు, గ్రామ సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## క్యాతనపల్లి మున్సిపాలిటీలో కాంగ్రెస్–బీఆర్ఎస్ ఆరోపణల యుద్ధం..

**క్యాతనపల్లి, మహా:** క్యాతనపల్లి మున్సిపాలిటీలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకుల మధ్య కొనసాగుతున్న పరస్పర ఆరోపణలు, ప్రత్యారోపణలతో మున్సిపాలిటీ అభివృద్ధి పనులు ప్రభావితమవుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలి రోజుల్లో కమిషనర్ వ్యవహారం, మున్సిపల్ పాలనపై ఇరు పార్టీల మధ్య నెలకొన్న వివాదం రాజకీయ వేడిని పెంచింది. ఒకవైపు కాంగ్రెస్ నాయకులు గత పాలకుల నిర్లక్ష్యం వల్ల సమస్యలు ఏర్పడ్డాయని ఆరోపిస్తుండగా, మరోవైపు బీఆర్ఎస్ నాయకులు ప్రస్తుత పాలనలో ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. ఈ రాజకీయ విమర్శల మధ్య అభివృద్ధి పనులు, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, డ్రైనేజీ, రహదారుల మరమ్మతులు వంటి కీలక పనులు నెమ్మదిస్తున్నాయని ప్రజలు చెబుతున్నారు. రాజకీయ విభేదాలను పక్కనపెట్టి ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. అభివృద్ధి అంశాలపై అన్ని వర్గాలు సమన్వయంతో ముందుకు సాగితేనే మున్సిపాలిటీ అభివృద్ధి వేగవంతం అవుతుందని అభిప్రాయపడుతున్నారు. ప్రజా ప్రయోజనాలే ప్రధానంగా భావించి రాజకీయాలకు అతీతంగా మున్సిపల్ పాలన సాగించాలని పలువురు సామాజిక వర్గాల ప్రతినిధులు సూచిస్తున్నారు. ప్రస్తుతం నెలకొన్న వివాదాలకు త్వరితగతిన పరిష్కారం లభించి, అభివృద్ధి పనులు మళ్లీ గాడిన పడాలని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



# అర్హులైన ప్రతి ఓటరు పేరు... ఓటరు జాబితాలో నమోదయ్యేలా చూడండి

- **ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించండి.**
- **డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్**

**కుషాయిగూడ, మహా :** అర్హులైన ప్రతి ఓటర్ పేరు జాబితాలో నమోదయ్యేలా చూడాలని, ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మేడ్చల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ కోరారు. కీసర సర్కిల్ పరిధిలోని చంద్రపురి కాలనీ డివిజన్ లో కొనసాగుతున్న సర్ కార్యక్రమాన్ని బుధవారం వజ్రేష్ యాదవ్ మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జి గజ్జల కాంతంతో కలిసి పరిశీలించారు. అనంతరం కాప్రా తాసిల్దార్ మతిన్ తదితర రెవెన్యూ బృందంతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వజ్రేష్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటర్ జాబితాలో నమోదు అయ్యేలా చూడాలని ఎవరి ఓటర్ పేరు అన్యాయంగా తొలగించబడకుండా ఇంటింటికి వెళ్లి పూర్తిస్థాయిలో పరిశీలన చేపట్టాలని సూచించారు. భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ఐఆర్ కార్యక్రమం విజయవంతంగా తెలంగాణలో నిర్వహిస్తున్నందుకు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా జవహర్ నగర్ లో ఎస్ఐఆర్ కార్యక్రమం శరవేగంగా జరుగుతున్నందుకు పార్టీ శ్రేణులను అభినందించారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని బాధ్యతాయుతంగా పారదర్శకంగా నిర్వహించి విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో చంద్రపురి కాలనీ డివిజన్ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, జవహర్ నగర్ డివిజన్ అధ్యక్షురాలు శాంతి కోటేష్ గౌడ్, మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్, ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, గజ్వేల్ శంకర్ కాలేసు స్థానిక కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, బిఎల్వోలు, బిఎల్ఎలు, తాసిల్దార్ మథిన్, ఆర్ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

# కమిషనర్‌పై దాడి ధోరణి ఖండనీయం..

**పట్టణ కాంగ్రెస్ నాయకులు వొడ్నాల**

**క్యాతనపల్లి మహా :** ప్రభుత్వ అధికారిపై రౌడీయిజం ప్రదర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రామకృష్ణాపూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వోడ్నాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణను లక్ష్యంగా చేసుకుని బీఆర్ఎస్ నాయకులు వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ బుధవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం వార్డుల్లో పర్యటిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న కమిషనర్‌పై అసత్య ప్రచారాలు చేయడం సరికాదని అన్నారు. అభివృద్ధికి ఆటంకం కలిగించే విధంగా వ్యవహరిస్తున్న బీఆర్ఎస్ నాయకుల తీరును వెంటనే మార్చుకోవాలని, లేకుంటే ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.





# హైడ్రా కమిషనర్‌ను బర్తరఫ్ చేయాలి

**హైకోర్టు వ్యాఖ్యలతో ప్రభుత్వ వైఖరి బట్టబయలైంది : ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**కుషాయిగూడ, మహా :** హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. హైడ్రా వ్యవహారంపై తెలంగాణ హైకోర్టు చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా తీరుపై ప్రశ్నలు లేవనెత్తాయని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.హైడ్రా పేరుతో పేదలు, మధ్యతరగతి ప్రజల ఇళ్ల కూల్చివేతల సందర్భంగా చట్టపరమైన నిబంధనలు, న్యాయస్థానాల ఆదేశాలను పట్టించుకోకుండా వ్యవహరించారని ఆయన ఆరోపించారు. ప్రజల ఇళ్లను కూల్చివేసే విషయంలో కఠినంగా వ్యవహరించిన అధికారులు, కోర్టు ముందు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. హైడ్రా చర్యలు రాజకీయ కక్షసాధింపునకు ఉపయోగపడుతున్నాయని బీఆర్ఎస్ మొదటి నుంచే చెబుతోందని, హైకోర్టు చేసిన వ్యాఖ్యలు కూడా అదే అంశాలను ప్రతిబింబిస్తున్నాయని పేర్కొన్నారు. కోర్టు ధిక్కరణకు సంబంధించిన పలు కేసులు నమోదయ్యాయని చెప్పారు. నైతిక బాధ్యత వహిస్తూ హైడ్రా కమిషనర్ పదవి నుంచి తప్పుకోవాలని, లేకుంటే రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే హైడ్రా పేరిట జరిగిన కూల్చివేతలు, అధికార దుర్వినియోగ ఆరోపణలపై హైకోర్టు పర్యవేక్షణలో లేదా స్వతంత్ర న్యాయ విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.



# ఓటరు నమోదు కేంద్రంలో అవస్థలు

**అధికారుల తీరుపై స్థానికుల ఆగ్రహం**

**కుషాయిగూడ, మహా :** జవహర్‌నగర్ ఓటరు నమోదు (ఎస్ఐఆర్) ప్రక్రియలో అధికారుల నిర్లక్ష్యం ఓ దివ్యాంగుడికి తీవ్ర ఇబ్బందులు కలిగించింది. వికలాంగుల కాలనీకి చెందిన ఓ దివ్యాంగుడు ఓటు నమోదు కోసం స్వయంగా కార్యాలయానికి రావాల్సి వచ్చినా, అక్కడి సిబ్బంది నుంచి తగిన సహకారం అందలేదని స్థానికులు ఆరోపించారు. ఇంటింటికి వెళ్లి దరఖాస్తులు స్వీకరించి అవగాహన కల్పించాల్సిన బీఎల్‌వోలు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించకపోవడంతో దివ్యాంగుడు ఇబ్బందులు పడుతూ కార్యాలయానికి చేరుకున్నట్లు తెలిపారు. అక్కడ కూడా అధికారులు స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు. ఈ ఘటనపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దివ్యాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉందని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.



## ఘనంగా "గురు పౌర్ణమి" వేడుకలు

- పాత పాల్వంచ సాయినగర్ దేవాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు
- అన్నప్రసాద కార్యక్రమం.. తరలివచ్చిన భక్తులు
- సాయి సన్నిధిలో ప్రత్యేక పూజలు
- పాల్గొన్న భక్తజనం.. ఆలయాల్లో సందడే సందడి

**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా బుధవారం గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. గురు పౌర్ణమి సందర్భంగా శ్రీ షిరిడి సాయిబాబా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అంతేకాకుండా షిర్డీ సాయి ఆలయాలు అఖండ సాయినామస్మరణతో మారుమోగాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. కొత్తగూడెం పాల్వంచ కార్పొరేషన్ పరిధిలోని పాల్వంచ డివిజన్ పాత పాల్వంచ సాయి నగర్ ప్రాంతంలో ఉన్న శ్రీ శిరిడి సాయిబాబా భజన మందిరం, శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలో గురు పూజ మహోత్సవం భక్తుల సందడి మధ్య జరిగింది. ఆలయంలో 11 రకాల విశేష ద్రవ్యాలతో స్వామివారికి ఘనంగా అభిషేకాన్ని నిర్వహించారు. అదేవిధంగా 11 రకాల పండ్లు 11 రకాల విశేష స్వీట్లు ఐదు రకాల మహా నైవేద్యాల సమర్పణ కార్యక్రమం కొనసాగింది. పాలాభిషేకం తో పాటు 11 రకాల సుగంధ భరిత పుష్పాలతో స్వామివారికి నేత్రపరంగా అలంకరణ కార్యక్రమం జరిగింది. గురు పౌర్ణమి సందర్భంగా దేవాలయ ప్రధాన అర్చకులకు, ఆలయ ధర్మకర్తలకు, ఉపాధ్యాయులకు, మీడియా మిత్రులకు ఘనంగా సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం బాబా మందిరం వద్ద భక్తులకు పెద్ద ఎత్తున అన్నప్రసాద కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ గురుపూజ మహోత్సవంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొత్వాల శ్రీనివాసరావు దంపతులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు వనమా రాఘవేంద్ర రావు దంపతులు, ఆలయ వ్యవస్థాపకులు ధర్మకర్త ముత్యాల కోటేశ్వరరావు, ఆలయ ప్రధాన అర్చకులు చిలుకూరి దినకర్ శాస్త్రి, అర్చకులు దాసోజు సతీష్ ఆచార్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

**కొత్తగూడెం కేంద్రంలో...**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం పరిధిలోని పలు ప్రాంతాల్లో, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్ మండల కేంద్రంలో ఉన్న సాయిబాబా ఆలయాల్లో బుధవారం గురు పౌర్ణమి వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ముర్రేడు బ్రిడ్జి పక్కన ఉన్న శ్రీ దత్త సాయి మారుతి ధ్యాన మందిరంలో గురు పౌర్ణమి సందర్భంగా సాయిబాబాకు ప్రత్యేక అభిషేకాలు పూజ కార్యక్రమాలు జరిగాయి. గురు పౌర్ణమి వేడుకలతో ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. పూజా కార్యక్రమం అనంతరం అన్నప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

## భక్తిశ్రద్ధల మధ్య గురుపౌర్ణమి వేడుకలు..

**ప్రత్యేక పూజలు, హారతులు..**
**భారీగా తరలివచ్చిన భక్తులు..**
**తీర్థప్రసాదాల స్వీకరణ..**



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం అశోక్‌నగర్‌లోని శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో, బండారుగూడెం శ్రీ రామాలయం ఆవరణలోనే సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు బుధవారం భక్తిశ్రద్ధల మధ్య భక్తులు ఘనంగా నిర్వహించారు. గురువును పరబ్రహ్మ స్వరూపంగా భావించి ఆరాధించే పవిత్రమైన గురుపౌర్ణమి సందర్భంగా ఆలయాలలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, హారతి కార్యక్రమాలు నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని సాయిబాబా ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణాలు భక్తులతో కిక్కిరిసిపోయింది. సాయిబాబా నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొని కుటుంబ సభ్యుల ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సుఖశాంతి కోసం ప్రార్థనలు చేశారు. అనంతరం ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు, అన్న ప్రసాదాలు పంపిణీ చేయగా, భక్తులు భక్తిశ్రద్ధలతో స్వీకరించారు. వేడుకల సందర్భంగా సమితి సింగారం గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ గాండ్ల సురేష్ ప్రత్యేక పూజలు, హారతి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, సేవకులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త ఎస్ కే టి గ్రూప్స్ డైరెక్టర్ దోసపాటి పిచ్చేశ్వరరావు, శ్రీ వెంకటేశ్వర స్వామి సమేత ఉమా రామలింగేశ్వర స్వామి దేవస్థానం వ్యవస్థాపకులు దోసపాటి నాగేశ్వరావు, సాయిబాబా మందిర సేవకులు జెట్టి సాయి, నాగేశ్వరరావు, వెంకన్నతో పాటు శ్రీరామాలయం సాయిబాబా ఆలయంలో జరిగిన వేడుకల్లో బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులు, ఆ ప్రాంత ప్రముఖులు, ఆయా ఆలయ కమిటీల సభ్యులు, సేవకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా నిర్వహించిన ఈ వేడుకలు భక్తిమయ వాతావరణంలో సాగి, ఆలయానికి విచ్చేసిన భక్తులందరికీ ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించాయి. గురుభక్తి, సేవాభావం, సనాతన ధర్మ విలువలను చాటిచెప్పే విధంగా కార్యక్రమాలు నిర్వహించబడటంతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.

## హెచ్ఎంటీ నగర్‌లో బీజేపీ ఎస్ఐఆర్ మండల ప్రవాస్ అభియాన్ పర్యటన

**కుషాయిగూడ, మహా :** రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ మండల ప్రవాస్ అభియాన్ పర్యటనలో భాగంగా బుధవారం నాచారం హెచ్ఎంటీ నగర్ డివిజన్‌లో విస్తృత స్థాయిలో బూత్ స్థాయి పర్యవేక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డివిజన్ సంయోజకులు (ఇన్‌చార్జి కోఆర్డినేటర్) సంగిశెట్టి రవీంద్ర సాగర్, జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్ పాల్గొన్నారు. డివిజన్ పరిధిలోని ప్రతి బూత్‌ను సందర్శిస్తూ పార్టీ సంస్థాగత బలోపేతం, బూత్ కమిటీల పనితీరు, కార్యకర్తల సమన్వయంపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసి, ప్రతి బూత్‌లో పార్టీని ప్రజలకు చేరువ చేసేలా కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని నాయకులు సూచించారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు నవీన్, శక్తికేంద్రాల ఇన్‌చార్జిలు అనిత పద్మారెడ్డి, బొల్లం చంద్రమౌళి, జి. రాజిరెడ్డి, గంధమల్ల గోపి, మంజుల వాణి, కాటెపల్లి రవీందర్ రెడ్డి, ఉదయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ పురోగతిపై కాంగ్రెస్ బూత్ లెవల్ ఏజెంట్ల సమీక్ష

- - డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలి
- - పామేన భీమ్ భరత్



**మొయినాబాద్ మహా**: మొయినాబాద్ మండల మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్ల (BLA2) సమీక్ష సమావేశం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ పామేన భీమ్ భరత్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్తో కలిసి ఓటర్ల సమగ్ర ప్రత్యేక సవరణ పురోగతిని సమీక్షించామని, అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యమన్నారు. పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ ఫారాలు పూర్తిగా డిజిటలైజేషన్ అయ్యేలా బీఎల్ఏలు, బీఎల్ఓలు, పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఒక వ్యక్తికి ఒకే చోట మాత్రమే ఓటు హక్కు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని, నివాసం ఉన్న పట్టణం లేదా స్వగ్రామంలో ఎక్కడ ఓటు ఉండాలో అక్కడే నమోదు చేయాలని భీమ్ భరత్ పేర్కొన్నారు. మరణించిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించేందుకు అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరి సతీష్, మొయినాబాద్ మండల అధ్యక్షుడు సత్యనారాయణ, మున్సిపల్ అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు మానయ్య, మొయినాబాద్ మున్సిపల్ చైర్మన్ సోనియా దర్శన్, స్థానిక కౌన్సిలర్లు, సర్పంచ్లు, మాజీ ప్రజాప్రతినిధులు, మండల, మున్సిపాలిటీ పరిధిలోని బీఎల్ఏలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ పరిధిలోని ఓటర్ల నమోదు వివరాలను అందజేశారు.

# ఆప్మెల్‌లో 'సోలార్' వెలుగులు

- సోలార్ తో ఏటా రూ.24 లక్షల విద్యుత్ ఖర్చు ఆదా
- ఈ ఏడాది రికార్డు స్థాయిలో రూ.23.33 కోట్ల నికర లాభం నమోదుపై హర్షం
- వ్యాపార విస్తరణకు చర్యలు
- సీఎండీ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి



**భద్రాద్రి కొత్తగూడెం మహా**: విజయవాడలో ఉన్న సింగరేణి అనుబంధ సంస్థ అయిన ఆప్మెల్ (ఆంధ్ర ప్రదేశ్ హెవీ మిషనరీ అండ్ ఇంజినీరింగ్ లిమిటెడ్) స్వర్ణోత్సవాల సందర్భంగా ప్లాంట్ లో ఏర్పాటు చేసిన 300 కిలోవాట్ల సోలార్ ప్లాంట్ ను సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి బుధవారం సింగరేణి భవన్ నుంచి వర్చువల్ గా ప్రారంభించారు. అలాగే మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ప్లాంటులో కొత్తగా నిర్మించిన సీసీ రోడ్లు, ఆర్ సి రోడ్లను కూడా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మార్గనిర్దేశంలో సింగరేణితోపాటు అనుబంధ సంస్థ అయిన ఆప్మెల్ ను బహుముఖంగా విస్తరించే ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. 50 ఏళ్ల ఆప్మెల్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రూ.63.13 కోట్ల టర్నోవర్, రికార్డు స్థాయిలో రూ.23.33 కోట్ల నికర లాభాలను ఆర్జించడంపై ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. గత ఏడాది మంత్రి భట్టి విక్రమార్క ఆప్మెల్‌ను సందర్శించిన సమయంలో ఇచ్చిన దిశానిర్దేశం స్ఫూర్తితో సాధించిన విజయంగా అభివర్ణించారు. అలాగే ప్లాంట్‌ను సందర్శించిన సమయంలో ప్లాంట్ లో సౌకర్యాల మెరుగుదలకు హామీ ఇచ్చారని ఆయన ఆదేశాల పైన ప్లాంట్ ఆవరణలో సిసి, ఆర్సిసి రోడ్లు నిర్మించడం జరిగిందన్నారు. సెప్టెంబరు 1, 1976 లో ప్రారంభమైన ఆప్మెల్ సంస్థ ఈ ఏడాది స్వర్ణోత్సవ సంవత్సరంలోకి అడుగు పెట్టిన నేపథ్యంలో ప్రస్తుతం ప్లాంటులో తయారు చేస్తున్న యంత్ర పరికరాలు విడి భాగాలతో పాటు రానున్న రోజుల్లో వివిధ పరిశ్రమల ఆధునిక అవసరాలను పరిగణనలోనికి తీసుకొని వ్యాపార విస్తరణ చర్యలు చేపట్టాలన్నారు. ఆప్మెల్ అభివృద్ధికి, ముఖ్యంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుకోవడానికి, తద్వారా మరింత ఉన్నత స్థాయికి ఎదగడానికి సింగరేణి సంస్థ ఎప్పుడు సహకరిస్తూనే ఉంటుందన్నారు.

**సోలార్ ప్లాంట్ ఏర్పాటుతో విద్యుత్ ఖర్చులలో భారీ ఆదా..**

ఆప్మెల్ ప్లాంటు విద్యుత్ కాలనీ అవసరాలు కలిపి ప్రతీ ఏడాది 60 లక్షల రూపాయలు విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నారు. ప్రస్తుతం రూ.1.24 కోట్లతో ఏర్పాటు చేసిన ఈ సోలార్ ప్లాంట్ తో ఏడాదికి 24 లక్షల రూపాయలు ఆదా అవుతుంది. ఐదేళ్లలో పెట్టుబడి మొత్తాన్ని రాబట్టుకోవచ్చు. అలాగే పర్యావరణ హిత చర్యలకు ప్రోత్సాహం అందించినట్లు అవుతుంది. ఆప్మెల్ చైర్మన్ ఎన్‌వికె శ్రీనివాస్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో సంస్థ అభివృద్ధికి చేపట్టబోయే ప్రణాళికలను వివరించారు. సింగరేణి, కోల్ ఇండియా, ఎన్ఎండీసీ సంస్థల నుంచి లభించిన ఆర్డర్లను సకాలంలో పూర్తి చేశామని వెల్లడించారు.కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, గౌతమ్ పోట్రు, ఎం.తిరుమలరావు, ఈడీ(కోల్ మూవ్‌మెంట్) బి.వెంకన్న, జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్, మార్కెటింగ్)టి.శ్రీనివాస్, విజయవాడ ఆప్మెల్ నుంచి అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



సీఎన్‌సీ లేజర్ యంత్రంలో చిక్కుకుని

## కార్మికుడు మృతి

**కుషాయిగూడ, మహా:** చర్లపల్లిలో ఉన్న సుదర్శన్ ఐరన్ ఫాబ్రికేషన్స్ కంపెనీలో బుధవారం జరిగిన పారిశ్రామిక ప్రమాదంలో ఓ కార్మికుడు మృతి చెందాడు. కంపెనీలోని మోల్డింగ్ సీఎన్‌సీ లేజర్ యంత్రం వద్ద విధులు నిర్వహిస్తున్న బత్తుల సురేష్‌బాబు (42) ప్రమాదవశాత్తు యంత్రంలో చిక్కుకోవడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న చర్లపల్లి పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.ఈ ఘటనతో ఫ్యాక్టరీలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడి కుటుంబ సభ్యుల రోదనలు అక్కడున్న వారిని కలచివేశాయి. పారిశ్రామిక సంస్థల్లో కార్మికుల భద్రతకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని, యంత్రాల నిర్వహణ సమయంలో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని స్థానికులు, సహచర కార్మికులు కోరుతున్నారు.

## అభివృద్ధి పనులపై నేడు సర్వసభ్య సమావేశం

**ఎంపీడీవో హిమబిందు**




**మొయినాబాద్ మహా:** రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం సమావేశ మందిరంలో నేడు ఉదయం 11 గంటలకు మండల స్థాయి సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో హిమబిందు తెలిపారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, నిర్మాణ దశలో ఉన్న పనుల పురోగతి, శాఖల సమన్వయంపై సమీక్ష చేపడతామని పేర్కొన్నారు. సమావేశానికి అన్ని డిపార్ట్మెంట్ల ఉన్నతాధికారులు, గ్రామాల సర్పంచులు, మండల స్థాయి లైన్ డిపార్ట్మెంట్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశాలు జారీ చేసినట్లు ఎంపీడీవో హిమబిందు ఓ ప్రకటనలో తెలిపారు.

## పేద కుటుంబానికి అండగా ప్రభుత్వం..

**రూ.3 లక్షల ఎల్ఓసీ అందజేసిన ఎమ్మెల్యే పాయం..**



**మణుగూరు, మహా :** పేద కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తోందని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఎవరూ వైద్య చికిత్సకు దూరం కాకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో అశ్వాపురం మండలం అశ్వాపురం గ్రామం కాల్వబజార్‌కు చెందిన చెట్టి రాంబాయ్ వైద్య చికిత్స కోసం రూ.3 లక్షల విలువైన *లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసీ)ను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఎంతో భరోసానిస్తున్నాయని తెలిపారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు తమకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎల్ఓసీ అందుకున్న చెట్టి రాంబాయ్ కుటుంబ సభ్యులు తమకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అండగా నిలవడంతో పాటు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేక చొరవ చూపి సహాయం అందించిన సందర్భంగా ఎమ్మెల్యే పాయంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అశ్వాపురం మండల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మాసిటీ రైతులను ఇంకెంతకాలం మోసం చేస్తారు.!

- బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సత్తు వెంకటరమణారెడ్డి
- ఎమ్మెల్యే వైఖరి మోసపూరితమని మండిపాటు



**ఇబ్రహీంపట్నం జూలై 29 మహా**: అబద్దాలు ఉత్తుత్తి సమావేశాలతో ఫార్మాసిటీ రైతులను ఇంకెంతకాలం మోసం చేస్తారని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి ప్రభుత్వంపై మండిపడ్డారు. గత శాసనసభ ఎన్నికలకు ముందు ఫార్మాసిటీ రైతులకిచ్చిన హామీలను అమలు చేయకుండా స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి కాలయాపన చేస్తున్నారని ఆయన విమర్శించారు. జిల్లా ఇన్చార్జి మంత్రి శ్రీధర్ బాబుతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఇటీవల ఎమ్మెల్యే ఏర్పాటు చేసిన ఫార్మా రైతుల సమావేశానికి సంబంధిత రైతులను, ఫార్మా వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులను పిలవకుండా మరోసారి మోసం చేశారని చెప్పారు. తూతూమంత్రపు సమావేశాలతో రైతులకు ఒరిగిందేమీ లేదని, హామీల అమలుకు నిర్దుష్టమైన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఫార్మాసిటీని రద్దు చేసి రైతులకు తిరిగి భూములు ఇస్తామని చెప్పిన మాట నిలబెట్టుకోవాలని ఆయన ఎమ్మెల్యేకు సూచించారు. రైతుల అంగీకారం లేకుండా ఆన్ లైన్ లో వారి పేర్లు తొలగించిన 2500 ఎకరాల భూములను వెంటనే రైతుల పేరిట నమోదు చేయాలని కోరారు. మేడిపల్లి, నానక్ నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాలకు కిలోమీటరు దూరం వరకు ఎలాంటి పరిశ్రమలు ఏర్పాటు చేయకుండా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సూచించారు. భూములు రైతులకు తిరిగి ఇవ్వకుండా మోసం చేస్తే రైతులు తిరగబడతారని ఆయన హెచ్చరించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో అప్పటి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఫార్మా రైతులకు ఇప్పించిన ప్లాట్లను ప్రస్తుత ప్రభుత్వం మూడేండ్లు కావస్తున్నా రైతులకు రిజిస్ట్రేషన్ చేయకపోవడం సిగ్గుచేటని రమణారెడ్డి మండిపడ్డారు. రైతులు విసిగిపోయి ఆ ప్లాట్లను అడ్డికిపావుశేరుకు అమ్ముకునేలా పెద్ద నాయకుల కనుసన్నల్లో కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. కందుకూరు మండలంలోని ముచ్చర్ల, మీరఖాన్ పేట, సార్లరావుల పల్లి, బేగరికంచ, అన్నోజిగూడ, పంజాగూడ రైతులకు మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి పట్టుబట్టి ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయించారని చెప్పారు. ఇక్కడి రైతులకు బిఆర్ఎస్ హయాంలో ఇచ్చిన ప్లాట్లను కూడా రిజిస్ట్రేషన్ చేయించలేకపోవడం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అసమర్థతకు నిదర్శనమని ఆయన దుయ్యబట్టారు. ఇందిరమ్మ పేదలకు భూములిస్తే బిఆర్ఎస్ ప్రభుత్వం గుంజుకుంటుందని అప్పుడు గగ్గోలు పెట్టిన నేతలు ఇప్పుడు మొండిగౌరెల్లి, కొత్తపల్లి, కుర్మిద్ద, మర్లకుంట తండా, ముచ్చర్ల గ్రామాల్లో పేద రైతుల నుండి ఎందుకు భూములు లాక్కుంటున్నారని ఆయన ప్రశ్నించారు.

# తెలంగాణ రాష్ట్రమంతా ఆరుట్ల టీపీఎస్ వైపు చూస్తుంది...

- తల్లిదండ్రుల కలలు సాకారమైతేనే మా కృషికి ఫలితం
- ఆరుట్ల టీపీఎస్‌లో డిగ్రీ కాలేజ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు
- భవిష్యత్‌కు బంగారుబాటలు వేయటమే లక్ష్యంగా ప్రభుత్వం దృష్టి
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఉద్ఘాటన







**ఇబ్రహీంపట్నం జూలై 29 మహా:** మారుమూలన ఉన్న ఆరుట్ల గ్రామం వైపు తెలంగాణ రాష్ట్రమంతా చూసేలా, ఇక్కడి ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్దామని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి తెలిపారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో డిగ్రీ కాలేజ్ సైతం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. మల్‌రెడ్డి యువశక్తి నేతృత్వంలో ఆరుట్ల టీపీఎస్‌లో జరిగిన "ఇన్‌స్పైర్2026" కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన టీపీఎస్‌ను తమ ప్రాంతంలో తమ పేద ప్రజల కోసం ఏర్పాటు చేయటంలో కీలకపాత్ర పోషించిన ఎమ్మెల్యే మల్‌రెడ్డికి ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనస్వాగతం పలికారు. ఎన్నో కష్టనష్టాలకోర్చి పిల్లల కోసం తాపత్రేయపడుతున్న తల్లిదండ్రుల కలలు సాకారమయ్యేలా, విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తేనే తమ కృషికి ఫలితం లభించినట్లు భావిస్తామని ఈ సందర్భంగా మల్‌రెడ్డి పేర్కొన్నారు. భవిష్యత్‌కు బంగారుబాటలు వేయటమే లక్ష్యంగా ప్రజాప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన చెప్పారు. విద్యావ్యవస్థ ప్రక్షాళనలో భాగంగానే ఆరుట్లలో ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్న ఎమ్మెల్యే... ప్రతీ మండలంలోనూ ఈ తరహా టీపీఎస్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. సామాజిక స్పృహతో భావి భారత పౌరుల జీవితానికి బంగారుబాటలు వేయటానికి ముందుకు వచ్చిన ఆకెళ్ల రాఘవేంద్రని, మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డిని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు.

**లక్ష్యం పెద్దగా ఉంటేనే గొప్ప విజయాలు: ఏసీఎల్బీ కిరణ్మయి....**

విద్యార్థులు ఇప్పటి నుంచి లక్ష్యాన్ని ఎంచుకోవాలని అది కూడా... పెద్ద లక్ష్యంతోనే జీవితంలో గొప్పస్థాయికి ఎదగటం సాధ్యమవుతుందని జిల్లా అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి తెలిపారు. ఒకప్పుడు చదువుకోవాలంటే కనీస సౌకర్యాలు కూడా ఉండేవి కావని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను ఉపయోగించుకుని, తమ భవితకు బంగారుబాటలు వేసుకోవాలని ఏసీఎల్బీ సూచించారు.

**సోషల్ మీడియాకు పిల్లలు దూరంగా ఉండాలి: ఏసీపీ కేపీవీ రాజు...**

మారుతున్న కాలానుగుణంగా విద్యార్థులను పక్కదోవ పట్టించేలా ఎన్నో శక్తులు పుట్టుకువస్తున్నాయని, ఇందులో ఒకటే సోషల్ మీడియాలో కంటెంట్ ఉంటుందని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు చెప్పారు. పాఠశాల స్థాయిలో చదువులకు ఎలాంటి ఉపయోగం లేని సోషల్ మీడియాకు విద్యార్థులు పూర్తిగా దూరంగా ఉండాలని ఆయన సూచించారు. తెలిసీతెలియని ప్రాయంలో ఇటీవల కొందరు పిల్లల జీవితాల్లో చోటుచేసుకున్న దుర్ఘటనలను ఈ సందర్భంగా ప్రస్తావించిన ఏసీపీ.... పిల్లలు చదువులపై మాత్రమే దృష్టి పెట్టాలని చెప్పారు. చెడుస్నేహాలకు, చెడ్డవారికి దూరంగా ఉండాలని చెప్పారు.

**ఓటమికి కుంగిపోకుండా జీవితంలో ముందుకు సాగాలి: అభిషేక్‌రెడ్డి....**

విద్యార్థులంతా అబ్దుల్ కలాంలాంటి మహోన్నతమైన వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలని యువనేత మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి సూచించారు. జీవితంలో గెలుపోటములు సహజమని, ఓటమి ఎదురైనప్పుడు కుంగిపోకుండా వాటినే సోపానాలుగా మార్చుకుని విజయతీరాలకు చేరుకోవాలని సూచించారు. భవిష్యత్తుకు బంగారుబాటలు వేసుకునే క్రమంలో విద్యార్థులకు తన సహకారం నిరంతరం ఉంటుందని చెప్పారు.

**వేదికపై ఆకట్టుకున్న టీపీఎస్ విద్యార్థుల ఉపన్యాసాలు...**

ఇన్‌స్పైర్2026 కార్యక్రమంలో భాగంగా తెలంగాణ పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు సందేశ్, నవ్య వేదికపైకి వచ్చి చేసిన ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. ఒకరు తెలుగులో, మరొకరు ఇంగ్లీషులో ప్రసంగిస్తూ.... రాష్ట్ర ప్రభుత్వం తమ పాఠశాలలో కల్పించిన సౌకర్యాలు, విద్యాబోధన గురించి గొప్పగా వివరించటం ప్రముఖులను ఆకట్టుకుంది. వారికి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి గారు అభినందనలు తెలిపారు.

**విద్యార్థుల కోసం ముందుకొచ్చిన పీటీఏ-యూఎస్ఏ...**

రాష్ట్రంలో విద్యాభివృద్ధికి కలాం డైరీ, చెస్ కార్యక్రమం, విద్యావారధి, సంకల్పసిద్ధి కార్యక్రమాలు చేపడుతున్న పిటిఏ యుఎస్ఏ వారు.... ప్రభుత్వపాఠశాలల్లో విద్యాబోధనలో సహకరించేందుకు ముందుకు వచ్చారు. సంకల్ప సిద్ధి సమ్మర్ క్యాంప్ విజయాలను వివరించిన వారి ప్రతినిధి వరప్రసాద్... ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యా అవకాశాలను అందించే దిశగా ముందుకు సాగుతామని ఈ సందర్భంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి రమాకాంత్ రెడ్డి, వెదిరె హనుమంత్ రెడ్డి, భరత్ రెడ్డి, మంచాల తహాసీల్దార్ ప్రసాద్ రావు, సిఐ మధు, గ్రామ సర్పంచ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## సింగరేణి ఉన్నతాధికారుల వేధింపులతో సింగరేణి అవుట్‌సోర్సింగ్ సెక్యూరిటీ గార్డు మృతి

**కుటుంబ సభ్యులు ,తోటి సెక్యూరిటీ గార్డుల సంయుక్త ఆరోపణ**

**బెల్లంపల్లి,మహా:** సింగరేణి సంస్థలో అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డు కేశబోయిన కుమారస్వామి పై అధికారుల వేధింపులు తాళలేక తీవ్ర మనోవేదనకు గురై, గుండెపోటుతో మృతి చెందినట్లు ఆయన కుటుంబ సభ్యులు, తోటి సెక్యూరిటీ గార్డులు ఆరోపించారు. బుధవారం రోజు బెల్లంపల్లి పట్టణంలోని హనుమాన్ బస్తీలో ఆయన మృతదేహం వద్ద అంజలి ఘటించి కుటుంబ సభ్యులు, సహోద్యోగులు తీవ్ర ఆవేదనకు గురై మాట్లాడుతూబెల్లంపల్లి పట్టణంలోని హనుమాన్ బస్తికి చెందిన కేశబోయిన కుమారస్వామి సింగరేణి సంస్థలో అవుట్ సోర్సింగ్ సెక్యూరిటీ గార్డుగా గోలేటి ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్నాడనీ ఇటీవల రాత్రి విధుల్లో ఉండగా కొందరు దొంగలు చోరీకి ప్రయత్నించగా, కుమారస్వామి "దొంగ... దొంగ..." అంటూ గట్టిగా కేకలు వేయడంతో వారు అక్కడి నుంచి పారిపోయారు. అనంతరం జరిగిన విషయాన్ని పై అధికారులకు తెలియజేయగా, వారు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి ఎలాంటి వస్తువులు చోరీకి గురికాలేదని నిర్ధారించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.అయినప్పటికీ సింగరేణి ఏఎస్ఓ అధికారి దాసరి శ్రీధర్ కుమారస్వామితో పాటు మరికొందరు సెక్యూరిటీ సిబ్బందిని బాధ్యులుగా పేర్కొంటూ రెండు రోజుల పాటు విధులకు రాకుండా ఆదేశించారని ఆరోపించారు. చేయని తప్పుకు తనను బాధ్యుడిని చేశారనే బాధతో కుమారస్వామి గత రెండు రోజులుగా తీవ్ర మనోవేదనకు గురై అదే విషయాన్ని కుటుంబ సభ్యులకు, తోటి కార్మికులకు చెబుతూ ఆవేదన వ్యక్తం చేసేవాడని తెలిపారు.ఈ క్రమంలో ఈ నెల 28న కుమారస్వామికి గుండెపోటు రావడంతో ఆసుపత్రికి తరలించేలోపే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు.కుమారస్వామి మృతదేహానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గెల్లి రాజలింగు, బండి రాము, బీఆర్ఎస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి రెవెల్లి విజయ్ నివాళులర్పించారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామికి ఫోన్ ద్వారా సంఘటన వివరాలు, అధికారుల వేధింపులపై సమాచారం అందించినట్లు తెలిపారు. కుమారస్వామి మరణానికి పై అధికారి ఏఎస్ఓ శ్రీధర్ వేధింపులే కారణమని ఆరోపిస్తూ సింగరేణి యాజమాన్యం బాధ్యత వహించే మృతుడి కుటుంబానికి తగిన నష్టపరిహారం అందించడంతో పాటు ఆయన భార్యకు సింగరేణిలో ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు.

## భారీ వర్షంలోనూ కొండగట్టు గిరిప్రదక్షిణ.. రైతుల సంక్షేమం కోసం ప్రత్యేక పూజలు

**లోక కళ్యాణం, సమృద్ధి వర్షా ల కోసం అంజన్నను ప్రార్థించిన మంత్రులు, ఎమ్మెల్యేలు**



**కొండగట్టు, మహా:** గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని జగిత్యాల జిల్లా కొండగట్టులో బుధవారం 43వ గిరిప్రదక్షిణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డా. మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.ఉదయం నుంచి కురుస్తున్న భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వేలాది మంది భక్తులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గిరిప్రదక్షిణను పూర్తి చేశారు. అనంతరం శ్రీ కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకుని రాష్ట్ర ప్రజల సంక్షేమం, రైతుల సుభిక్షం, సమృద్ధిగా వర్షాలు కురవాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎల్‌నినో ప్రభావం తొలగి పంటలు బాగా పండాలని అంజన్నను వేడుకున్నారు.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రముఖ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తోందన్నారు. ఎల్‌నినో ప్రభావంతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగి సమృద్ధిగా వర్షాలు కురవాలని, ప్రజలంతా ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని అంజన్నను ప్రార్థించామని తెలిపారు. జిల్లా అభివృద్ధి కోసం అందరం కలిసికట్టుగా పనిచేస్తామని, ఇది రాజకీయ కార్యక్రమం కాదని, సకలజనుల సంక్షేమం కోసం నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమమని స్పష్టం చేశారు.మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కొండగట్టు క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, రైతుల కష్టాలు తొలగి రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురవాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ఆధ్యాత్మిక భావనతో గిరిప్రదక్షిణ చేపట్టామని చెప్పారు. భారీ వర్షంలోనూ పాల్గొన్న ప్రతి భక్తుడికి, కాంగ్రెస్ కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, హుజురాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఒడితల ప్రణవ్ బాబు, మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన కుమార్‌తో పాటు జిల్లా వ్యాప్తంగా మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, సర్పంచులు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, సహకార సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, వేలాది మంది అంజన్న భక్తులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన పోలీసులు

**యాదాద్రి భువనగిరి ,మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా పరిధిలోని అన్ని పోలీసు స్టేషన్‌ల పరిధిలో విస్తృతంగా బుధవారం రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీసులు వాహనదారులు, విద్యార్థులు మరియు ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడి రోడ్డు భద్రతా నిబంధనల ప్రాముఖ్యతను వివరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్ట్ వినియోగించాలని, అతి వేగంగా వాహనాలు నడపకూడదని, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ ఉపయోగించరాదని, మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని అవగాహన కల్పించారు. అదేవిధంగా ట్రాఫిక్ సిగ్నల్లను తప్పనిసరిగా పాటించాలని, చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ మరియు ఇతర వాహన పత్రాలను వెంట ఉంచుకోవాలని, పాదచారుల భద్రతను దృష్టిలో ఉంచుకొని బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని సూచించారు.

## సొంత అల్లుడే మాస్టర్‌మైండ్... మనుమడితో కలిసి మామ ఇంట్లోనే డెకాయిటీ!

**భగత్‌నగర్ సంచలన కేసును ఛేదించిన కరీంనగర్ పోలీసులు – మీరట్‌లో ముగ్గురు అరెస్ట్, నగదు–బంగారం స్వాధీనం**

**కరీంనగర్ మహా:** కరీంనగర్ నగరంలోని భగత్‌నగర్‌లో ఇటీవల సంచలనం సృష్టించిన ఇంటి డెకాయిటీ కేసును పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. కుటుంబ సభ్యులను డమ్మీ పిస్టళ్లు, కత్తులతో బెదిరించి చేతులు, కాళ్లు కట్టేసి నగదు, బంగారం, వెండి ఆభరణాలను దోచుకెళ్లిన ఈ ఘటన వెనుక బాధితుడి సొంత అల్లుడు, మనుమడే మాస్టర్‌మైండ్‌లు అని దర్యాప్తులో తేలింది. కేసు నమోదు చేసిన వెంటనే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిన కరీంనగర్ పోలీసులు ఘటనా స్థలం నుంచి నిందితులు పారిపోయిన మార్గాల వరకు ఉన్న సీసీటీవీ ఫుటేజీలను నిశితంగా పరిశీలించారు. దోపిడీ అనంతరం దొంగిలించిన ద్విచక్ర వాహనాలపై హుజురాబాద్ వైపు వెళ్లిన నిందితులు, పెద్ద పాపయ్యపల్లి సమీపంలో వాటిని వదిలేసి పరారైనట్లు గుర్తించారు. సాంకేతిక ఆధారాలతో నిందితుల జాడను కనిపెట్టి ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ వరకు వెళ్లిన పోలీసులు స్థానిక పోలీసుల సహకారంతో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారు సల్మాన్ అలియాస్ భూరే అలియాస్ యాదవ్ (22), సల్మాన్ అలియాస్ విమాన్ (22), మొహమ్మద్ హసీన్ (19). వీరి వద్ద నుంచి రూ.2.09 లక్షల నగదు, 43.67 గ్రాముల బంగారు ఆభరణాలు, 64.98 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన వివరాలు మరింత ఆశ్చర్యానికి గురిచేశాయి. బాధితుడు ఎం.డి. అజ్మత్ అలీ సొంత అల్లుడు రజావుద్దీన్ గతంలో కొంతకాలం మామ ఇంట్లోనే నివసించాడు. ఆ సమయంలో ఇంట్లో ఉన్న నగదు, బంగారు ఆభరణాలపై పూర్తి సమాచారం సేకరించాడు. వ్యాపార నష్టాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్న అతను మామ వద్ద రూ.5 లక్షలు ఇవ్వాలని ఒత్తిడి చేసినా నిరాకరణ ఎదురు కావడంతో ప్రతీకారం తీర్చుకోవాలని నిర్ణయించుకున్నాడు. తన కుమారుడు అజీమ్ రజాతో పాటు మీరట్‌కు చెందిన సహచరులను రంగంలోకి దింపి పక్కా ప్రణాళిక రచించాడు. ఈ నెల 20న మీరట్ నుంచి రామగుండం చేరుకున్న ముఠా, 21వ తేదీ అర్ధరాత్రి భగత్‌నగర్‌లోని ఇంట్లోకి చొరబడి కుటుంబ సభ్యులను బెదిరించి నగదు, బంగారం, వెండి ఆభరణాలను దోచుకుని పరారైంది. అరెస్టయిన ముగ్గురు నిందితులను ట్రాన్సిట్ వారెంట్‌పై కరీంనగర్‌కు తీసుకొస్తుండగా, కేసులో ప్రధాన నిందితులైన *రజావుద్దీన్ (A1), అజీమ్ రజా (A2)*తో పాటు పరారీలో ఉన్న ఇతర నిందితుల కోసం ప్రత్యేక పోలీసు బృందాలు ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. పకడ్బందీ సాంకేతిక దర్యాప్తు, సీసీటీవీ విశ్లేషణ, రాష్ట్రాల మధ్య సమన్వయంతో ఈ సంచలన కేసును ఛేదించిన కరీంనగర్ పోలీసుల పనితీరుపై ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

## భారీ వర్షా లతో మంచిర్యాల జిల్లా అతలంకుతలం

**వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన అధికార పార్టీ, మీ భాజాపా నేతలు, పోలీసులు**



**మంచిర్యాల, మహా :** భారీ వర్షాలతో మంచిర్యాల జిల్లా వాగులు, వంకలలో నీరు పొంగిపొర్లుతుండడంతో జనజీవనం అతలంకుతలం అయింది. రాత్రి 12 గంటల నుండి విరామం లేకుండా వర్షం కురుస్తుండడంతో ప్రజలు ఇంటి నుండి బయటకు రాలేకపోయారు. చిన్న చితక వ్యాపారులు కొనుగోలుదారులు లేక ఎదురుచూస్తూ ఉండవలసి వచ్చింది. ప్రయాణికులు లేక ఆటోలు, బస్సులు ఖాళీతో దర్శనం ఇచ్చాయి. కొన్ని పాఠశాలలు వర్షం కారణంగా మూతపడ్డాయి. జిల్లాలోని పలు సింగరేణి ఓపెన్ క్యాస్ట్ ప్రాజెక్టు గనులు ఉత్పత్తి ఉత్పాదకత లేక బొగ్గు ఉత్పత్తి నష్టపోయింది. జిల్లాలోని పలు గ్రామాలలో మంచిర్యాల, మందమర్రి, బెల్లంపల్లి, రామకృష్ణాపూర్ , చెన్నూరు ప్రాంతాలలో కొన్ని కాలనీలు నీటిమయం అయ్యాయి. వర్షపు నీటి తాకిటికి గురైన ప్రాంతాలను పాలక కాంగ్రెస్ పార్టీ నేతలు, భారతీయ జనతా పార్టీ నేతలతో పాటు రామగుండం సిపి అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డిసిపి తదితరులు భారీ వర్షాల నేపథ్యంలో రాళ్లవాగు ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, భారీ వర్షాల కారణంగా రాళ్లవాగు ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో పాత మంచిర్యాల ప్రాంతానికి రాకపోకలు నిలిచిపోయాయని తెలిపారు. ప్రజల భద్రత దృష్ట్యా ప్రమాదకర ప్రాంతాలను పూర్తిగా మూసివేసి, అవసరమైన చోట్ల ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేస్తున్నామని తెలిపారు. మరికొన్ని ప్రాంతాల్లో రాకపోకలను పూర్తిగా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. పోలీసులు సూచించిన ట్రాఫిక్ మళ్లింపులను ప్రజలు తప్పనిసరిగా పాటించాలని ఆయన కోరారు. వర్షాకాలంలో భద్రతకే అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని కమిషనర్ కోరారు. వాతావరణ శాఖ మరో రెండు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించిన నేపథ్యంలో ముంపు ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ముఖ్యంగా కోటపల్లి,నీల్వాయి ప్రాంతాల వైపు ప్రాణహిత నదిలో నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున, అవసరమైతే ఎస్‌డీఆర్ఎఫ్ (స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) బృందాలను మోహరించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. అదేవిధంగా,పోలీస్ కమిషనరేట్ పరిధిలో దాదాపు 30 మంది శిక్షణ పొందిన సిబ్బంది అత్యవసర సహాయక చర్యలకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. గత ఏడాది వరదల సమయంలో గ్రామాలు నీటిలో చిక్కుకున్నప్పుడు బోట్ల సహాయంతో విజయవంతంగా సహాయక చర్యలు చేపట్టామని గుర్తు చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే స్పందించేందుకు పోలీసు అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటిస్తూ అందుబాటులో ఉన్నారని కమిషనర్ తెలిపారు. ఈ పరిశీలనలో మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్,మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్, మంచిర్యాల పట్టణ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

## శిధిలావస్థలో ఉన్న గృహాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**మందమర్రి మున్సిపల్ కమిషనర్, తాసిల్దార్ వెల్లడి**



**మందమర్రి, మహా :** మందమర్రి మండలంలో శిథిలావస్థలో ఉన్న గృహాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మందమర్రి తాసిల్దార్ సతీష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ తుంగపండి రాయలింగు, ఎస్సై గోపతి నరేష్‌లు విజ్ఞప్తి చేశారు. మంగళవారం రాత్రి నుండి కురుస్తున్న వర్షాలకు శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం సమీపంలో ఇల్లు కూలిపోయిన ఆయిల్ల కనకమ్మ గృహాన్ని వారు సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ భారీ వర్షం వల్ల పట్టణంలో ఇంటి యజమానురాలు, కుటుంబ సభ్యుల అప్రమత్తంతో కనకమ్మ తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకొని, స్వల్ప గాయాలతో బయటపడిందని వెల్లడించారు. బాధితురాలు ఇంటి ముందు గది పూర్తిగా ధ్వంసం కావడంతో ఆస్తి నష్టం వాటిల్లిందని చెప్పారు. కనకమ్మ పట్టణంలోని సాయిబాబా గుడి సమీపంలో సాయంత్రం వేళ రొట్టెలు విక్రయిస్తూ, తన జీవనాన్ని కొనసాగిస్తుండగా, అకాల వర్షం ఆమెకు కన్నీళ్లను మిగిల్చిందని పేర్కొన్నారు. సంఘటన స్థలాన్ని పట్టణ మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు, పట్టణ ఎస్ఐ గోపతి నరేష్‌లు సందర్శించి, ప్రమాద వివరాలను ఆరా తీశారు. అదేవిధంగా సమాచారం అందుకున్న మండల తహశీల్దార్ పి సతీష్‌కుమార్ తహశీల్దార్ కార్యాలయ సిబ్బందిచే విచారణ జరిపి, ప్రభుత్వ పరంగా బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, శిథిలావస్థ నిర్మాణాలలో నివాసం ఉండే ప్రజలు అత్యవసర సహాయ కొరకు ప్రభుత్వ అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ సంఘటన నేపథ్యంలో స్థానిక కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద, ప్రభుత్వ అధికారులు, సహృదయాలు కనకమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## గురుపౌర్ణమి సందర్భంగా గిరిజనులకు భోజనం

**బెల్లంపల్లి, మహా:** గురుపౌర్ణమి సందర్భంగా బెల్లంపల్లి నియోజకవర్గంలోని తాండూరు మండలం కర్షల ఘట్టం గ్రామంలో సనాతన ధర్మ బాయిజమ్మ సాయి భక్తి ప్రచార ధార్మిక సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో గిరిజనులు, అన్నార్తులకు సాయి భోజన్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ కాంపల్లి శంకర్‌రాజేశ్వరి మాట్లాడుతూ, దాతల సహకారంతో నిత్యం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అన్నదానాన్ని వినియోగించుకున్న గ్రామస్థులు ట్రస్ట్ సభ్యులకు, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ మేనేజర్ బొద్దున సతీష్, సభ్యులు, సేవకులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పొలిటికల్ సైన్స్ గెస్ట్ లెక్చరర్ పోస్టు దరఖాస్తు గడువు పొడిగింపు

- **వర్షా ల ఉధృతి నేపథ్యంలో ఈ నెల 31వ తేదీ వరకు అవకాశం**
- **బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో అవకాశం**
- **ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్**

**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాలలో 202627 విద్యా సంవత్సరానికిగాను డిగ్రీ బి.ఎ. ఆనర్స్ పొలిటికల్ సైన్స్ ఇంగ్లీష్ మీడియం సబ్జెక్టు మరియు పీజీ ఎం.ఎ. పొలిటికల్ సైన్స్ ఇంగ్లీష్ మీడియంలో బోధించడానికి ఇంగ్లీష్ మీడియం బ్యాక్ గ్రౌండ్ కలిగిన అభ్యర్థులు ఈనెల 31వ తేదీ సాయంత్రం 4 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ కోరారు. దరఖాస్తు గడువు ఈనెల 29వ తేదీ వరకు ఉండగా ముసురు వర్షాల నేపథ్యంలో మరో రెండు రోజులపాటు జూలై 31 వరకు గడువు పొడిగించినట్లు చెప్పారు. సంబంధిత సబ్జెక్టులో 55 శాతం (ఎస్సీ/ఎస్టీలకు 50%) మార్కులతో ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అయితే పీహెచ్డీ, నెట్, సెట్ వంటి అత్యున్నత విద్యార్హతలు కలిగిన వారికి ప్రథమ ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. ఈ సబ్జెక్టు బోధించే అభ్యర్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం కూడా ఉండాలని చెప్పారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూ మరియు డెమోలను మంచిర్యాలలోని ప్రభుత్వ ఐడి డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఐడి కళాశాల ప్రిన్సిపాల్ ఆదేశాల మేరకు ఇంటర్వ్యూ మరియు డెమో తేదీలను అభ్యర్థులకు తెలియజేస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ చెప్పారు. ఇతర వివరాలకు 9959269975 ఫోన్ నెంబర్ లో సంప్రదించాలని సూచించారు.




## సింగరేణి కార్మికుడి మరణానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలి

**బెల్లంపల్లి సింగరేణి కార్మిక సంఘాల జేఏసీ నాయకుల డిమాండ్**

**బెల్లంపల్లి, మహా:** మందమర్రి ఏరియాలోని బెల్లంపల్లి శాంతిఖని గనిలో ఆలర్ ఆపరేటర్ గా విధులు నిర్వహిస్తున్న బి. రవికుమార్ బుధవారం రోజు ఉదయం చాతిలో నొప్పి రావడంతో ఉదయం బెల్లంపల్లి సింగరేణి ఆసుపత్రికి తీసుకురావడంతో సరియైన వైద్య చికిత్స లేక మృతి చెందిన కారణంగా బాధ్యులైన వైద్య సిబ్బందిపై యాజమాన్యం చర్యలు తీసుకోవాలని బెల్లంపల్లి సింగరేణి కార్మిక సంఘాలు జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ మణి రామ్ సింగ్ మాట్లాడుతూ వైద్య చికిత్సల కోసం ఆసుపత్రికి చేరుకున్న బాధితుని పరిశీలించిన డాక్టర్ ఈ సి జి తీసి మూడు ఇంజక్షన్లు ఇచ్చి అత్యవసర చికిత్స నిమిత్తము మంచిర్యాల ప్రవేట్ టచ్ ఆసుపత్రికి రెఫర్ చేయడం జరిగిందని ఆసుపత్రి అక్కడికి చేరుకోక ముందే బాధితుడు మరణించడం జరిగిందని, అతని చావుకు బాధ్యులెవరు? బెల్లంపల్లి సింగరేణి ఆసుపత్రి నందు కార్డియాలజిస్ట్ లేని కారణంగా సంఘటన జరిగిందనీ, గత రెండు మూడు నెలల క్రితం డైరెక్టర్ ఫా బెల్లంపల్లి సింగరేణి ఆసుపత్రిని శిలాఫలకం ఓపెన్ చేసి బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రిని పూర్వ వైభవాన్ని తీసుకొస్తానని ప్రగల్భాలు పలికి సౌకర్యాలు కల్పించకపోవడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. . బెల్లంపల్లి సింగరేణి ఆసుపత్రికి వారంలో కేవలం మంగళవారం నాడు మాత్రమే ఈ. ఎన్. టి మరియు సైకాలజిస్ట్, గురువారం ఆర్తో, గైనకాలజిస్ట్, స్కిన్ కు సంబంధించిన డాక్టర్లు వస్తుంటారనీ, కానీ రెగ్యులర్ డాక్టర్లు మాత్రం నామమాత్రంగానే ఉన్నారనీ ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు సంవత్సరాల క్రితం శాసన సభ్యులు కొత్తగూడెం సిఎంఓ ని బెల్లంపల్లికి పిలిపించి జె. ఏ. సి. నాయకుల సమక్షంలో చర్చించడం జరిగిందనీ నాటి నుండి నేటి వరకు స్థానిక శాసనసభ్యులు గడ్డం వినోద్ సింగరేణి ఏరియా ఆసుపత్రిని పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా సింగరేణి లో గెలుపొందిన గుర్తింపు సంఘం, ప్రాతినిధ్య సంఘం నాయకులు చొరవ తీసుకుని ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సౌకర్యాలను వైద్య సిబ్బందిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు రెగ్యులర్ గా స్త్రీల వైద్యానికి సంబంధించి డాక్టర్లను నియమించాలని , కార్డియాలజిస్ట్ డాక్టర్లను సైతం నియమించాలని , బుధవారం నాడు జరిగిన కార్మికుడి మరణం అందుబాటులో కార్డియాలజిస్ట్ లేకపోవడం సరైన వైద్య సిబ్బంది లేని కారణంగానే మృతి చెందడం జరిగిందని సంబంధిత అంశంలో జరిగిన వైద్య నిర్లక్ష్యం పై సింగరేణి యాజమాన్యం విచారణ జరిపి బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సింగరేణి జేఏసీ నాయకులు ఉమ్మడిగా డిమాండ్ చేశారు.

జరిగిన సంఘటన విషయమై స్థానిక సూపర్డెంట్ ని జే.ఏ.సీ నాయకులు కలిసి సమాచారం తెలుసుకోవడం జరిగింది. సింగరేణి కార్మికుడు బి. రవికుమార్ మరణానికి పూర్తి బాధ్యత సింగరేణి యాజమాన్యమే వహించవలసి ఉంటుందని, జే.ఏ.సీ నాయకులు సింగరేణి యాజమాన్యాన్ని, అలాగే సంబంధిత అధికారులను డిమాండ్ చేస్తున్నామనీ ఇట్టి విషయమై న్యాయ విచారణ జరిపించాలని , కార్మికుడి మరణం బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రిలోనే జరిగిందనే ఆపోహలు ఉన్నాయనీ, తమ బాధ్యత నుండి తప్పుకోడానికి మాత్రమే మంచిర్యాల ప్రవేట్ టచ్ ఆసుపత్రికి పంపినట్లు అనుమానాలు సర్వత్రా వినిపిస్తున్నాయని బెల్లంపల్లి పరిధిలో పోస్టుమార్టం చేయాల్సిన బాడీని మంచిర్యాల సివిల్ ఆస్పత్రికి తరలించడం ద్వారా అతని కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారనీ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టిఎన్టియుసి రాష్ట్ర కార్యదర్శి మని రామ్ సింగ్, టీడీపీ పట్టణ అధ్యక్షులు గజ్జి దుర్గయ్య, సింగరేణి గని కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు అంబాల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



## భారీ వర్షా ల నేపథ్యంలో పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**బెల్లంపల్లి మున్సిపల్ చైర్పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు & కమిషనర్ తన్నీరు రమేష్ పలు వార్డుల్లో పర్యటన**

**బెల్లంపల్లి, మహా:** రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో బెల్లంపల్లి పట్టణంలోనూ కడతరుపు లేకుండా కురుస్తున్న వర్షాలకు పట్టణంలోని పలు కాలనీలో వార్డులు జలమయమయ్యాయి దీంతో పట్టం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు తోపాటు మున్సిపల్ కమిషనర్ తన్నేరు రమేష్ లు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రజలకు సూచించారు.మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో బెల్లంపల్లి శాసనసభ్యులు గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు బెల్లంపల్లి మున్సిపాలిటీలోని బజార్ ఏరియా, పలు బస్తీలలో పర్యటించి భారీ వర్షాల కారణంగా ఇళ్ళు కూలిపోయిన బాధితులను పరామర్శించి, పడిపోయిన చెట్లను, నీరు నిలిచిన ప్రాంతాలను, డ్రైనేజీలను పరిశీలించి తక్షణ చర్యలను మున్సిపల్ యంత్రాంగం క్షేత్రస్థాయిలో చేపట్టింది . బుధవారం నాడు పలువార్డులలో మున్సిపల్ చైర్ పర్సన్ . దావ స్వాతి రమేష్ బాబు మరియు బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ మున్సిపల్ సిబ్బంది పట్టణంలోని ప్రధాన రహదారిపై వర్షపు నీరు చేరి ప్రయాణికులకు, ప్రజలకు రాకపోకలకు ఇబ్బందిగా మారడంతో మున్సిపల్ సిబ్బందితో నాళాలను తెరిపించి వరద నీరు ఆగకుండా వెళ్లేలా చర్యలు చేపట్టారు. వర్షాలకు పలు బస్తీలలో భారీ వృక్షాలు నేల కూలడంతో ప్రజలకు ఇబ్బంది కలగకుండా మున్సిపల్ సిబ్బందిచే వాటిని తొలగించేలా చర్యలు చేపట్టడం జరిగింది.వర్షపు నీరు నిల్వ ఉండే ప్రాంతాలు, బస్తీలను పరిశీలించి చర్యలు చేపట్టారు. డ్రైనేజీల పూడికతీత, వరద నీటి మళ్లింపు పనులను వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించడం జరిగింది.అత్యవసర సమయాల్లో మున్సిపాలిటీ అధికారులను, సిబ్బందిని సంప్రదించాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని పేర్కొనడం జరిగింది.భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో బెల్లంపల్లి పట్టణ ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని చైర్ పర్సన్ దావా స్వాతి రమేష్ బాబు సూచించారు.ఈకార్యక్రమంలో వైస్ చైర్మన్ రాగంశెట్టి సత్యనారాయణ తోపాటు ఆయా వార్డ్ ల మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.



మహా పత్రిక





# చీరలో పాయల్ అందాల విందు

సౌత్ ఇండియన్ నటి పాయల్ రాధాకృష్ణ మరోసారి తన అందం, అభినయంతో పాటు సంప్రదాయ శైలిలో కనిపించి సోషల్ మీడియాలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తాజాగా ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్న మిర్రర్ సెల్ఫీ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఊదా రంగు చీరలో రాజసంగా మెరిసిన పాయల్ ఫొటోలు నెటిజన్ల నుంచి ప్రశంసలు అందుకుంటున్నాయి.బంగారు జరీ అంచులతో నాజూకుగా నేసిన ఊదా రంగు చీరకు మ్యాచింగ్ స్లీవ్‌లెస్ బ్లౌజ్‌ను జత చేసి పాయల్ ఎంతో హుందాగా కనిపించింది. సంప్రదాయ దక్షిణాది శైలిని ప్రతిబింబించేలా మల్లెపూలతో జడను అలంకరించుకోవడం, చిన్న స్టడ్ చెవిపోగులు, చేతినిండా మ్యాచింగ్ గాజులు ధరించడం ఆమె లుక్‌కు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చాయి. సహజమైన చిరునవ్వు, ఆత్మవిశ్వాసంతో కూడిన హావభావాలు ఆమె అందాన్ని మరింత రెట్టింపు చేశాయి. ఎలాంటి అతిశయోక్తి లేకుండా సింపుల్‌గా కనిపించినా, ఆమె స్టైల్ అభిమానులను ఫిదా చేసింది. పాయల్ రాధాకృష్ణ సోషల్ మీడియాలో ఎప్పుడూ చురుకుగా ఉంటూ తన ఫొటోషూట్లు, సినిమా అప్‌డేట్లు, వ్యక్తిగత క్షణాలను అభిమానులతో పంచుకుంటూ ఉంటుంది. ఈసారి ఆమె సంప్రదాయ వేషధారణలో కనిపించడంతో అభిమానులు "ట్రెడిషనల్ బ్యూటీ", "ఎలిగెంట్ లుక్", "చీరలో మరింత అందంగా ఉన్నారు" అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సినీ ప్రయాణంలోనూ పాయల్ రాధాకృష్ణ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంటోంది. భిన్న, నిమ్మెల్లారా ఆశీర్వాద వంటి చిత్రాల్లో నటించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్న ఆమె, ఆ తర్వాత తెలుగు చిత్ర పరిశ్రమలో వరుస అవకాశాలను అందిపుచ్చుకుంది. ఇటీవల విడుదలైన *ప్రసన్న వదనం*, అలా నిన్ను చేరి, చౌర్య పాఠం* చిత్రాల్లో కీలక పాత్రల్లో కనిపించి నటిగా తన ప్రతిభను మరోసారి నిరూపించుకుంది. ప్రస్తుతం ఆమె చేతిలో పాపం ప్రతాప్, మిస్టర్ వర్క్ ఫ్రం హోమ్ వంటి ఆసక్తికరమైన ప్రాజెక్టులు ఉన్నాయి. విభిన్న కథలు, వైవిధ్యమైన పాత్రలను ఎంచుకుంటూ కెరీర్‌ను ముందుకు తీసుకెళ్తున్న పాయల్ రాధాకృష్ణ, గ్లామర్‌తో పాటు నటనకు కూడా సమాన ప్రాధాన్యం ఇస్తూ దక్షిణాది చిత్రసీమలో తన స్థానాన్ని మరింత బలపరుచుకుంటోంది. అందం, అభినయం, సంప్రదాయం కలగలిసిన ఆమె వ్యక్తిత్వమే అభిమానులను మరింత దగ్గర చేస్తోందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



# రాయల్ లుక్‌లో మెరిసిన సిద్ధార్థ్‌అదితి.. క్యూట్ కెమిస్ట్రీకి ఫ్యాన్స్ ఫిదా



టాలీవుడ్‌లో మహా సముద్రం సినిమా ద్వారా పరిచయమైన సిద్ధార్థ్, అదితి రావు హైదరి ఆ తర్వాత ప్రేమలో పడి వివాహ బంధంతో ఒక్కటైన సంగతి తెలిసిందే. ఈ జంట ఇప్పుడు సినీ అభిమానులే కాకుండా ఫ్యాషన్ ప్రేమికుల దృష్టినీ ఆకర్షిస్తోంది. తాజాగా ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ జయంతి రెడ్డి నిర్వహించిన గ్రాండ్ ఫ్యాషన్ షోలో ఈ క్యూట్ కపుల్ షోస్టాపర్లుగా ర్యాంప్ వాక్ చేసి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. రాజకుమారుడు, రాజకుమారిలా కనిపించిన వీరిద్దరూ తమ రాయల్ లుక్, అద్భుతమైన కెమిస్ట్రీతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు.ఈ ఈవెంట్‌లో అదితి రావు హైదరి సంప్రదాయం, ఆధునికత కలగలిసిన అద్భుతమైన డిజైనర్ దుస్తుల్లో కనిపించారు. గోల్డ్, బేజ్ రంగుల కలయికలో రూపొందించిన హెవీ ఎంబ్రాయిడరీ పెప్లమ్ బాడీస్‌తో పాటు జర్దోజీ వర్క్, పూసల అలంకరణతో రూపొందించిన షరారా స్కర్ట్‌ను ధరించి ర్యాంప్‌పై నడిచారు. మినిమల్ జ్యువెలరీ, హుందాతనంతో కూడిన స్టైలింగ్ ఆమె అందాన్ని మరింత రెట్టింపు చేసింది. సిద్ధార్థ్ కూడా అదితి దుస్తులకు సరిపోయేలా బేజ్ కలర్ హెరిటేజ్ షేర్వానీ జాకెట్‌తో పాటు ధోతీ స్టైల్ ట్రౌజర్స్‌ను ధరించి క్లాసీ లుక్‌లో కనిపించారు. మెడలో ధరించిన మల్టీ లేయర్ పెర్ల్, ఎమరాల్డ్ హారం ఆయన రాయల్ లుక్‌కు మరింత ఆకర్షణను తీసుకొచ్చింది. సంప్రదాయ దుస్తుల్లోనూ ఆధునిక హుందాతనాన్ని చాటిన సిద్ధార్థ్ స్టైల్ అభిమానులను ఆకట్టుకుంది. జయంతి రెడ్డి రూపొందించిన 'ది గిల్డెడ్ ఎరా' కలెక్షన్‌కు షోస్టాపర్లుగా వచ్చిన ఈ జంట ర్యాంప్‌పై కలిసి నడుస్తుంటే నిజమైన రాజవంశానికి చెందిన జంటను చూస్తున్న భావన కలిగిందని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. వీరిద్దరి మధ్య కనిపించిన అన్యోన్యత, సహజమైన చిరునవ్వులు, ఒకరిపై ఒకరికి ఉన్న ఆప్యాయత ర్యాంప్ వాక్‌ను మరింత ప్రత్యేకంగా మార్చాయి. ఈ ఫ్యాషన్ షోకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అభిమానులు "రాయల్ కపుల్", "పర్‌ఫెక్ట్ కపుల్ గోల్స్", "ఎలిగెన్స్‌కు మరో పేరు" అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. సినిమా ద్వారా ప్రారంభమైన వీరి పరిచయం ప్రేమగా మారి, ఇప్పుడు దాంపత్య జీవితంలోనూ అదే అన్యోన్యతను కొనసాగిస్తున్న ఈ జంట ప్రతి పబ్లిక్ ఈవెంట్‌లోనూ తమ ప్రత్యేక కెమిస్ట్రీతో ఆకట్టుకుంటూనే ఉంది. ఈ ర్యాంప్ వాక్ కూడా సిద్ధార్థ్‌అదితి జోడీకి ఉన్న ప్రత్యేక అభిమానాన్ని మరోసారి నిరూపించింది.

# ఆర్జీవీ సినిమాలే ఎక్కువ మందికి స్ఫూర్తి.. కారణం చెప్పిన అజయ్ భూపతి



టాలీవుడ్ దర్శకుడు అజయ్ భూపతి తన సినీ ప్రయాణం, తనను ప్రభావితం చేసిన దర్శకుల గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆర్‌ఎక్స్ 10, మహాసముద్రంమంగళవారం వంటి విభిన్న చిత్రాలతో దర్శకుడిగా ప్రత్యేక గుర్తింపు పొందిన ఆయన, ప్రస్తుతం శ్రీనివాస మంగాపురం సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఈ చిత్రం ద్వారా సూపర్ స్టార్ కృష్ణ మనవడు, మహేష్ బాబు సోదరుడి కుమారుడు జై కృష్ణ ఘట్టమనేని హీరోగా పరిచయం అవుతుండగా, బాలీవుడ్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడానీ తెలుగు తెరకు ఎంట్రీ ఇస్తోంది. అలాగే సీనియర్ నటుడు డాక్టర్ మోహన్ బాబు కీలక పాత్రలో నటిస్తున్నారు. జూలై 30న విడుదల కానున్న ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో అజయ్ భూపతి పలువురు దర్శకుల గురించి తన అభిప్రాయాలను వెల్లడించారు.ఈ సందర్భంగా దర్శక దిగ్గజాలు మణిరత్నం, రామ్ గోపాల్ వర్మల గురించి మాట్లాడుతూ ఇద్దరూ భారతీయ సినీ పరిశ్రమపై చెరగని ముద్ర వేసిన దర్శకులేనని పేర్కొన్నారు. అయితే ఫిల్మ్ మేకర్స్‌పై ప్రభావం చూపిన విషయంలో రామ్ గోపాల్ వర్మ ముందుంటారని ఆయన అభిప్రాయపడ్డారు. మణిరత్నం సినిమాలు అత్యున్నత స్థాయి విజన్‌తో రూపొందుతాయని, వాటి నుంచి స్ఫూర్తి పొందాలంటే ప్రత్యేకమైన ఆలోచనా విధానం అవసరమని అజయ్ భూపతి చెప్పారు. ఆయన చిత్రాలను చూసినప్పుడు గొప్ప అనుభూతి కలిగినా, అలాంటి సినిమాలు తాము కూడా తీయగలమనే నమ్మకం వెంటనే రాదని పేర్కొన్నారు. అయితే రామ్ గోపాల్ వర్మ సినిమాలు మాత్రం దర్శకుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని అన్నారు. "ఆర్జీవీ సినిమా చూస్తే 'ఇలాంటి సినిమా మనం కూడా చేయొచ్చు' అనే భావన కలుగుతుంది. కానీ ఆయన సినిమాల్లో కనిపించే ఆ సరళతను తెరపై చూపించడం అంత సులభం కాదు. అదే ఆయన ప్రత్యేకత. ఆ సింప్లిసిటీయే నిజమైన కష్టం" అని అజయ్ భూపతి వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారగా, సినీ అభిమానులు, ఫిల్మ్ మేకర్స్ మధ్య ఆసక్తికర చర్చకు దారితీశాయి.

## కంగనా వ్యాఖ్యలు దుమారం.. యువతను గౌరవించాలన్న సోనూ సూద్



భారతీయ జనతా పార్టీ ఎంపీ, నటి కంగనా రనౌత్ యువత (జెన్ జెడ్)పై చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. నీట్‌యూజీ 2026 పేపర్ లీక్ వ్యవహారంపై జరిగిన ఆందోళనల్లో యువత ప్రవర్తనను ఉద్దేశించి కంగనా చేసిన వ్యాఖ్యలకు బాలీవుడ్ నటుడు సోనూ సూద్ ఘాటుగా స్పందించారు. మీడియాతో మాట్లాడిన ఆయన, యువతపై చేసిన వ్యాఖ్యలు సరికావని పేర్కొంటూ, "నటులను స్టార్లుగా నిలబెట్టేది యువతే. వారి అభిమానం, ప్రేమ వల్లే కళాకారులు ఈ స్థాయికి చేరుకుంటారు. అందుకే యువతను ఎప్పుడూ గౌరవించాలి" అని అన్నారు. కంగనా చేసిన వ్యాఖ్యలను ఆయన "సిగ్గుచేటు"గా అభివర్ణించినట్లు వార్తలు వెలువడ్డాయి. మరోవైపు, ఈ వివాదంపై కంగనా రనౌత్ స్పందిస్తూ గురుపౌర్ణమి సందర్భంగా ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక సెల్ఫీ వీడియోను పంచుకున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగాల నుంచి స్ఫూర్తి పొంది ఈ వీడియోను విడుదల చేస్తున్నట్లు పేర్కొన్న ఆమె, ఇటీవల జరిగిన నిరసనల్లో కొందరు యువత ప్రదర్శించిన ప్రవర్తన సభ్య సమాజం ఆమోదించలేనిదని అన్నారు. బహిరంగ ప్రదేశాల్లో, ముఖ్యంగా మహిళలు, పిల్లలు, వృద్ధుల సమక్షంలో అసభ్యకరంగా ప్రవర్తించడాన్ని సాధారణ విషయంగా చూడకూడదని కంగనా వ్యాఖ్యానించారు. మాట్లాడే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛ ప్రతి ఒక్కరికీ ఉన్నప్పటికీ, అవి ఇతరుల హక్కులు, గౌరవాన్ని దెబ్బతీయకుండా ఉండాలని పేర్కొన్నారు. సమాజంలో జీవించే ప్రతి వ్యక్తి క్రమశిక్షణ, సామాజిక బాధ్యతలను పాటించాల్సిన అవసరం ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. అలాగే, "ఫెమినిజం" పేరుతో కొందరు యువతను బాధ్యతారాహిత్య దిశగా ప్రోత్సహిస్తున్నారని కంగనా విమర్శించారు. గురుపౌర్ణమి సందర్భంగా ద్వేషం, అసభ్య ప్రవర్తనకు దూరంగా ఉండి, గురువుల బోధనలను అనుసరిస్తూ వ్యక్తిత్వ వికాసంపై దృష్టి పెట్టాలని యువతకు ఆమె పిలుపునిచ్చారు. కంగనా, సోనూ సూద్ వ్యాఖ్యలతో ఈ అంశం ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. యువత పాత్ర, వ్యక్తిగత స్వేచ్ఛ, సామాజిక బాధ్యతలపై నెటిజన్ల మధ్య విస్తృత చర్చ కొనసాగుతోంది.



## రామ్ చరణ్.. ఉపాసనతో ప్రత్యేక పూజలు

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ఇటీవల కుడిచేతి మణికట్టుకు విజయవంతంగా శస్త్రచికిత్స చేయించుకున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆయన ఆరోగ్యంగా కోలుకుంటుండగా, ఆపరేషన్ అనంతరం తొలిసారిగా కోయంబత్తూరులోని ప్రసిద్ధ అయ్యప్ప స్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు సతీమణి ఉపాసన కూడా ఆలయంలో దర్శనం చేసుకున్నారు. అనంతరం ఆలయ అధికారులు దంపతులకు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేసి ఆశీర్వదించారు.రామ్ చరణ్ ఆలయ దర్శనానికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సాధారణ దుస్తుల్లో, ప్రశాంతంగా కనిపించిన రామ్ చరణ్‌ను చూసిన అభిమానులు ఆయన త్వరగా పూర్తిస్థాయిలో కోలుకోవాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఇటీవల రామ్ చరణ్ కుడిచేతి మణికట్టుకు సంబంధించిన సమస్య తీవ్రతరం కావడంతో కోయంబత్తూరులోని ప్రముఖ గంగా ఆస్పత్రిలో శస్త్రచికిత్స నిర్వహించారు. ఈ ఆపరేషన్‌కు ఆర్థోపెడిక్ వైద్యరంగంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన డాక్టర్ ఎస్. రాజశేఖరన్ నేతృత్వం వహించారు. అత్యుత్తమ వైద్యం అందించేందుకు అమెరికాలోని మయామికి చెందిన ప్రముఖ హ్యాండ్ అండ్ రిస్ట్ సర్జన్ డాక్టర్ అలెహాండ్రో బాడియాను ప్రత్యేకంగా కోయంబత్తూరుకు రప్పించి శస్త్రచికిత్స నిర్వహించినట్లు సమాచారం. గతంలో మెగాస్టార్ చిరంజీవికి ఎదురైన క్లిష్టమైన వెన్నెముక సమస్యకు కూడా డాక్టర్ ఎస్. రాజశేఖరన్ విజయవంతంగా చికిత్స అందించారు. అదే నమ్మకంతో రామ్ చరణ్‌కు కూడా ఆయన వైద్య బృందం చికిత్స అందించింది. ప్రస్తుతం రామ్ చరణ్ కోలుకుంటుండగా, త్వరలోనే తన సినిమా షూటింగ్‌లలో పాల్గొనే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com. PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034